ఆంధ్రభూమి

సర్వవిషయములను చర్చించు
సచిత్రాంధ్ర మాసపత్రిక.

స్థాపితము ౧౯౩౩.
సాలుచందా 1-8-0.

సంపాదకుడు :
ఆంధ్ర శేషగిరిరావు, బి.ఏ.

సంపుట : ౬. ఈశ్వర, మాఘము : ఫిబ్రవరి, 1938. సంచిక : ౭.

కథావశేషుడు కోడి రామమూర్తినాయుడు

ఆంధ్రులలో రాష్ట్రేతరకీర్తిని వహించినవారే వ్రేళ్ళపై లెక్కింపగలుగునంత మందిమాత్ర మున్నారు. ఇక దేశాంతర, ఖండాంతర ఖ్యాతిగాంచిన ఆంధ్రమహాశయులు లెక్కకు మిక్కిలి తక్కువగా నుందురని చెప్పవలసిన పనియేమి ?

లెక్కకు మిక్కిలి తక్కువగానుండు ఖండాంతరఖ్యాతిగాంచిన ఆ ఆంధ్రమహాశయులు ఎవ్వరు! ఎటుచూచినను, ఎన్నిసారులు చూచినను ప్రొఫెసర్ సర్వేపల్లి రాధాకృష్ణుడు, ప్రొఫెసర్ కోడి రామమూర్తి నాయుడు—ఈ ఇద్దరే. ఒకరు వేదాంతమున అంతిమ వేదము, రెండవవారు మల్ల యుద్ధమున యుద్ధమల్లుడు.

ఈయుద్ధమల్లుని ఆంధ్రభౌతిక దేహము గతమాసము 16-వ తేదీని ఓఢ్రరాష్ట్రము నందలి శంబలపూర్ మండలమున బలంగీరులో పంచత్వము నొందినది.

రామమూర్తినాయుడు గొప్ప హఠయోగి. రేచక, పూరక, కుంభకములను లెస్సగ స్వాధీనముచేసికొనిన సాంయుగీనుడు అతడు. రామమూర్తినాయుని రొమ్ముకొలత నలుబది యెనిమిది అంగుళములు. రేచకముచే అతడు దానిని నలుబదిరెండు అంగుళములకు తగ్గించువాడు. పూరకముచే నలుబదిరెండుఅంగుళముల రొమ్ము ఏబదిఎనిమిది అంగుళములకు పెంచువాడు. ఊపిరి విడచియు, బిగపట్టియు ఆతడు చేయుచుండిన కార్యములు చూపఱులచే ఆహా అనిపింపజాలియుండెను. కుంభకస్థితిలో నుండగా రొమ్మునకు కట్టబడిన ఇనుపగొలుసులు రేచకస్థితిలో సడలి జారిపోవునవి—పూరకస్థితిలో పుటుక్కున తెగిపోవునవి. ఇట్లు ఆమల్లుడు ఇనుపగొలుసులను అలవోకగా త్రెంపివైచువాడు. గొలుసు ఇనుముదే అయియుండవలెను. కాని కాశిలో ఈయబడిన గొలుసులో ఇత్తడిపాలుకూడ నుండుటచే ఇరువదియొకటవ పూరకమునకుగాని ఆతడు దానిని త్రెంపలేకపోయెను. ఆయదనున ఆతనికి గొప్ప గండము తప్పెను.

తండ్రి నారాయణస్వామినాయుడు పోలీసు ఉద్యోగి. రామమూర్తినాయని బలశౌర్యములు ఆపోలీసుఉద్యోగి ప్రసాదములే. సాంసిద్ధికమైన ఈబలమును రామమూర్తి

నాయుడు సాధనచే పెంపొందించుకొనినాడు. సముద్రతీరములందు శక్తికొలది పరుగులెత్తు చు కొలదిశక్తిని కోటిగుణితమొనర్చుకొని నాడు. సాంహానీనకమగు ఈసాధనచే అతని రొమ్మును, తొడలును బాగుగ పెరిగినవి.

ఇంతకును ఈ సాదనజోదు స్వార్థపరుడు కాడు. నేర్చినవిద్యను శిష్యులకు మెలకువతో బోధించువాడు. సర్కసు కంపెనీ మకాముల వెంట మకాములు చేయుచున్నను శిష్యులకు మల్లవిద్యావబోధము మామూలుగ సాగ వలసినదే. విశేషమేమన కాశీ హిందూవిశ్వ విద్యాలయమున అతడు కొంతకాలము ఫిజి కల్ కల్చర్ ప్రొఫెసర్‌గ నుండెను.

ఆదిలో ఈ బంగారుపళ్లెమునకు గోడ చేర్పు ఇచ్చిన ఉచితజ్ఞులు స్వర్గీయ తునిరాజావారు. వారిసాయముతోడనే సర్కసు కంపెనీ స్థాపింపబడినది. 1910-వ సంవత్సరమున అలహాబాదునగరమునందు పరిశ్రామికప్రద ర్శనము జరిగినపుడు రామమూర్తినాయుని సర్కసు అచటికివెళ్లెను. ఒక్క అలహాబాదు నకే అననేల ? నాయుని సర్కసు తొక్కిచూడని పెద్ద పట్టణములేదు హిందూదేశము నందు.

పలువురు సంస్థానాధిపతుల సమక్షమున సర్కసుప్రదర్శనముగావించి రామమూర్తి నాయుడు అపారధనమును, అపారయశమును సముపార్జించెను. ఐదవజార్జి చక్రవర్తి యువ రాజుగా భారతదేశమునకు వచ్చినపుడు వారి యెదుట రామమూర్తినాయుడు బెంగుళూరున ప్రదర్శనముగావించి స్వర్ణపతకమును బడసెను.

1912-లో రామమూర్తినాయుని సర్కసు సముద్రములనుదాటి ఇంగ్లాండువెళ్లెను. ఆ నాటి ఇంగ్లండుపత్రికలు ఈ ఆంధ్రపుత్రుని బలప్రదర్శనమును బహుథా శ్లాఘించినవి. ఆనాడు ఆంధ్రకీర్తి అతురరమ్యరూపముతో ఖండాంతరములందు ఖ్యాతమైనది. నాయుని జీవితకథనము స్టాండర్డు ఎన్‌సైక్లోపీడియాను కూడ నలంకరించినది.

మలయాస్టేట్సు సంచారమున ఈర్ష్యాళు వులు నాయునికి విషప్రయోగముచేసిరి. కాని అతని జఠరము వాతాపిని జీర్ణించుకొనిన అగస్త్యుని జఠరమునకువలె ఆవిషమును జీర్ణించు కొనినది.

1924-వ సంవత్సరమునుండి రామమూర్తి నాయుడు సర్కసుకంపెనీనుండి విరమించు కొనెను. అతిమాత్రవ్యాధివలన కాలిమీద లేచిన వ్రణము ఆతనిని కాలులేనివానిగ చేసినది. అప్పటినుండియు ఆతడు తిరిగి ఆరోగ్య మును కోల్పోకలేదు.

ఈమల్లవీరుని జననము విశాఖపట్టణ మండలమునందలి వీరఘట్టములో; విద్యాభ్యాసము విజయనగరమునందలి మహారాజావారి కళాశాలలో. అతని జన్మస్థలమగు వీరఘట్ట ములోని వీరపదమును, అతని విద్యాస్థలమగు విజయనగరములోని విజయపదమును కలిపి నచో అతని జీవితచరిత్ర అంతయు ఒక్కపద ముతో చెప్పినట్లు అగును.

1880-వ సంవత్సరమున పుట్టుపూర్వొంది పెరిగి భీమబలుడై గొలుసులు తెంపి, రొమ్ము పై ఏనుగును నిలిపి, మోటార్లు ఆపి వీరవిజ యమునందుచు ఏబదియెనుబది సంవత్సరములు జీవించిన ఈ ఆంధ్రపుత్రుని శారీరకదేహము ఇక చూడలేము. చూడవలదనుకొను వారికి కూడ అతనికీర్తిదేహము మహోన్నయమయి ఎల్లకాలమునకును పొడగట్టుచునే యుండును.

అతని ఆత్మకు శాంతికలుగునుగాక !

ఒట్టిపుకారులు

కాంగ్రెస్ వర్కింగు కమిటీవారు ఈసారి మళ్ళీ ఆంధ్రరాష్ట్రప్రస్తావన తెస్తే రాజగోపాలాచారిగారు తమ నల్లకళ్ళజోడు వాడ్డం మానేస్తానన్నారట.

... ...

ప్రకాశంగారు పట్టుపట్టిన గోదావరిజిల్లా తొర్రిగడ్డ ప్రాజెక్టు ఈసారికూడా బడ్జెట్టులో వెనకపడింది కాబట్టి కృష్ణాజిల్లాకు చెందిన కాశేశ్వరరావుగారు మునపటి మల్లే వారానికి ఓసారి కాకుండా ఇకమీద రోజూ స్నానం చేస్తారట.

... ...

జనవరి 27-వ తేదీనాటి మదరాసు శాసనసభా సమావేశంలో బయట ప్రేక్షకులకోరకు చెట్లకింద పెట్టిన లవుడ్ స్పీకర్సుదగ్గర కొందరు మెంబర్సు కూడావచ్చి కూర్చోడం నిజమేకాబట్టి అట్టిమెంబర్ల జీతంలో కొంత, ట్రావెలింగు ఎలవెన్సులు పూర్తిగాను తగ్గించేస్తారట.

... ...

మద్రాసులోని పంచాయతీ సభకు ప్రతినిధులుగా పోతామనిచెప్పి పంచాయతీడబ్బు తీసుకుని మద్రాసు వచ్చి కాలాడి నిలవకుండా బెంగుళూరు చూడ్డానికి పోయిన పంచాయతీప్రతినిధుల పేర్లన్నీ అకారాదిగ లోకల్ బోర్డు ఇనస్పెక్టరుగారు ఫోర్టుసెయింట్ జార్జి గెజెట్‌లో అచ్చువేస్తున్నారట.

... ...

ఈకరువురోజుల్లో పలువురు క్యాండిడేట్లవద్ద అప్లికేషన్ ఫీజు అని పదిరూపాయిలు పెర్మనెంటుగా గుంజేసి అందులో తమ ఇష్టానికివచ్చిన ఒక్కణ్ణే సెలక్టుచేసినా అతనికైనా సర్వీస్ దొరికే విషయంలో పూచీపడకుండావుంటే సర్వీస్ కమిషన్ వారిని తొలగించడానికి కాంగ్రెస్ గవర్నమెంటువారే పూచీపడతారట.

—వి. విశ్వనాధము, బి.ఏ.

ఇటలీనియంత ముసోలినీ

ఆరోగ్యసూత్రాలు

నాకు 1925 లో ఒకసారి జబ్బుచేసింది. అప్పటి నుంచి తిరిగి ఎప్పుడూ జబ్బుచెయ్యలేదు. అనారోగ్య కారణంచేత అప్పటినుంచి నాకు ఒక్కరోజుకూడా వ్యర్థంకాలేదు.

... ...

ఏమాత్రం బద్ధకంగాఉన్నట్లు కనిపించినా కనీసం ఇరవైనాలుగుగంటలు ఉపవాసం చేస్తాను.

... ...

శాకాహారంతప్ప మరోటితినను.

... ...

గాఢమైన మద్యం ఆరోగ్యానికి చాలాహానిప్రదమైందని నాతాత్పర్యం. కాని నేను ఉద్యోగరీత్యా జరిగే విందుల్లో కొద్దిగా ద్రాక్షసారాయం రుచి చూస్తాను.

... ...

పొగాకు మితంగా వాడుకోవచ్చునని నా అభిప్రాయం. కాని ఐరోపామహాసంగ్రామకాలంనుంచీ నేను ఇంతవరకు ఒకసారికూడా పొగత్రాగలేదు.

... ...

కాఫీకాని, తేయాకుకాని తాగను. నిమ్మఆకుల కషాయంమాత్రం అప్పుడప్పుడు తాగుతూవుంటాను.

... ...

కాయకష్టం పడేవారికి మితంగా ద్రాక్షసారాయం తాగడం ఉపయోగకరంగా వుంటుందని నా అభిప్రాయం.

... ...

సాధారణంగా రోజుకి ఏడెనిమిది గంటలు నిద్రపోతాను. రాత్రి పదకొండుగంటలికి పడుకుని ఉదయం ఏడింటికి లేస్తాను.

... ...

పగలు ఎంతతీవ్రంగా పనిచేసినా పడుకునీ పడుకోవడంలో నాకు నిద్రపడుతుంది.

... ...

నిద్రపట్టడానికి నేను ఏమీ సాధనాలు ఉపయోగించను.

... ...

నేను ఎప్పుడూ పగలు కోడికునుకేనా తీయను.

విజ్ఞానవాటిక

నూటికి నూర్గురు చదువుకున్న జపానుదేశపు రాజధాని నగరమైన ఒక్క టోకియోలో 435 గ్రంథాలయాలు ఉన్నాయి.

... ...

ప్రపంచంలోకల్లా బెల్జియం జనసమ్మర్దానికి పేరుకెక్కింది. అక్కడ ఒక్కొక్క చతురపుమైలు ప్రదేశంలో 700 మందికి పైగా నివసిస్తున్నారు.

... ...

బంగారంనిలవలలో ప్రపంచకాని కంతటికీ అమెరికా సంయుక్తరాష్ట్రాలు మొదటివి. అక్కడ 1935 నాటికి 292 మిలియను ఔన్సుల బంగారం నిలువ ఉంది.

... ...

ప్రపంచంలో 1936 లో 6,396,700 జేళ్ళ జనపనార ఉత్పత్తి అయింది. ఇదిఅంతా హిందూదేశంలోనే ఉత్పత్తి అయింది.

... ...

1936 లో ప్రపంచం మొత్తంమీద 27,548,718 టన్నుల పంచదార తయారైంది. అందులో హిందూదేశంలో తయారైంది 6,102,000 టన్నులు మాత్రమే.

... ...

ప్రపంచంలో ఏడాదికి తయారయ్యే 31,000 వేల ఔన్సుల బంగారంలోను 325 వేల ఔన్సులు మాత్రమే హిందూదేశపుది.

... ...

విద్యార్థులు పాఠశాల విద్యకోరకు వెచ్చించే పది ఏళ్ళ కాలానికిన్ని శలవలు మొదలైనవి పోతే నికరం చదివేకాలం 2400 గంటలుమాత్రమే.

... ...

టీకప్పుల అడుగుని మిగిలిపోయి వృథా అయే పంచదార ప్రపంచం మొత్తంమీద ఏడాదికి మూడు వందల టన్నులకు మించిఉంటుందని అంచనా వేయబడింది.

జిజ్ఞాస

౧౦౪. జామాతశబ్దానికి అర్థం

'జామాత' అనగా అల్లుడని అంటారు. ఆశబ్దానికి గల ఉత్పత్తి అర్థమేమిటి?

౧౦౫. కాఫీకి ఆద్యబ్రహ్మ ఎవరు?

ఇపుడు విస్తారంగా వాడుకలోవున్న కాఫీపానీయానికి ప్రారంభకుడు ఎవరు? అతను ఏదేశంవాడు? ఎప్పటివాడు?

—కె. రామమూర్తి, యల్. యమ్. ఇ.

౧౦౬. తెనుగువారిలో సినీమాఫోటోగ్రాఫరు

తెనుగువారిలో సినీమా ఫోటోగ్రాఫరు ఎవరైనా ఉన్నారా? ఉంటే ఆయన ఫోటోతీసిన తెలుగు ఫిల్ములు ఏవి?

—బొడ్డు బాపిరాజు.

౧౦౭. పాదాలపూజ ఎందుకు?

'మేము భగవంతుని ముఖాన్నుంచి పుట్టేము. మీరు పాదాలనుంచి పుట్టేరు' అని శూద్రుల్నిగూర్చి పలికే బ్రాహ్మలు ఆభగవంతుని పాదాలు పూజించడంలో ఏమైనా అర్థంవున్నదా?

—మద్దెల సుబ్రహ్మణ్యము.

౧౦౮. తెలుగుదేశంలో గాజులపరిశ్రమ

మద్రాసురాజధానికంతటికీ తెలుగుజిల్లాలలోనే గాజుల పరిశ్రమ ఉండేదని ఒకరంటున్నారు. ఇది ఎంతవరకు నిజం? ఆరవదేశంలో ఈపరిశ్రమ లేకపోవడానికి కారణంఏమిటి?

—తిరువీధుల తాయారమ్మ.

౧౦౯. ఆంధ్రదేశంలో ఆటవస్తువులపరిశ్రమ

ఆంధ్రదేశంలో ఆటవస్తువుల పరిశ్రమ ఎక్కడెక్కడ ఏయేస్థితిలో వున్నది?

—వల్లమన్నాటి కుటుంబరావు.

సంపాదకుని విన్నపములు

1. 'ఆంధ్రభూమి' లో ప్రచురించిన 'భాగ్యసౌధమును' గురించి :—

ఆంధ్రభూమిలో 1937 జూన్, సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు సంచికల యందు శ్రీయుత శ్రీగిరిరాజు రామారావుగారు ప్రచురించిన 'భాగ్యసౌధము' అను వ్యాసమును ప్రశంసించుచు పాఠకులు పలువురు మాకు లేఖలను వ్రాయుచున్నారు. వానిలో సికిందరాబాదునుండి శ్రీయుత సింగం సత్యనారాయణగుప్తగారు వ్రాసిన ప్రశంసను ఉదాహరణమునకుగాను ఇచట ప్రచురించుచున్నాము : "అపుడపుడు శ్రీగిరిరాజు రామారావుగారు బహు శ్రమతో ఆంధ్రభూమి ప్రియపాఠకులకొరకు 'భాగ్యసౌధము' నిర్మించి ఆంధ్రభూమిలో సమర్పించినందులకు వారికేకాక, ప్రకటించినందులకు మీకెంతయు మేము కృతజ్ఞులమనియు; ఈపై 'భాగ్యసౌధమ'ను వ్యాసము పుస్తకరూపముగా ప్రకటించిన ఆంధ్రసోదరులకు యెంతయో మేలుచేసిన వారౌదురని తెలుపుచు విన్నవించుకొనుచున్నాడను."

2. యోగరత్నాకర ప్రచురణము : వైద్యపరిశోధకులకొక విజ్ఞప్తి :—

నెల్లూరు నందలి ది ఇండియన్ మెడికల్ స్టోర్సు అండ్ డిస్పెన్సరీ ప్రొప్రయిటరులగు శ్రీయుత యేటూరు శ్రీనివాసాచార్యులుగారు 'ఆంధ్రభూమి'ద్వారా ఆంధ్రభూమియందలి వైద్యపరిశోధకులకీ విజ్ఞప్తి నందించుచున్నారు : "యోగరత్నాకరమను వైద్యగ్రంథము అత్యంతోపయుక్తమైన ప్రమాణగ్రంథరాజమనుట సర్వజనవిదితము. మైసూరుప్రభుత్వము వారు మైసూరునందు తొలుత ఆయుర్వేదకళాశాలను స్థాపించినపుడు అప్పటి పండితవైద్యులీగ్రంథమును వైద్యవిద్య నభ్యసించు విద్యార్థులకు ప్రధానపఠనీయగ్రంథముగ నిర్ణయించియుండినందునను, తదితరపండితవైద్యులెల్లరును విశేషముగ దీనిననుసరించియే తమచికిత్సాక్రమమును నడుపుచుండుటవలనను నీగ్రంథమునకు మనరాష్ట్రమున వ్యాప్తికలిగియున్నది. తదనుయాయులగు వైద్యవరులును వైద్యాభిమానులగు మిత్రులును నన్నీగ్రంథము నాంధ్రతాత్పర్యసహితముగవ్రాసి ముద్రించవలయునని ప్రోత్సాహించుటవలనను, సంస్కృతభాషను వైద్యశాస్త్రసంప్రదాయమును తెలియనివారుకూడ ఈగ్రంథమునందుండు అమూల్యములగు విషయములను గ్రహించుటకు సులభముగ నుండునను కారణమువలనను ప్రస్తుతము ముద్రితములైన కొన్ని ప్రతులను, ఈగ్రంథమందలి కొన్నిభాగములు మాత్రము గల వ్రాతప్రతులను కొన్నింటిని సంపాదించి యథామతి సంస్కరించి సంకీర్ణములై యుండిన విషయములను ప్రకరణానుగుణముగజేర్చి సంప్రదాయానుసారముగ సుబోధమగునటుల 'అమృతకర' మను ఆంధ్రతాత్పర్యమును వ్రాసి ముద్రింపించినాడను. ఈగ్రంథాదియం దిట్టి మహోపకారకమైన గ్రంథమును రచించిన గ్రంథకర్తయొక్క చరిత్రమును సంగ్రహముగ నేని దెలుపుట సమంజసమును అత్యంతావశ్యకమునై యున్నది. కాని నాకు లభ్యములైన గ్రంథములం దెచ్చటగాని ఈగ్రంథకర్తయొక్క దేశకాలాదులను దెలిసికొనుటకు దగిన యాధారము లెవ్వియును గానబడలేదు. కాబట్టి బహువిధవాఙ్మయపరిశీలనాశీలురగు వైద్యపండితు

లెవరైన 1. యోగరత్నాకరగ్రంథకర్త యెవరు? 2. ఏకాలమునాటి వాడు? 3. ఆయన రచించినట్టియు, సంగ్రహించినట్టియు ఇతర గ్రంథము లెవ్వి? 4. ఆయన సమకాలికు లెవరు? 5. ఆయన దేశమేది? 6. ఆతని జీవితసంగ్రహము. అను విషయములను నాకు తెలిపిన కృతజ్ఞతాపూర్వకముగ గ్రంథాదిని ప్రచురింపగలనని మనవి."

• నమ్మాళ్వార్స ప్రచురణములు :—

విజ్ఞానచంద్రిక తన విజ్ఞానచంద్రికాప్రసారమును నిలిపివైచినపిమ్మట ఆంధ్రదేశమున విజ్ఞానవిషయికగ్రంథముల ప్రచురణము విరివిగ సాగలేదనుట సత్యేతరముగాదు. ఇటీవల ప్రజల మనము ఎంతసేపును వినోదపఠనమున పర్యాప్తమైనది. గ్రంథప్రకాశకులును, పత్రికాప్రచురణకర్తలును ఇందులకు ఉపబలముగా వినోదపఠనమునకైన గ్రంథములను, పత్రికలను ప్రచురించుటకు దొరకొనిరి. విజ్ఞానము కలిగింపని కేవలవినోదప్రచురణములవలన ప్రజలకు విశేషలాభముండదను సత్యమును రాజమండ్రియందలి హిందూస్థాన్ పబ్లిషింగు హౌస్‌వారును, మద్రాసు నందలి నమ్మాళ్వార్స కంపెనీవారును గ్రహించి ఇపుడు విజ్ఞానదాయకములగు గ్రంథముల ప్రచురణకు పూనుకొని ఆంధ్రప్రజాసంఘము కృతజ్ఞతకు పాల్పడుచున్నారు. అందు నమ్మాళ్వార్సకంపెనీవారు ఇంతవరకు శశాంకయను నాటకమును, తిలోత్తమ - పాపయ్యశర్మ అను కథాగ్రంథమును, స్పెయిన్ దుస్థితి, చీనా జపాను ప్రళయము అను రెండు రాజకీయగ్రంథములను మొత్తము నాలుగు గ్రంథములను ప్రచురించినారు. వీనినిగూర్చిన ప్రత్యేకవిమర్శనము పైమాసపు ఆంధ్రభూమిలో ప్రచురింతుము. ఈ నాలుగు గ్రంథముల కర్తలును వరుసగా గుడిపాటి వెంకటచలము, కవితిలక పులవర్తి కమలావతీదేవి, ప్రతాప రామసుబ్బయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు అనుటచే ప్రకటనకర్తలు ప్రజ్ఞామతులగు రచయితలనే సంపాదించిరనుట తేటతెల్లమగును. గ్రంథముల గెటప్ ముద్దులు మూటగట్టుచున్నది. ఏడాదికి ఇట్టివి ఇరువదినాలుగు గ్రంథములు వెలువరించవలయునను ప్రకటనకర్తల సంకల్పము శతథా కొనియాడదగినది. ప్రతి పుస్తకము సాధారణముగ 128 పుటలుండును. ప్రతిదాని వెలయు ఆరుఅణాలు మాత్రమే. ఏడాదికి ప్రచురింపబడు 24 గ్రంథముల వెలయు 9 రూపాయలు అగును. ఒకేసారి ముందుగా 7 రూపాయలు పంపువారు చందాదారులుగ పరిగణింపబడుదురు. ఉదారులగు ఆంధ్రమహాశయు లెల్లరును ఈ యుద్యమమునకు సహకారులగుచు భాషాపోషకు ఉచితమగు ప్రోత్సాహము చేయుదురని నమ్ముచున్నాము.

• ప్రజామిత్ర సంక్రాంతిసంచిక :—

ఈ ఈశ్వర మకరసంక్రాంతికి 'ప్రజామిత్ర'వారు ప్రకటించిన ప్రత్యేకసంచిక సంక్రాంతిపర్వమునకు సంబంధించిన చిత్రములతో; శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, శ్రీ అడవి బాపిరాజు, శ్రీ విశ్వనాథకవిరాజు, శ్రీ బి.టి. రాఘవాచార్యులు. శ్రీ గుడిపాటి వెంకటచలం మున్నగు ఆంధ్రపండితప్రకాండుల వ్యాసములతో పరిపుష్టినొంది పరిఢవించుచున్నది. ఇట్టి సంక్రాంతి సంచికలను పెక్కింటిని ప్రచురించుచుండునట్లు భగవానుడు ప్రజామిత్రను అనుగ్రహించుచుండును గాక అని మనఃపూర్వకముగ గోరుచున్నాము.



పెళ్ళిఅనేది అలవాటునుబట్టియేర్పడ్డ ఆచారం

రచయిత:

జి. వెంకటరావు, బి. ఏ.

పెళ్లి అంటే ఏమిటి?

పెళ్ళిఅనేది సంఘంలో స్త్రీపురుషుల సంభోగానందానికి అనుమతిని ఇచ్చే లైసెన్సు అని పాశ్చాత్యుల అభిప్రాయం. పాశ్చాత్యులదృష్టిలో అది ఒక కంట్రాక్టుమాత్రమే. కాని భారతీయులకు అది అల్లాంటిదికాదు. వారికి అది ఒక పవిత్రకర్మ.

పెళ్లివలనిలాభాలు ఏమిటి?

బాగా ఆలోచిస్తే పెళ్ళివల్ల పొందే లాభం ఒక్క సంభోగానందమే కాదని తేలిపోతుంది. పెళ్ళి ఆర్థికసంస్థ కూడాను. భార్యవల్ల సంభోగానందాన్ని పొందడమే కాకుండా భర్తఐనవాడు ఆమెను రక్షించవలసీ, పోషించవలసీ వుంటుంది. భర్తవల్ల పోషించబడడం, రక్షింపబడడం కాకుండా భార్యఐన ఆమె అతనికొరకు అవసరమైతే పనికూడా చేయవలసి వుంటుంది.

పెళ్లికి కావలసినవి ఏమిటి?

పెళ్ళిజరగడానికి పెళ్ళిచేసుకునే స్త్రీ పురుషుల ఇష్టమే కొన్నిచోట్ల ప్రధానమైంది; కొన్నిచోట్ల వారి ఇష్టంతో నిమిత్తంలేకుండా వారి పెద్దలే పెళ్లిళ్లు ఖాయంచేస్తారు; కొన్నిచోట్ల వధూవరులసమ్మతీ, వారి తలిదండ్రుల సమ్మతీ కావలసివుంటుంది. ఏమైనా పెళ్ళిఅనేదానికి ప్రతిదేశంలోనూ ఏదో ఒక తంతు వుంటూనే వుంటుంది. ఆతంతు పూర్తిఔతేకాని పెళ్ళి తీరినట్లు సంఘన్యాయం ఒప్పుకోదు.

పెళ్లి ఆచారం ఎట్లా ఏర్పడ్డది?

అయితే ఈపెళ్ళిఆచారం ఎప్పుడు ఎట్లా ఏర్పడ్డది అంటే సమాధానం చెప్పడం చాలాకష్టం. అనాదికాలంలోవుండే అలవాటునుబట్టి ఈ ఆచారం ఏర్పడ్డదని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. అనాదికాలంలోకూడ ఒక పురుషుడూ, ఒకతెకాని పలువురుకాని స్త్రీలూ సంభోగానందంకొరకు-పుట్టిన పిల్లల్ని సాముదాయకంగా పెంచుకునేకొరకు ఒక గుంపుగా ఏర్పడే అలవాటు వుండి వుండాలి.' ఆ అలవాటు క్రమంగా ఆచారంగాను, ఆ ఆచారం క్రమంగా న్యాయంగాను స్థిరపడివుండాలి.

ఈవాక్యంయొక్క అర్థం జంతువుల్లోనూ, పక్షుల్లోనూ వుండే సంభోగసంబంధమైన అలవాట్లను గుర్తిస్తే సులభంగా అవగతం ఔతుంది.

క్రిముల్లో కుటుంబమర్యాద వుందా?

కొన్నిక్రిములలో స్త్రీపురుషసంయోగం అంత చెప్పతగిందిగా వుండదు. కొన్ని క్రిములలో గ్రుడ్లు ఎండవేడిమికే చితుకుతాయికాని తల్లి పొదగడం

మోటైన పనులు ఏమీ చేయదు. ఈసందర్భంలో తల్లిపని గ్రుడ్లను భద్రమైన స్థలంలో పెట్టడంవరకే. మరికొన్ని క్రిములలో పిల్లలకోసం గూటిని తల్లి తయారుచేస్తుంది. కొన్ని క్రిములలో తల్లితోపాటు తండ్రికూడా గ్రుడ్లను కాపాడడంవుంది.

జలచరముల మాట ఏమిటి?

చేపలలో విశేషభాగం తల్లిదండ్రుల సహాయం లేకుండానే పొదగబడతాయి. కొన్ని చేపలలో మగ చేప పిల్లల్ని రక్షించవలసివుంటుంది. ఒక చక్కని గూటిని తయారుచేసి అందు తనభార్య పెట్టిన గ్రుడ్లని మగచేప కాస్తూవుంటుంది. ఒక్కొక్క మగచేప గ్రుడ్లని తనలో ఇముడ్చుకొని మోస్తూవుంటుంది. సరీసృపములు సాధారణంగా ఏదో వెచ్చటిస్థలంలో గ్రుడ్లని పెట్టేసిపోవడం వున్నా కొన్నిపాములు గ్రుడ్లని కుప్పగా పెట్టి ఆకుప్పచుట్టూ చుట్టుకుని పడుకుంటాయి. ఆడమొసళ్లు తమ పిల్లల్ని మోస్తూ సంచరిస్తాయి.

నిజమైన పెళ్లి పద్ధతి పక్షుల్లోనేనా?

పక్షులలో దాంపత్యధర్మం ఇంతకంటె ఉత్తమ స్థితిలో మనకు గోచరం ఔతుంది. ఎదకాలంలోనే కాకుండా పిల్లలుపుట్టిన తర్వాతకూడా మగపక్షీ, ఆడపక్షీ జంటగా వుంటాయి. తల్లిపక్షిలోనూ, తండ్రి పక్షిలోనూ మాతాపితృధర్మం తీవ్రతరమైవుంటుంది. గూటిని కట్టడంలో ఒకదానికి ఒకటి సాయంచేసుకుంటాయి. సాధారణంగా మగపక్షి సామగ్రి తెస్తుంది, ఆడపక్షి గూటిని తయారుచేస్తుంది. ప్రసవకాలంలోవుండే పలు బాధ్యతల్ని రెండూ సమానంగా వహిస్తాయి. పొదగడం సామాన్యంగా తల్లిపక్షే చేస్తుంది. కాని అప్పుడప్పుడు మగపక్షి ఆపనికి పూనుకుని ఆడపక్షికి విశ్రాంతిఇస్తూ, ఆహారం తెచ్చుకోడానికి వీలుకలిగిస్తూ వుంటుంది. ఆడపక్షి పొదుగుతూవుంటే మగపక్షిపోయి ఆహారంతెచ్చి ఆమెకు ఇస్తూ గూటికిఏమీ అపాయంరాకుండా కాపాడుతుంది. గ్రుడ్లుచితికి పిల్లలైన కొత్తలో ఆడపక్షీ, మగపక్షీకూడా చాలాసేపు గూటిని విడిచిపోవు. అపాయంకలిగే సందర్భంలో ఆపక్షులు రెండూ ఏకబాధ్యతతో వర్తిస్తాయి. కొన్నికొన్ని పక్షులలో పిల్లలకు తల్లిదండ్రుల సంరక్షణ పొత్తిగా చిన్నతనంలోనే వుండనిమాట నిజమే- పొట్టిజాతులలో మగవి సంసారబాధ్యతను ఏమాత్రమూ వహించనిమాట నిజమే. అయినా సాధారణంగా పక్షులలో దాంపత్యధర్మం నిశితమైవుంటుంది. ఒకసారి సంభోగానందాన్ని పొంది జంటకలసిన పక్షులు అందులో ఏదో ఒకటి చనిపోయేవరకు జంటను పాయకుండానే వుంటాయి. ఈపద్ధతిచూసి ఆనందపరవశుడై బ్రెమ్ అనే శాస్త్రవేత్త నిజమైన పెళ్ళిపద్ధతి పక్షులలోనే కనబడుతుందని చెప్పినాడు.

జంతువుల్లో దాంపత్యధర్మం ఎట్లాంటిది?

జంతువుల్నిగూర్చి ఇంతగా చెప్పడానికి వీలు కనిపించదు. జంతువులలో తల్లి పిల్లవిషయంలో బహు జాగ్రత్తగావుండేమాట నిజమే. కాని అక్కడ స్త్రీ పురుషధర్మం ఒక్క సంభోగకాలమందు మాత్రమే వుంటుంది. సంభోగానంతరం తండ్రి తల్లిఊసు ఎత్తడు. తనకుపుట్టిన సంతానవిషయంలో ఏమిన్నీ అభిమానంచూపడు. అభిమానం చూపకపోవడమే కాదు ఒక్కొక్కప్పుడు ఆసంతానాన్ని చంపడానికికూడా ప్రయత్నిస్తాడు. దీనికి వ్యతిరేకమైనఉదాహరణాలు లేకపోలేదు. తిమింగలాలు, సముద్రంలో వుండే సీల్ అనేజంతువులు, హిపోపొటమస్సులు, జింకలు, దుప్పులు, ఉడతలు, ముంగిసలు, అడవిఎలకలు, కొన్నిజాతులపిల్లులు, కొన్నిజాతుల తోడేళ్లు- వీటి అన్నింటిలోనూ పిల్లలుపుట్టిన తరవాతకూడా తల్లితండ్రి కలిసివుంటారనీ, తండ్రి కుటుంబరక్షకుడుగా వుంటాడని చెప్పబడుతూంది.

మరి కోతుల మాట ఏమిటి?

సృష్టిలో మానవునికి మిక్కిలి సన్నిహితంగా వుండే కోతుల్లో దాంపత్యధర్మం ప్రస్ఫుటంగా కని

పిస్తుంది. కోతులు మందగావున్నా ఆమంద కంతటికీ ఒక మగకోతిమాత్రమే వుంటుంది. ఒరాంగ్ యుటాన్, గొరిల్లా, చింపాజి జాతుల కోతుల్లో ఈ పద్ధతేవుంది.

సర్వదా తల్లీ తండ్రీ ఎందుకు కలిసివుంటారు?

ఒక్క ఎదకాలంలోనే కాకుండా పిల్లపుట్టేవరకు ఇట్లు కొన్నిజంతువులలో తల్లీ తండ్రీ కలిసి వుండడానికి ఏమిటికారణం అంటే జాతిని పరంపరగా నిలుపుకునే తీవ్రకాంక్షే కాని మరోటికాదని నిక్కచ్చిగా చెప్పవలసివుంటుంది. ఈరీతి జంతువులలో తండ్రి తల్లితోనూ, పిల్లతోనూ వుండడమే కాకుండా వాటిజాగ్రత్త విషయంలో మిక్కిలి శ్రద్ధగా వుంటాడు. కొన్నిజాతులు అభివృద్ధి పొందడానికి తల్లిదండ్రుల జాగ్రత్తకూడా అవసరం. తల్లిదండ్రుల జాగ్రత్త అక్కరలేకుండా జీవులు బ్రతకడానికి అనేకమైన ఇతర వీల్లు లేకపోలేదు. తల్లిదండ్రుల రక్షణలేనిచోట మరోవిధమైన అనుకూలం ఏర్పాటే వుంటుంది. చేపలు మొదలైనవాటికి తల్లిదండ్రుల రక్షణలేదు. పిల్లలు అయేలోపుగానే వానిగ్రుడ్లు ఎన్నో నశిస్తాయి. అయినా ఆజాతివి పెక్కుగ్రుడ్లని పెట్టడంచేత పోయేవిపోగా మిగిలేవానితోటే జాతి అభివృద్ధి సాగుతూవుంటుంది. పక్షులలో స్థితి ఇల్లాంటిదికాదు. గ్రుడ్లకుకావలసిన వెచ్చదనం తల్లిదండ్రులు పొదిగి పుట్టించవలసి వుంటుంది. తల్లి పొదుగుతూ వుంటే తండ్రిపోయి ఆహారసంపాదన చేసుకుని రావలసి వుంటుంది. జంతువులలో చిన్నతనంలో తల్లి సాయంలేనిదే పిల్లలు బాగా పెరగలేవు. కాని తండ్రి సాయం వాటికంత అవసరంకాదు. వాల్‌రస్ అను సముద్రపు జంతువులు, ఏనుగలు, గబ్బిలాలు వీటిలో తల్లులు, పిల్లలు గుంపులుగావుండి మగవాటిని దూరంగా వుంచుతాయి.

ఒక్క జాతి అభివృద్ధికోసమేనా?


ఇంక కోతులలోనూ తల్లిదండ్రుల రక్షణ అవసరమే అయివుంది. సాధారణంగా కోతి ఒకపిల్లనే పెడుతుంది. కాబట్టి ఆపిల్లని సాకడంవిషయంలో జాగ్రత్తవుంటేకాని జాతిఅభివృద్ధి సవ్యంగాసాగదు. సంఖ్య తక్కువ అవడంమాత్రమేకాదు వాటిల్లో కొన్నిజాతులలో బాల్యం దీర్ఘకాలవ్యాప్తమై ఉంటుంది. ఒరాంగ్ ఉటాన్ కోతికి పదిహేను సంవత్సరాలు వస్తేకాని బాల్యం వీడిందనటానికి వీలులేదు. అటువంటిస్థితిలో తల్లిరక్షణ లేకపోతే ఎట్లా?

ముందుపుట్టింది కుటుంబమా? పెళ్లా?

ఈకారణాలవల్ల ఒకకుటుంబం ఏర్పడ్డం అవసరమైంది. ఈసృష్టికి మకుటం అనతగ్గ మానవుడిలో ఈ అలవాటు క్రమంగా ఆచారమైపోయింది. పిల్లల రక్షణకోసమే ఆదిలో స్త్రీపురుషులు కలిసివుంటేవారు. ఇట్లు కుటుంబమర్యాద ముందు పుట్టి తరవాత పెళ్ళి ఆచారం అమల్లోకి వచ్చింది.

పెళ్లి అనేది అలవాటును బట్టి ఏర్పడ్డ ఆచారమేనా?

ఈ సిద్ధాంతానికి ఉపబలంగా పెక్కు ఉదాహరణలు ప్రపంచంలోని వివిధప్రాంతవాసుల వివాహవ్యవహారాలలోనుండి చూపించవచ్చు. గర్భధారణ అయితేకాని కొన్నిచోట్ల, పిల్లపుడితే కాని కొన్నిచోట్ల వివాహం పూర్తిఅయింది అనడానికి వీలులేదు. కాబట్టి ఆదిలో పిల్లలకోసమే కుటుంబం ఏర్పడ్డది. కుటుంబంతో పెళ్ళిఅనేది అలవాటు అయింది. అనేకమైన అలవాట్లలాగే ఇదిన్నీ కాలక్రమాన్ని ఆచారం అయింది. ఆచారం అయింతర్వాత అది ఒకన్యాయంగా మారడానికి ఎంతోకాలం పట్టదు.



పిల్లలు పుడితే కాని పెళ్ళి కాదు

రచయిత:

ఆర్. శ్రీరామమూర్తి, బి. ఏ.

కొన్నికొన్ని దేశాల్లో కొన్నికొన్ని వింతైన ఆచారాలు వుంటూవుంటాయి. ఒకానొక ఆచారానికి అలవాటుపడివున్న వారికి దానికి భిన్నమైన ఆచారం కనిపించినా, వినిపించినా ఆశ్చర్యంగా, ఒక్కొక్కప్పుడు అసహ్యంగా వుంటూవుంటుంది.

గర్భధారణ ఐన తర్వాతే వివాహం

మన దేశంలో మంగళసూత్రధారణ అయితే చాలు పెళ్ళితీరినట్లే. కాని కొన్ని దేశాల్లో పెళ్ళినిశ్చయమైనా, సామాన్యమైన పెళ్ళి తంతు అంతానడిచినా ఆ పెళ్ళి పూర్తి అయినట్లు పరిగణింపబడదు. వధువు కడుపుతో ఉన్న లక్షణాలు బాగా కనిపించనేనా కనిపించాలి, లేదా పిల్ల పుట్టనేనా పుట్టాలి అంతవరకు ఆ పెళ్ళికి సంబంధించిన కార్యకలాపం పూర్తి అయిందని అనుకోడానికి వీలులేదు. కొన్నికొన్నిచోట్ల స్త్రీపురుషులు కలిసివుండి స్త్రీకి గర్భధారణ అయినతర్వాతనే వివాహం జరుగుతుంది. కొన్ని నిదర్శనాలు పరికిద్దాము.

వధువు తల్లి ఐతే కాని పెళ్ళి పూర్తి కాదు

తూర్పు గ్రీన్‌లాండు దేశస్థులలోనూ, ఫ్యూజియన్సులోనూ వధువు తల్లి అయితే కాని ఆమెవివాహం పూర్తి అయినట్లు భావింపబడదు.

పిల్ల పుట్టేవరకు పెళ్ళి చట్టసమ్మతం కాదు

పెరుగ్వేలోని ఛాకోలో నివసించే లెంగ్వా ఇండియన్లలో పెళ్ళిఅనేది మొదట అన్యోన్యమైన సమ్మతిమీద ఖాయపడుతుంది. వధూవరులు ఇద్దరూ ఒకచోటనే కాపరంవుంటారు. ఆ దేశపు న్యాయప్రకారం ఒకపిల్ల పుట్టేవరకు ఆ పెళ్ళి చట్టసమ్మతంకాదు. కొంతకాలం లోపుగా వాళ్ళకు పిల్లలు పుట్టకపోతే వారు విడిపోవచ్చు. కాని ఓ పిల్లపుట్టినట్టయితే మాత్రం వారు విడిపోడానికి ఎంతమాత్రం వీలులేదు.

జన్మాంతందాకా వారు భార్యాభర్తలుగా వుండిపోవలసిందే. పుట్టినపిల్ల చచ్చిపోయినప్పటికీ, ఆపిల్లను చంపినప్పటికీ ఆవివాహం విచ్ఛిన్నం చేసుకోడానికి వీలులేనిది అవుతుంది.

పిల్ల పుట్టేవరకు అల్లుడు అత్తారింట్లోనే

సెంట్రల్ బ్రెజిల్లో నివసించే బొరోరా జాతుల్లో మగవాడు అతనికి ఓపిల్లనో, పిల్లవాడో పుట్టేవరకు అత్తవారింట్లోనే వుండిపోతాడు. ఒకపిల్ల పుట్టడంతోటే అతను కుటుంబీకుడు అవుతాడు కాబట్టి వేరే యిల్లుకట్టుకొని పెళ్లాన్ని పుట్టింటినుంచి తరలించుకుని పోయి కొత్తఇంట్లో కాపరం పెడతాడు.

పిల్ల పుట్టినతరవాతే మగనితో కాపరం

కెనేడియన్ జాతుల్లో పెళ్ళయిన మగవాడు అతని భార్య సంతానవంతురాలు అయ్యేవరకు ఆమెమీద ధ్యాసపోయినపుడల్లా అత్తవారింటికి వెళ్ళవలసిందే. అంటే సంతానవంతురాలు అయ్యేదాకా ఆమె పుట్టింటిలోనే వుండిపోతుందన్నమాట. సంతానవంతురాలు అయినతరవాతనే ఆమెకు అతనితో అయిన వివాహం న్యాయసమ్మతమై ఆమె అతనియింటికి వెళ్ళి అతనితో కాపరం చేయడానికి అర్హురాలు ఔతుంది.

పిల్లను పుట్టించి భార్యను తీసుకువెళ్లాలి

ఆలియూట్ జాతుల్లో వధువు కొంత నియమితకాలం తండ్రిఇంట్లోనే వుంటుంది. వరుడువచ్చి స్వేచ్ఛగా ఆమె సహచర్యాన్ని అనుభవిస్తూవుండవచ్చు. నియమితకాలం గడచేవరకు మాత్రం ఆమెను తనఊరు తీసుకుపోవడానికి అతనికి స్వతంత్రంలేదు. కాని నియమితకాలం గడవకుండానే అతను ఆమెకు ఒకపిల్లను పుట్టించగలిగాడా వెంటనే ఆమెను తనఇంటికి తీసుకుపోవడానికి అతనికి హక్కు ఏర్పడుతుంది. అనగా అప్పటికి వివాహం పూర్తి అవుతుందన్నమాట.

అట్కా హో ఆలియూట్ జాతిలో పెళ్లికొడుకు పెళ్లానికి పిల్లని పుట్టించేవరకు ఆమెకు తాను ఇవ్వవలసిన ఓలిధనాన్ని ఇవ్వడు. ఓలిధనం ఇచ్చేదాకా పెళ్లి నెరవేరిందనుకోడానికి వీలులేదు.

పిల్ల పుట్టకపోతే పెళ్ళిరద్దే

ఫార్మొసాలోని శాలిసేనుల్లో వివాహవిషయంలో అన్నిమాటలూ పరిష్కారం అయిన తర్వాత ఒక నెలరోజులు ఏతంతూ లేకుండా వూరుకుంటారు. ఆపైతర్వాత ఓనిర్దిష్టదినాన్ని వరుడు వధువుఇంటికి వస్తాడు. ఓచిన్నతతంగం జరుగుతుంది. ఆతతంగం ఆవధూవరులు ఇద్దరూ కలిసి వుండడానికి లైసెన్సు ఇస్తుంది. పిల్ల పుట్టేవరుకు వధువు తల్లిగారి ఇంట్లోనే వుంటుంది. పిల్లపుట్టినపిమ్మట మగనియింటికి వెళుతుంది. అట్లా వెళ్ళిన తర్వాతనే పెళ్ళి పూర్తిఅయినట్లు లెక్క. కొంతకాలంలో ఆమెకు పిల్లపుట్టకపోతే వరుడు వాళ్ళయింటికి రావడం మానేస్తాడు. అంతదాకా భార్యాభర్తలుగా సంభోగానందాన్ని పొందుతూ వచ్చిన వారు అంతటితో వింతవారైపోతారు. ఆమీదట ఆస్త్రీ మరోపురుషుడిని, ఆ పురుషుడు మరోస్త్రీని కూడడానికి స్వతంత్రులు అవుతారు.

బోర్నియోకు చెందిన సిడైక్సు జాతిలో వధూవరులకు వివాహానికి పూర్వమే సాధారణంగా దాంపత్యధర్మం నడుస్తుంది. వాళ్ళ పెళ్లి ఫలవంతమౌతుందో లేదో అని కొంత కాలం వేచిచూస్తారు. ఫలవంతమయ్యే లక్షణాలు కనిపించడంతోటే అనగా గర్భధారణ

జరగడంతోటే పెళ్ళి జరిగిస్తారు.

గొడ్డుభార్య వంటలక్కగా కూడా పనికిరాదు

క్వీన్సులాండు లోని ఉత్తర, పశ్చిమ, మధ్యమభాగాల్లోని ఆదిమనివాసుల్లో భార్య తాను బిడ్డతల్లి అయేవరకు మగనికి వంటచేసి పెట్టడానికికూడా అర్హురాలు కాదు. ఒకపిల్ల పుట్టినతరవాతనే ఆమె మగనిఇంట్లో శాశ్వతంగా వుండిపోవచ్చు. మరికొన్ని ఆస్ట్రేలియన్ జాతుల్లో మగవాడు ఒకానొక పడుచును లేవతీసుకుపోయి సంతానం కలిగేవరకు ఆమెతో వుండిపోయేటట్లయితే ఆమెను భార్యగా స్వీకరించవచ్చు. అంటే పిల్లపుడితే పెళ్ళిజరిగినట్లే అర్థం.

ఆరో నెల చూలాలికి పెళ్ళి

దక్షిణభారతదేశంలో నీలగిరికొండల మీద నివసించే బడాగాలు అనే తెగలో పెళ్లాం కడుపుతోవుండి ఐదోనెల దాటితే కాని వివాహబంధం పూర్తిఅయినట్లు కాదు. ఆచూలాలికి ఐదోనెల దాటడంతోటే బంధువులందర్నీ పిలుస్తారు. వారి అందరి సమక్షాన్ని మగడు పెళ్లాం మెడలో తాళికడతాడు. అందుతో వివాహకాండ పూర్తి అవుతుంది.

నెలలు నిండేదాకా మగనిగడప తొక్కదు

సినాయి పెనిన్సులాలోని బిడోయీన్సుకు చెందిన మెజైనిజాతిలో వధువు పారిపోతుంది, వరుడు వెంటాడి పట్టుకుంటాడు. ఆపిమ్మట ఆమె తనపుట్టింటికి పోతుంది. గర్భంధరించి బాగా నెలలు నిండేదాకా ఆమె మగనిగడప తొక్కదు.

పిల్ల పుట్టడం నిశ్చయం అయాకే వివాహం

కాంగోలోని దక్షిణపు బాంబలాలో పిల్ల పుట్టడంనిశ్చయం అయాకే వివాహంనిశ్చయమైంది అవుతుంది. అప్పుడే భార్యాభర్తలు సంభోగవిషయంలో నాతి చరామి అనే సూత్రానికి బద్ధులుకావలసినవారు అవుతారు. వారు ఆవిషయంలో నీతిగావుండరా సంతానం నష్టపడుతుందని అచటివారి అభిప్రాయం. శిశుమరణానికి భార్యాభర్తలు అన్యోన్యం మీరి నీతిభ్రష్టులుకావడమే కారణం అని ఆ జాతివారి గాఢమైన నమ్మకం.

పిల్లని పుట్టించేవరకు అల్లుడికి రాత్రిభోజనాలు

మధ్యఆఫ్రికాకుచెందిన ఫార్ జాతుల్లో భర్త సంతానంకలిగేవరకు అత్తవారింట భార్యతో వుంటాడు. సంతానంకలిగినతర్వాత అతను తనభార్యను తాను తీసుకుపోయి తన ఇంటిని తాను నిర్వహించుకోవచ్చు. అంతవరకు అనగా అతను అత్తవారియింట్లో ఉన్నంతవరకు ఆయువదంపతుల ఖర్చులన్నీ మామగారే భరించాలి. ఆరోజుల్లో అల్లుడికి ప్రతిరాత్రి మూడుసారులువరకు భోజనంచేయడానికి హక్కువుంది.

ఇంకా పలుజాతుల్లో మగడు తనకు పిల్లలు పుట్టేవరకు అత్తారింట్లో పెళ్లాంతోవుండి పిల్ల పుట్టినతర్వాతనే ఆమెను తీసుకుని తనయింటికి పోవడంవుంది. అస్సాములోని కాశీస్ తెగలో అల్లుడు మొదట్లో అత్తారింట్లోనే కాపరం పెడతాడు. ఒకరిద్దరు పిల్లలుపుట్టినతర్వాత భార్యాభర్తల అన్యోన్యంకొద్దీ తరుచుగా అతను తనభార్యను తనయింటికి తీసుకుపోతూ వుంటాడు.

కాబోయే భార్యతో మూడేళ్లు సహచర్యం

పూర్వపు కూకీజాతుల్లో వరుడు తన కాబోయే మామను మూడుసంవత్సరాలు సేవించాలి. ఈ మూడుసంవత్సరాల్లోను అతను కాబోయేపెళ్లాంతో స్వేచ్ఛగా సహచర్యం

అనుభవించవచ్చు. ఆమెగర్భంధరి స్తే పెళ్లి చేసుకోవాలి, ఓలిధనం ఇయ్యాలి.

యూరపులోని అనేకభాగాల్లోనూ, ఇం. కా పలుదేశాల్లోనూ గర్భధారణ జరగడమూ, పిల్ల పుట్టడమూ సాధారణంగా వివాహానికి పూర్వోచితకర్మ, వివాహానికి ఒక కారణమూ ఔతుండడంవుంది. లేవతీసుకుపోయిన పడుచుకు పిల్లపుడితే అందుకు కారణమైనయువకుడు కొన్నిజాతుల్లో నిర్బంధంగా ఆమెను పెళ్లాడవలసివుంటుంది; కొన్నిజాతుల్లో అపరాధంగా ఆమెకు కొంతడబ్బు ఇవ్వవలసివుంటుంది.

గర్భధారణంజరిగితే వివాహనిర్బంధం

బోర్నియోలోని అడవిజాతుల్లో యువతీయువకులు యథేచ్ఛగా విహరించవచ్చు. కాని గర్భధారణం జరిగితేమాత్రం వివాహం నిర్బంధం అవుతుంది. బర్మాదేశంలోని కేరన్ జాతిలోకూడా ఇట్టిఆచారమే ఉన్నట్లు తెలుస్తూవుంది.

టాంగనికాకును జాంజిబారుకును నడుమని ఉండే వానియామ్వెజీ ప్రాంతీయులలో ఒకానొక స్త్రీకి కడుపుచేసినమగవాడు పిల్ల పుట్టేలోపుగా ఆమెను పెళ్లి చేసుకోకపోతే మామూలుగా ఇచ్చేఓలిధనానికి మూడురెట్లు సొమ్ము ఆమెకు, ఆమెపిల్లకు అతను ఇచ్చుకోవలసివుంటుంది.

పిల్లపుడితే ఉంపుడుకత్తెకూడా పెళ్లామే

టిహిటిలో తండ్రిఅయినవాడు తన ఉంపుడుకత్తె పిల్లను చంపివేయవచ్చు. చంపివేయకుండా ఆబిడ్డను ఆతండ్రి బ్రతికివుండనిస్తే ఆతను, అతని ఉంపుడుకత్తె న్యాయసమ్మతమైన భార్యాభర్తలుగా పరిగణింపబడతారు, వారిది న్యాయసమ్మతమైన వివాహంఅవుతుంది.

టికోపియాలో సామాన్యసంసారాలకు చెందిన యువతీయువకుల యథేచ్ఛాప్రణయం వల్ల సంతానంకలిగితే ఆయువతీయువకులు ఇద్దరూ పెళ్లిచేసుకుంటారు. పెళ్లికాని దంపతులకు పుట్టినప్పటికీ ఆసంతానానికి సంఘంలో ఏమీ మర్యాదలోపంవుండదు. కాని ఆయువకుడు సంతానవతికాబోయే ఆస్త్రీని వివాహంచేసుకోడానికి నిరాకరిస్తే పుట్టీపుట్టడంలో పిల్లని చంపివేస్తారు.

ఈ నిదర్శనాలన్నీ వివాహం సంతానోత్పత్తి ఘనిష్ఠదయూంతంగా కలదని మానవులకుండే మనోగతభావాల్ని నిరూపించడానికి లెస్సగా ఉపకరిస్తాయి.

సీ. కడుపు మండించు నాఁకటి చిచ్చుసెగ దాఁకి గవరనైయున్న కన్గవలవారు
భోగించువారలఁ బుల్కుపుల్కునఁజూచి మెల్లనగ్రుక్కిళ్లు మ్రింగువారు
కుటుంభరిత్వంబు కొలఁది కగ్గలముగాఁ గూడెంతపెట్టినఁ గుడుచువారు
ప్రాణగొడ్డములైన పరమసాహసములఁ బరులసొమ్ములకాసపడెడువారు

గీ. పాముసకు బలిపెట్టని ప్రతినవార
లీఁగ కెన్నఁడు నే నిలి యిడనివారు
ధనముగాఁవున్న దయ్యాలఁ దఱుమువారి
బలిసి లోభంబు నిరువంకఁ గొలుచువారు.

—శృంగారనైషధము.

విశ్వప్రేమ—లోకశాంతి

రచయిత్రి:

శ్రీమతి చుండూరి రమాదేవి

[విద్యాప్రియుడగు తండ్రి మన్ననలచే విద్యగఱచి వ్యాసరచనా వ్యాసంగమున పర్యాప్తమైయున్న ఈ విద్యావతి వ్రాసిన తొలివ్యాసము నిట్లు ఆంధ్రభూమి ఆంధ్రప్రజలకు అందించుచున్నది. —సంపాదకుడు.]

ఆధునికప్రపంచ మంతయు జాతిస్పర్ధలతోను, ధనపిపాసతోను, పరద్వేషముతోను నిండి కంటకాకీర్ణమగు మహావనమునందలి నివాసమువలె వేదనాకరముగా నున్నది. మానవులందు శాంతినశించి, ప్రజాభివృద్ధికిని, ప్రజాసౌఖ్యమునకును సాయమొనర్పవలసిన శాస్త్రపరిశోధన మానవనాశమునకు సాధనమైనది. మానవులు తమ గమ్యస్థానమును మఱచి, తమ సోదరులను సదా ద్వేషించుచున్నారు. ఇట్టి స్థితిలో మానవులలో మానవత్వమును స్థాపించుట ప్రతివ్యక్తికి ధర్మమైయున్నది.

మానవత్వము త్యాగప్రేమలయందే గలదని మహాత్ముల యాదర్శము. కాన అట్టి ప్రేమ నాచరణమునం దుంచుటకు ప్రతి మానవుడును ప్రయత్నించవలెను.

ద్వేషము, స్వార్థముగల హృదయములలో త్యాగప్రేమలు నివసింపజాలవు. ప్రేమగలచోట త్యాగముండుట సహజము. అవిశ్వాసమే అంతఃకలహములకు బీజము. ఇట్టి బీజములను నిర్మూలించునది ప్రేమయొక్కటియే. అందుచే విశ్వప్రేమ జగదుద్ధారణకు మూలమని మహాత్ములు ప్రచారమొనర్చిరి. భగవంతుడు పరమపితయని (అనగా) ప్రతిజీవికిని తండ్రియని అన్నిమతములు బోధించుచున్నవి. ఆదయానిధిచే సృష్టింపబడిన ప్రతిజీవియెడలను సోదరభావముంచుట మానవమాత్రుని యాదర్శము. మానవులు వివిధమతములకు జెందినంతనే మూఢత్వమున నేను క్రైస్తవుడను, మాదేవుడు జీసస్ అనియు- నేను మహమ్మదీయుడను, మాదేవుడు 'అల్లా' అనియు, పిచ్చిభ్రమలకులోనై మానవత్వమును బోగొట్టుకొనుచున్నారు. మన వేదాంతశాస్త్రము ననుసరించి ప్రతివ్యక్తియు భగవంతుని స్వరూపమే. సూదిలోని దారమువలె ప్రతి పదార్థమునందును భగవంతుని తేజమే ప్రకాశించుచుండును. భగవంతుని ప్రేమించి ఆరాధించి అతని దయనొందుటయే మానవుని పరమావధి. కాన విశ్వప్రేమయే మనుష్యుని ముఖ్యాదర్శము. ఇట్టి విశ్వప్రేమ సకలమతసమ్మతము. బౌద్ధమతము 'అహింస పరమధర్మమని' ప్రచారముసలిపి, భూతదయకు ప్రాధాన్యమిచ్చి ఖ్యాతినందియుండుట మన కందరికిని దెలిసినవిషయమే.

కాని దీనినందరును యాచరించుట కష్టమే. ఎందువల్లననగా మనుజుడు సాధారణముగా సౌందర్యమును, సుగుణములను ప్రేమించునట్లు వికృతాకారమును, దుర్గుణములను ప్రేమింపజాలడు. కాని విశ్వప్రేమ సద్గుణ దుర్గుణములను, సౌందర్యవికృతాకారములను సమముగా ప్రేమించుట నేర్పును.—తల్లి రోగముచే బాధపడు కుమారునిపై ఎక్కువ ప్రేమను జూపునట్లు భగవంతుడు సంఘముచే గర్హింపబడి పతి

తులై నిరాశాపూరితులైనవారి పక్షమూని వలయునెడ సంఘములపై దాడివెడలును! త్రిమూర్త్యాత్మకుఁడగు ఆదిత్యుడు తన పవిత్రకిరణములచే బ్రాహ్మణాగ్రహారములను ప్రకాశింపజేయునటుల పంచమకుటీరములను కూడ కాంతివంతములుగ జేయును. ప్రేమ పతితులపైనను, పవిత్రులపైనను ఒకేరీతిగా వర్షించుటేగాక పతితుల యభివృద్ధికై తన శక్తినంతయు-తుదకు ప్రాణమును- ధారవోసి తత్సౌఖ్యాభివృద్ధి కలుగఁజేయును. వారి సౌఖ్యమే తన కానందము. పతితపావన బిరుదమున కీప్రేమమూర్తియే యర్హుడు. ప్రతిహృదయమునందును ప్రేమజ్యోతి ప్రకాశించుచునే యుండును. కాని, దానిని స్వార్థము, అహంకారము మొదలగు అరిషడ్వర్గములచే నణచుచున్నాము. వాటిని తొలగించినచో గుప్తముగనున్న ప్రేమ పులుగడిగిన ముత్యమువలె ప్రకాశించును. అరిషడ్వర్గ విజృంభణమున అజ్ఞానతిమిరము గల్గుచున్నందున, అట్టివి దరిచేరనీయవలదని మన శాస్త్రములు బోధించుచున్నవి. భగవంతుని స్వరూపము దిలకించుటకవి అడ్డుపడుచున్నవి. ఆకారణమువలన అరిషడ్వర్గములు గర్హితములని మనవారి సిద్ధాంతము.

ప్రేమను కామముగా భ్రాంతిజెందువారు కొందరుగలరు. కామము బాహ్యరూపగుణములపై నాధారపడియుండును. కాని విశ్వప్రేమ ప్రతివ్యక్తిని సోదరునివలె ప్రేమించుటచే హృదయదౌర్బల్యమునకు తావీయదు. హృదయ దౌర్బల్యములేని జాతి అభివృద్ధిజెందుటలో వింతయేమి? కాన సర్వజనులు విశ్వప్రేమ నాశ్రయించి లోకమున శాంతి, సౌఖ్యము, స్వాతంత్ర్యము విరాజిల్ల జేయుదురు గాక!

చెళ్లపిళ్లసత్కృతికి కానుక

రచయిత:
ఉభయభాషాప్రవీణ
తుమ్మల సీతారామమూర్తి చౌదరి

[ఇది శ్రీయుత చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు ఇటీవల బాపట్ల వచ్చినపుడు మాయింట శ్రీవారికిఁ గావించిన సన్మానసందర్భమున నర్పితములు.]

పావనమయ్యె మద్గృహము పండె మదీయము పుణ్యరాశి యు
జ్జీవనమెల్ల సార్థకతఁజెందె మహాకవిసార్వభౌము, నా
నావసుధాలసన్మనుజనాథకిరీటతటీమణీమహాః
ప్రావృతపాదపీఠుఁ బ్రతిభానిధి, వేంకటశాస్త్రిఁ గొల్చుటన్.

కింకవిరాజమత్తగజకేసరియై తెలుఁగుం గవిత్వపుం
బొంకములెల్లఁ జూపి రుచిపోయిన శారద సోయగమ్ములో
వంకలుదిద్ది మాదృశుల వందల వేల సృజించె నెవ్వఁ డా
వేంకటశాస్త్రి కంచితకవిత్వవిధాతకుఁ గేలుమోడ్చెదన్.

నీ చరణమ్ము చెంతఁ గమనీయకవిత్వరహస్యశిక్షకై
నోఁచఁగనైతి; నట్లయిననుం భవదీయకవిత్వగానముల్
నాచెవిసోకి యిట్టి రచనం బొనరింపఁగఁ జేసి భారతీ
శ్రీచరణాబ్జ సేవకులఁ జేర్చె ననున్ జెళపిళ్ల సత్కృతీ!

భారతీయభాషలలో ఆంధ్రము మూడవది

రచయిత :

చిలుకూరి నారాయణరావు, ఎమ్.ఏ., ఎల్.టి., పి.హెచ్.డి.

[భాషాప్రయుక్తముగ మనరాష్ట్రమును మనము విడతీసికొను విషయమున ప్రయత్నములు సాగించుచున్న ఈ దినములలో ఆంధ్రభాషనుగూర్చియు, ఆంధ్రము వాడుకలో నున్న ప్రదేశమునుగూర్చియు, ఆంధ్రము మాతృభాషగా కలవారినిగూర్చియు వివరించుచు ఆంధ్రులెల్లరకు అవశ్యపఠనీయమగుచున్న ఈవ్యాసము శ్రీవారు నూతనముగా ప్రచురించిన 'ఆంధ్రభాషాచరిత్రము' అను అమూల్యగ్రంథమునుండి గ్రహింపబడినది.

—సంపాదకుడు.]

భరతవర్షమున వాడుకలోనున్న భాషలలో జనసంఖ్యనుబట్టి యాంధ్రభాష మూడవస్థానము నాక్రమించుచున్నది. హిందీ బంగాళీ భాషలతరువాత నెక్కువ ప్రచారములోనున్నదియు నెక్కువ ప్రదేశమునందు వాడుకలో నున్నదియునగు భారతీయభాష యాంధ్రభాషయే. ఈ క్రింది వివరములు లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా, 4-వ సంపుటమునుండి తీసికొనఁబడినవి.

1. ఆంధ్రము గృహభాషగానున్న వారిసంఖ్య

	1891 సం॥ జనాభా.	1901 సం॥ జనాభా.
మధ్యపరగణాలు	99,527	79,927
చాంద	69,000	71,789
బస్తరు	30,527	8,138
బేరారు	28,750	23,006
బంగాళారాజధాని	11,522	14,226
కటకము	4,800	6,292
పురి	4,307	4,150
ఒరిస్సాసామంతరాజ్యములు	2,525	3,784
	11,632	14,226

	1891 సం॥ జనాభా	1901 సం॥ జనాభా.
చెన్నరాజధాని	12,017,002	12,575,079
గంజాము	72,287	342,910
,, (ఏజెన్సీ)	3,366	5,864
విశాఖపట్టణము	1,881,678	1,999,791
,, (ఏజెన్సీ)	113,052	153,168
గోదావరి	1,914,769	2,099,417
,, (ఏజెన్సీ)	96,784	119,503
కృష్ణ	1,739,326	2,015,815
నెల్లూరు	1,364,445	1,385,067
కడప	1,139,891	1,160,567
కర్నూలు	717,140	763,085
బళ్లారి	267,327	282,791
అనంతపురము	570,921	333,796
చెంగల్పట్టు	242,737	312,946
ఉత్తర ఆర్కాడు	842,880	856,480
సేలము	360,915	416,120
బనగానపల్లి	28,021	26,139
సందూరు	1,463	1,590
	12,017,002	12,575,079

౯. గృహభాషగాఁ గాక యితర ప్రాంతములలో నాంధ్రమును మాటలాడువారి సంఖ్య.

	1891 సం॥ జనాభా.	1901 సం॥ జనాభా.
అండమాను నికోబారు దీవులు	...	212
అస్సాము	...	5,259
బెలూచిస్థానము	...	36
బంగాళారాజధాని	...	4,454
బీరారు	14,488	12,425
అమరావతి	3,593	3,221
ఆకోల	3,170	3,312
ఎల్లిచిపురము	1,225	1,315
బుల్డాన	2,750	2,606
	14,488	12,425
బొంబాయిరాజధాని	62,860	109,988
బర్మా	...	96,601
మధ్యపరగణాలు	21,295	22,654
కుడగు	3,751	2,974
చెన్నరాజధాని	16,94,466	17,60,361
మద్రాసు	1,03,423	1,08,496
కోయంబత్తూరు	4,40,307	4,68,135
నీలగిరులు	4,332	4,391
దక్షిణ ఆర్కాడు	2,27,055	2,28,260
తంజావూరు	80,630	94,872
తిరుచానపల్లి	1,61,342	1,69,784
మధుర	3,67,613	3,94,358
తిరునల్వేలి	2,59,048	2,59,936
మలబారు	20,309	19,587
దక్షిణకనర	2,096	1,340
పుదుక్కోట	10,797	11,066
కొచ్చిరాజ్యము	12,087	11,676
తిరువాన్కూరు	5,426	7,460
పశ్చిమోత్తరపరగణాలు	...	203
పంజాబు	...	7
సంయుక్తపరగణాలు	...	640
బరోడా	...	322
మధ్య యిండియా	...	777
రాజపుత్రస్థానము	...	61

౯. ఆంధ్రభాషతో సంబంధించిన చిన్నచిన్న మాండలికభాషలను మాట్లాడు వారిసంఖ్య యీక్రిందచూపఁబడినది.

	1891 సం॥ జనాభా.	1901 సం॥ జనాభా.
కోష్టావు	3,827	67
సాలేవారి	3,660	...
గోలరి	25	22
బేరాడి	1,250	...
వడరి	27,099	3,860
కామాటి	12,200	4,704
మొత్తం.	48,061	8,653

౯. పైయంకెలనన్నిటినిగూడిన నాంధ్రభాషను దాని యుపభాషలను మాట్లాడువారి సంఖ్యవచ్చును.

	1891 సం॥ జనాభా.	1901 సం॥ జనాభా.
ఆంధ్రము గృహభాషగాఁ గలవారు	17,938,980	18,675,586
ఆంధ్రేతర ప్రదేశములలో	1,796,860	2,016,974
ఉపభాషలను మాట్లాడువారు	48,061	4,704
మొత్తము.	19,783,901	20,697,264

౯. ఆంధ్రులజనసంఖ్య గడచిన ముప్పదిసంవత్సరములలో నీక్రిందిరీతిగా పెరిగినది.

(చెన్నరాజధానిలో 10,000 మందికి.)

1901	1911	1921	1931
3,706	3,769	3,772	3,768

౯. విస్తీర్ణము

ఆంధ్రభాష ప్రచారములో నున్న ప్రదేశమునకు తూర్పుదిక్కునసంతయు బంగాళాఖాతమున్నది. దాని కుత్తరపు స్వాభావికమగు నెల్ల ఋషికుల్యానది. ఆనది కుత్తరమున గూడ నాంధ్రులు వాసమేర్పఱచుకొని యున్నారు. ఋషికుల్యనుండి పడమటగా నాయెల్ల పోయి తూర్పుకనుమలనుదాటి నైఋతిమూలగా బస్తరుసంస్థానములోని సుంకము, బిజ్జి తాలూకాల సరిహద్దయిన శబరీనదిని దాటి, బేలదిలగుట్టలవెంబడి జరగి యింద్రానది వఱకుఁబోవుచున్నది. అక్కడనుండి యానది యొడ్డుననసాగి, యది గోదావరిని గలియువఱకుఁబోయి, చాందాజిల్లా దక్షిణభాగ మంతటిని దనలో నిముడ్చుకొని, యింకను దూర్పుగ సాఁగి వ్రానుజిల్లా దక్షిణభాగమునంతటిని దనలోఁ జేర్చుకొనుచున్నది. అచ్చటనుండి దక్షిణముగ మంజీరానది గోదావరియందు సంగమించు స్థానమువఱకునుబోయి యింకను దక్షిణముగసాఁగి బీదరు మండలమున కన్నడము ప్రచారములోనున్న ప్రదేశములోనికి చొచ్చుకొనిపోవుచున్నది. అచ్చటనుండి సరిగ దక్షిణముగ నైజామురాష్ట్రములోని యీ యుజిల్లాలను దనలోఁజేర్చుకొని, తిరిగి బ్రిటిషు ఇండియాలోని బళ్లారిజిల్లాను సరిగ రెండు భాగములు చేయుచున్నది. ఆ తరువాత నది యచ్చటసాగి యనంతపురముజిల్లా ద్వారా మైసూరుసంస్థానమును చొచ్చుకొని యందలి బెంగుళూరు, కోలారు, నందిదుర్గము, చిత్రదుర్గము జిల్లాలను దనలోఁ జేర్చుకొనుచున్నది. అక్కడనుండి యుత్తరఆర్కాడు, చెంగల్పట్టు జిల్లాల మధ్యభాగముగ సాఁగి తిరిగి బంగాళాఖాతమును జేరుచున్నది.

ఆంధ్రమ్మున కుత్తరమున ఒఱియాభాష, హాళబీ ఉపభాష, గోండి, మరాఠీభాషలును, పశ్చిమమున మరాఠీ కన్నడములును, దక్షిణమున తమిళమును బ్రచారములో నున్నవి. ఆంధ్రమున కితరభాషలతో సంయోగము కలుగు కొన్నిచోట్ల నది చల్లచల్లగ వ్యాప్తమగుచున్నది. గంజామున కుత్తరమున నోరిస్సాలోను, మధ్యపరగణాలలోను, నైజాము రాష్ట్రములోను, నది నానాఁటికిని విస్తరించుచున్నది. మైసూరుసీమలో కన్నడ మాంధ్రమును వెనుకకు తఱుము చున్నది.

౯. ఆంధ్రమునకు సంబంధించిన యుపభాషలు.

ఆంధ్రము మాతృభాషగానున్న ప్రదేశమునందంతటను నొకరూపమున నుండక యీ భేదములను గలిగియున్నది. సరిహద్దు ప్రాంతములం దితరభాషలతో సంయోగము గలిగినచోట్ల నాయాభాషల శబ్దజాలమును, కొంచెము మట్టుకు భాషారూపమును నాంధ్రము సంగ్రహించుట వింతగాదు. గంజాము జిల్లాలో బరంపురము, ఛత్రపురము మొదలగు ప్రాంతములం దోఢ్రపుమాటలు లెక్కువగా నాంధ్రమున గలియుచుండును. ఉండెను అనుటకు ఉంటిడి యను రూపమిచ్చట వింతగాఁ గానవచ్చును. బళ్లారి మొదలగు ప్రాంతములందు 'కొఱకు,' అనుటకు 'కోస్కరము' అని తెనుఁగు 'కు' ప్రత్యయమునకును కన్నడపు ఓస్కర ప్రత్యయమునకును సమ్మేళనము కలిగినది. ఇట్టి కొంచెపు భేదములను పాటింపనిచో నాంధ్రభాష యన్నిప్రదేశములందును నొక్కతీరుననే యున్నదని చెప్పవచ్చును. ఏసనుబట్టియు పదములపై మాట్లాడువారుంచు నూఁతగలస్థానములఁబట్టియు పదములు వివిధవికారములను బొందుటయు స్వాభావికమే. ఇదిగాక యాయాప్రదేశముల చరిత్రమును బట్టియు నందలి యన్యదేశీయుల ప్రాబ

ల్యమును బట్టియు శబ్దజాలము కొంతవఱకు వేర్వేరుగా నుండుట సంభవించును. ఏప్రాంతమునందైనను జీవద్భాష యెల్లప్పుడు నొక్కతీరున నుండుట యసంభవము. ఏప్రాంతపు భాషయయినను పరిశుద్ధమయినదని చెప్పుటకు వీలులేదు. గోదావరీ కృష్ణా మండలములవారిభాష యుత్తమమయినదనియుఁ బరిశుద్ధమయినదనియు గొందఱనుకొనుటగలదు. కాని, యిట్టి యభిప్రాయము కేవల మభిమానప్రేరితమని వేరే చెప్పనక్కఱలేదు.

జాతివర్ణములఁబట్టియు వృత్తులనుబట్టియుఁ గూడ నుడికారము మారుచుండును. ఏకకాలమునందే, ఏకప్రదేశమునందే వివిధములగు నుచ్చారణములు వినఁబడుట యనుభవసిద్ధము. మాటలతీరునుబట్టి యొకఁడు బ్రాహ్మణుఁడో, క్షత్రియుఁడో, వైశ్యుఁడో, శూద్రుఁడో, ఇతరజాతివాఁడో వెంటనే పోల్చుకొనవచ్చును. ఇదిగాక మాటతీరునుబట్టి యొకఁ డేమండలమువాఁడో కూడ తెలిసికొనవచ్చును. ఇట్టి యుచ్చారణభేదము లన్నియు నే భాషయందైనను స్వాభావికముగ నుండక తప్పదు. అంతమాత్రమున నవియన్నియు భాషాభేదములని యెంచరాదు.

అయినను, సాధారణాంధ్రభాషకు మిక్కిలి విలక్షణముగాఁ గనఁబడు కొన్ని యుపభాషలాంధ్రేతరప్రదేశములందు ప్రచారములోనున్నవి. మధ్యపరగణాలలోని చాందా జిల్లాలో నాంధ్రభాషకు కోంటావు, సాలేవారి, గోలరి అను పేళ్లున్నవి. ఈమూఁడును వేర్వేరగు నుపభాషలుగా నెంచుటకు వీలున్నను వానియుచ్చారణమును, సుప్తిఙంత విధానమును నొక్కతీరుగనే యున్నవి. కర్నాటకదేశములోను, బొంబాయి యందును నాంధ్రమునకు సంబంధించిన కొన్ని యుపభాషలు కలవు. అవి కొన్నివృత్తులకు సంబంధించినవారి యాంధ్రభాషావికారములుగా నున్నవి. బెల్గాము జిల్లాలో బేరాది, దాసరి యనుభాషలును, బొంబాయి పట్టణమునందలి కామాఠిభాషయును, బొంబాయిరాజధాని, బేరారు మొదలగు ప్రదేశములలో సంచారశీలురగు నొకజాతివారు మాటలాడు వడరీ భాషయును నట్టివి. ఇవియెవ్వియుఁగూడ సాధారణవ్యవహారభాష కెక్కువ విలక్షణముగ నుండక పోవుటచే వీనినిగూడఁ బ్రత్యేకోపభాషలుగాఁ బరిగణింప నక్కఱలేదు.

I

౧. 1931-జనాభానివేదికలో తెనుఁగును గూర్చి వ్రాయఁబడిన యంశము లీక్రింద సంగ్రహముగా చూపఁబడినవి :—

"మాతృభాష యనఁగా నేమి ?"

"1921-వ సంవత్సరమున జనాభా తీసికొన్నప్పుడు 'మీ మీయింట సాధారణముగా నేభాష మాట్లాడుకొందురు?' అని అడుగుచుండిరి. ఈ (1931) జనాభా సమయమున 'నీ మాతృభాషయేమి?' అని అడిగిరి. మాతృభాష యేది యను విషయమున నెవ్వరు నెట్టి సందేహమును పడనక్కఱలేదని యెంచుచుందురు. కాని, జాతులును భాషలును నొకదానితోనొకటి కలియుచుండు నీదేశమున సాంఘికాచారములందును, మతనియమములందునువలె భాషావిషయమునఁ గూడ మాతృభాష యిదమిత్థమని చెప్పుట కష్టమగుచుండును. కావున, నీ విషయమున నెట్టి ప్రశ్నను వేయుట అను విషయమై నిర్ణయించుట కొంచెము కష్టమయ్యెను. సాధారణ మనుష్యుఁడు సరియైన ప్రత్యుత్తరమిచ్చుటకు సరియైన, సూత్రప్రాయముగనుండు ప్రశ్నను కోరుచుండును. కొంద ఱీ విషయమున

నెట్టి ప్రశ్నలకును లొంగకుండిరి. "తమిళుఁడు తెనుఁగుస్త్రీని పెండ్లాడిన వారి సంతానము యేమగును?" అని యొకఁడు ప్రశ్నించును. గంజాముజిల్లాలో తెనుఁగును ఒఱియాయుఁ గలియుచోట, తెలుఁగు ఒఱియాభాషల రెం డింటిని గూడ మాట్లాడు తెగలవారున్నారు. ఒకటే కుటుంబములోని జనులపేళ్లలో ఒఱియాపేళ్లు, తెనుఁగుపేళ్లుకూడ వినఁబడుచున్నవి; తెనుఁగువారిలోనుండు ఇంటిపేళ్లు అట్టివిలేని ఒఱియా కుటుంబములలో వినఁబడుచున్నవి. అట్టి జనులు తమ మాతృభాష యేది యని యడిగినప్పుడు సరిగ చెప్పలేరు. తమ పూర్వులనుండి యా విషయమై తెలిసియుండలేదు; తెలిసికొనుటకు వారికిఁ జాలినంత విద్యయులేదు. చిన్ననాఁటనుండియు వారు రెండుభాషలను మాట్లాడుచునే యున్నారు. "నీవింటిలో ఏభాషమాట్లాడెదవు?" అని తొలిసారి యడుగఁగా 'తమిళము' అని చెప్పినవాఁడు, నా యెదుటనే తిరిగి 'నీమాతృభాషయేది?' అని యడిగినప్పుడు 'తెలుఁగు' అని ప్రత్యుత్తరమిచ్చెను. ఈతఁడు తెలుగువాఁడు; తెలుఁగురాని తమిళస్త్రీని పెండ్లాడినాఁడు; కాఁబట్టి, గృహకృత్యములు సరిగ జరుగుటకు భార్యభాషను నేర్చికొని, ఇంటిలో తమిళమును మాట్లాడుచున్నాఁడు. కడప జిల్లాలో ఒక సూపర్వైజరు తనప్రశ్నకు సరియైన సమాధానము చిక్కక, "నీ తల్లిపాలతో ఏభాషను త్రాగినావు?" అని ప్రశ్నించినాఁడు. ఈ ప్రశ్నకు వెంటనే సరియైన సమాధానము వచ్చినది.

ii ఉపభాష

ఒక భాష మాతృభాషగాఁ గలవారు కొందఱు ఇతరభాషాప్రదేశనివాసమువలనను, వ్యవహారవశమునను మఱియొక, లేక కొన్ని, భాషలను నేర్చియుండవచ్చును. అట్లు నేర్చిన యితర భాషల కుపభాషలని పేరు.

iii చెన్నరాజధానిలోని భాషలు

చెన్నరాజధానిలో తమిళము, మళయాళము, తెనుఁగు, కన్నడము, తుళు, హిందూస్థానీ అను ప్రాంతగలభాష లాఱున్నవి. వీనిలో తెనుఁ గన్నిటికంటె సుస్వరితమును, శ్రావ్యమునునై యున్నది. దీని నైరోపా భాషలలోని 'ఇటాలియను'తోఁ బోల్చుట సరిగనే యున్నది. కాని, కొన్ని ఇటాలియను ఉపభాషలు చెవి కసహ్యముగా నుండునట్లే, తెలుగునఁ గూడ నన్ని యుపభాషలును నొక్కరీతిగనే శ్రావ్యముగ నున్నవని చెప్ప వీలులేదు.

iv తెలుఁగుభాషకు సరిహద్దులు

(అ) I తెలుగు-ఒఱియా సరిహద్దు :— గంజాము జిల్లాలోను, విశాఖపట్టణము ఏజెన్సీలోను కొన్ని ప్రదేశములలో రెండు భాషలను సరిసమానముగ నూటికేఁబది వంతున నున్నారు; కొన్ని ప్రదేశములలో రెండుభాషలును నూటికేఁబదివంతును పొందియుండలేదు. సముద్రప్రాంతమునందెల్ల తెనుఁగువారుండుట గమనింపదగినది. ఋషికుల్యాముఖద్వారమునఁ జకుఁ దెనుఁగువారున్నారు. కొన్ని రీతులుగ ఋషికుల్యానదియు, దాని యుపనదులును ఒఱియాభాషకు దక్షిణపు టెల్ల యని చెప్పవచ్చును......విశాఖపట్టణము ఏజెన్సీలో నౌరంగపూరు ఉత్తరభాగము, జయపురము, కోరాపుట్టి తాలూకాలలో ఒఱియాభాషయే ప్రధానమైనదనవలెను; కాని, యిచటఁగూడ నాభాష కోయమొదలగు భాషల ప్రదేశము నాక్రమించుచున్న దనియే చెప్పవలెను...విశాఖపట్టణము ఏజె

న్నికి దక్షిణముగ వచ్చుకొలఁదిని తెనుఁగు భాష ప్రబలమగుచున్నది; గూడెము, వీరవల్లి తాలూకాలలోను పాశ్చాత్యతాలూకా దక్షిణమునను తెనుఁగే ప్రధానభాషయని చెప్పవలెను.

(ఆ) II తెలుఁగు-కన్నడముల సరిహద్దు:- ఈ యెల్ల ఉత్తరమున హాగేరీ నదియు దాని యుపనదియగు చిన్న హాగేరీయు నని చెప్పవచ్చును. మడకసిరా తాలూకా పశ్చిమ భాగము కొంచెము తప్ప అనంతపురము జిల్లా యంతయు తెనుగుఁ దేశమందే చేరుచున్నది. ఇచట తెనుఁగు సరిహద్దు మైసూరు సంస్థానములోనికి చొచ్చుకొని పోవుచున్నది. ఆ సంస్థానములోని కోలారు జిల్లాలోని జనులలో మూఁడువంతులలో రెండువంతులమంది తెలుఁగే తమమాతృభాషగా చెప్పికొని యున్నారు. ఈ ఎల్ల హిందూపురమునుండి కుప్పమువఱ కున్నదని చెప్పవచ్చును; కాని, యీ విషయము మైసూరుజనాభా లెక్కలవలన నిర్ణయము కావలసియున్నది. ఈ యెల్ల సేలము జిల్లాలోని హోసూరు తాలూకా ఉత్తరపు భాగమును కోసికొనిపోయి, పుత్తూరు, చిత్తూరు, తిరుత్తని తాలూకాలలోని దక్షిణ భాగములను తెనుఁగు ప్రదేశమునఁ జేర్చుచు, చిత్తూరు – ఉత్తరార్కాడు జిల్లాల సరిహద్దు ననుసరించి, చెంగల్పట్టు జిల్లాలోని తిరువళ్లూరు, పొన్నేరి తాలూకాలను తెనుఁగుదేశమునఁ జేర్చుచు, పులికాడుసరస్సునకు దక్షిణమున సముద్రమును గలియుచున్నది.

(ఇ) III తెలుఁగు-అరవముల సరిహద్దు:- దక్షిణమున అరవదేశములో తెనుఁగున కెల్లను నిర్ణయింప వీలులేదు. తూర్పు – పడమటి కనుమల మధ్యమునందెల్ల తెనుఁగు కొలదిగనో గొప్పగనో వ్యాపించి యున్నది. దక్షిణ ఆర్కాడు దక్షిణపు తాలూకాలలోఁ దప్ప తంజావూరుజిల్లా, పుదుక్కోట సంస్థానము, రామనాథ, శివగంగ జమీందారీలు, తామ్రపర్ణీనదికి దక్షిణముననున్న తిరునల్వేలి జిల్లా,—ఇచట నచట ననవేల, దక్షిణదేశమందెల్లెడల తెనుఁగు మాతృభాషగా వినవచ్చుచున్నది. ఈ యెల్ల ఒక మార్గమును పట్టలేదు; కాని, రెండు విషయములుమాత్రము గమనింపఁ దగినవి—(i) మిట్ట ప్రదేశము ననుసరించుట (ii) రాయల సీమలోని నల్ల రేగడభూముల నాశ్రయించుట. తూర్పు తీరమునను, నదీముఖద్వారములను తెనుఁగు లేదు. తిరునల్వేలి, రామనాథ జిల్లాలలోని కనుమలకు తూర్పుననున్న ఎఱ్ఱమట్టి భూములలో తెనుఁగువారు పలుచగను, సత్తూరు, శ్రీవిల్లిపుత్తూరు, శంకర నారాయణర్ కోవిల్, కోవిల్‌పత్తి తాలూకాలలోని నల్ల రేగడ భూములలో అధికముగను గానవచ్చుట గమనింపఁదగినది. ఇట్లే, మధుర జిల్లాలోని తిరుమంగళము తాలూకా నల్ల రేగడభూములకు ప్రసిద్ధి; ఇచట తెనుఁగువారెక్కువగ నున్నారు. ఆ జిల్లాయందే మేలూరు తాలూకాలో పచ్చని భూములున్నవి; ఇచట తెనుఁగువా రంతగా లేరు.....

(ఈ) IV పడుమటి తీరము:—ఈ తీరమున గూడ తెనుగువారు స్థిరనివాసము నేర్పఱచుకొని యున్నారు. దక్షిణ కనరా జిల్లాలోని 'కొరగ' లట్టివారు. వీరి కొక రహస్య భాషయున్నది. ఇతరులు వినుచుండఁగా వారు దానిని మాట్లాడరు. కాని, అది తెలుఁగును బోలియుండునని తెలియుచున్నది. వీ రనంతపురమునుండి నొక రాజుసేనతో నా ప్రదేశమునకు వచ్చియుండినట్లు వీరియందొక వైతిహ్యమున్నది.

తెలుఁగువారి యుపభాషలు

తెనుఁగు మాతృభాషగాఁ గలిగి మఱి యొకదాని నుపభాషగా వాడుచుండు తెనుఁగువారి సంఖ్య, తమిళము మాతృభాషగాఁ గలిగి యుపభాషల నవలంబించిన తమిళుల సంఖ్యకంటె నాలు రెట్లధికముగా నున్నది. ఈ భేదమువలన తెలుఁగెంత విరివిగ వ్యాపించియున్నదో తెలియఁగలదు. హిందుస్థానీ భాషను మాట్లాడువారికంటెను తెనుఁగు మాతృభాషగాఁ గలవా రెక్కువగ ననేక ప్రదేశములందు వ్యాపించియున్నారు. తెనుఁగువా రెక్కువగ నుపయోగించు నుపభాష తమిళము; కాని, తక్కిన భాషలు మాట్లాడువారు కొలఁదిగనో, గొప్పగనో తెనుఁగును మాట్లాడుచుందురు. గోదావరి, కృష్ణా జిల్లాలలో తెనుఁగెక్కువగా నుండుటవలన నిచటివారి కుపభాషలులేవు. పుదుక్కోటసంస్థానములోని తెనుగువారిలో నూటికి తొంబదియెనిమిదిమంది తెనుఁగునే నిత్యజీవనమున వాడుదురు...... తెలుగువానిని నిజముగ 'దక్షిణాపథవిహారి'యని వర్ణింపవచ్చును; భాషలను నేర్చుకొనుటయం దతఁ డారితేరిన వాడు.''

II

చెన్నరాజధానిలోని జనసంఖ్యలో ప్రతి 10,000 మందికి నాయాభాషల మాట్లాడు వా రీక్రింది విధముగ నున్నారు :—

	1931	1921	1911	1901
తమిళము	4,013	4,111	4,080	4,035
తెలుఁగు	3,768	3,772	3,769	3,706
మళయాళము	790	754	740	739
ఒరియా	392	368	383	468
కన్నడము	366	361	382	406
హిందుస్థానీ	260	234	233	230
తుళు	121	126	122	128

III

ఉపభాషలు (Dialects).

తెనుఁగు మాట్లాడువారు తమ బాషకు పేళ్లిగా చెప్పుకొనిన కొన్ని శబ్దములు:—

గంజాముజిల్లా:—దరుల (2);

విశాఖపట్టణము:—అఘ్రు (84); బగత (27); బోయ (13); చెంచు (277); ద్రవిడ (1,487); ఏతవన్ (2); ఏతి (40); జోగి (6); మాల (313); మొసిరి (23); ముల్లారి (2); రెడ్డి (10); తిత్తియ (14); ఉప్పోరు (2); వైష్ణవ (4); యాత (9).

తూర్పుగోదావరి:—బసగొల్ల (7); దొమ్మర (43); పుప్పరి (1).

పశ్చిమ గోదావరి:—మోటు (3).

కృష్ణ:—రంగిరాజు(30); యానాది(10).

అనంతపురము:—జోగ (13).

బళ్లారి:—బారిక (3); వడ్డరు (20).

మధుర:—ముత్తువర్ (70).

కోయంబత్తూరు:—తొడియ (2); తొట్టియర్ (3).

పాములు నాగస్వరాన్ని వింటాయనడం పచ్చి అబద్ధం

రచయిత:

ఆంధ్ర రంగారావు, యల్. ఐ. యమ్.

'నాగస్వరంపట్టితే నాగులకుఆట'

మనం నెత్తురు కందులపై, నెలపాపలపై ఉన్నప్పుడే మనతల్లులు 'జోలల్లుపాడితే బాలలకు నిద్ర, నాగస్వరంపట్టితే నాగులకు ఆట' అనే విషయాన్ని మనకు బోధిస్తారు. వెన్నతో నేర్పబడ్డది అవడంచేత ఆవిషయం సులభంగా మన అస్థులకు అంటుకుపోతుంది.

'పాము చెవులు'

నాగస్వరాన్నివిని ఆనాదానికి అమితమైన ఆనందాన్నిపొంది పడగలువిప్పి, నాలుకలుచాచి, శిరఃకంపంచేస్తూ ఆడి పాములు తమ శ్రవణేంద్రియసామర్థ్యాన్ని, నైశిత్యాన్ని చూపెడతాయి అని చెప్పేది మన తల్లులుమాత్రమేకాదు. మాటకారులైన మన పెద్దలుకూడా అట్టి అభిప్రాయాన్నే వెలిబుచ్చుతారు. దూరంలో చెప్పకోబడే మాటల్ని, నెమ్మదిగా చెప్పకోబడే మాటల్ని వినకలిగేవాణ్ణిగురించి చెప్పేటప్పుడు మాటకారులయిన మనపెద్దలు 'పాముచెవులవాడు' అని అంటారు. ఎంత చిన్నశబ్దాన్ని అయినా, ఎంతదూరపు శబ్దాన్ని అయినా పాము వినగలదని మనపెద్దల అభిప్రాయం. అందుకనే శ్రవణేంద్రియసామర్థ్యాన్ని పోల్చి చెప్పవలసి వచ్చినప్పుడల్లా మనపెద్దలు పాముచెవులు అనే పలుకుబడిని ఉపయోగిస్తూవుంటారు. 'పాముచెవులు' అనేపదం జాతీయమైపోయింది.

పాములకు సంగీతం అంటే ఇష్టం

మన తల్లులు, మనపెద్దలుమాత్రమే కాకుండా మన కవులుకూడా పాముల శ్రవణేంద్రియసామర్థ్యానికి పూటకాపులుగా వుంటూవున్నారు. సంగీతాన్ని ఎక్కడవర్ణించినా మనకవులు అది శిశువుల్ని, పశువుల్ని, పాముల్నికూడా ఆకర్షిస్తుందని వర్ణిస్తారు. రవికాంచని విషయాల్నికూడా చూడగలరని చెప్పబడే కవులు పాముల శ్రవణేంద్రియసామర్థ్యాన్ని ఈవిధంగా తుట్రాజులలాగున పొగుడుతూ వుండడంచేత ఆవిషయంలో మనకు స్థిరమైన అభిప్రాయం ఏర్పడిపోతుంది.

ఈ విషయం సత్యసమ్మతమైందికాదు

కాని...మనల్ని లాలించే తల్లులు, పెంచే పెద్దలు, వర్ణించే కవులు మనచెవుల్లో ఇల్లుకట్టుకుని పాములు నాగస్వరాన్ని వింటాయనీ,పాముల వినేశక్తి అపారమైందనీ, పాములు సంగీతంచేత ఆకర్షింపబడతాయనీ చెబుతున్నప్పటికీ ఈవిషయం సత్యసమ్మతమైందికాదని మనం తెలుసుకోవలసివుంది.

పాములు నాగస్వరాన్ని వింటాయనడం పచ్చి అబద్ధం. ఉపపత్తులు చూపెడతాను.

ఈలోగా ఒకప్రశ్నకు సమాధానం ఈయవలసి వుంటుంది. పాములు నాగస్వరాన్ని వింటాయనడం పచ్చి అబద్ధం అయితే—పాములవాళ్లు తమ నాగస్వరాలచేత పాముల్ని పట్టేస్తారనే గాఢమైన నమ్మకం మనలో ఎందుకు కలగాలి అనే ప్రశ్న రావచ్చు. ఈప్రశ్నకు సమాధానం చెప్పడం అంత కష్టంలోది కాదు.

నాగస్వరాన్ని అన్నిపాములూ వినవు, ఎంచేత?

పాములవాళ్లు పాముల్ని నాగస్వరాలు ఊది పట్టుకోవడంలేదు. పాములవాళ్లు స్వతహా పాముల్ని పట్టుకోవడంలో మంచి నేర్పరులై ఉన్నారు. ఆ నేర్పు వాళ్ళకి అభ్యాసవశంచేత వచ్చిందికాని నాగస్వరం ఊదడంచేత వచ్చిందికాదు. పాముల్ని పట్టే విషయంలో వాళ్లు మిక్కిలి చురుగ్గావుంటారు. పాముని చూసీచూడ్డంలో పాముతలకింద గట్టిగా పట్టుకుంటారు. తలకిందపట్టుకుంటే ఇక ఆపాము ఆపట్టుకున్నవాడిని ఎట్లా కరుస్తుంది? పాములతో వాళ్ళకువుండే అతిపరిచయంచేత ఎట్టి భయంలేకుండానూ, చురుగ్గానూ వాళ్లు ఈపని చేస్తారు. అంతేకాని వాళ్లు నాగస్వరంపట్టి పాముల్ని వశంచేసుకోరు, వాటిని మంత్రించరు. నాగస్వరంపట్టి పాముల్ని వశంచేసుకోవడం, మంత్రించడం నిజమైతే నాగస్వరాన్ని అన్నిపాములూ వినవు, ఎంచేత? పాములవాళ్లు నాగస్వరంతో ఒక్క త్రాచుపాముల్నే ఆడిస్తారుకాని ఇతరజాతిపాముల్ని ఆడించరు. త్రాచుపాములికే కాని ఇతరమైన పాములికి ఈనాగస్వరమంత్రం పనిచేయకపోవడం విచారింపతగ్గ విచిత్రవిషయమే. పాములు నాగస్వరంచేత ఆకర్షింపబడి ఆడ్డమే నిజమైన విషయమైతే ఒక్క త్రాచుపాములేకాకుండా కట్లపాములు మొదలైన ఇతర పాములన్నీ కూడా అట్లా ఆడాలి. కాని అట్లాఆడ్డం ఎక్కడాలేదు.

1936 ఆగష్టుమాసపు ఆంధ్రభూమి సంచికలో 'పాము బుసకొట్టడం. షేకస్పోతు గాంభీర్యంలాంటిది' అనే శీర్షికతో ప్రచురింపబడ్డ వ్యాసంలో 'పాములు వినగలవు. కాని వాటికి పైచెవులు లేవు. కాబట్టి గాలిద్వారా వచ్చే శబ్దాలు వానికి వినిపించవు. ఘనపదార్థాలద్వారా వచ్చే శబ్దాల్ని అనగా నేలమీది అడుగుల చప్పుడు మొదలైనవాటిని అవి వినగలవు. ఈశబ్దాల్ని అవి వెన్నెముకద్వారా పొందుతాయి.' అని వ్రాసివున్నాను. ఈ వాక్యాల్ని కొద్దిగా విపులపరిస్తే 'పాములు నాగస్వరాన్ని వింటాయనడం పచ్చి అబద్ధం' అనేవిషయం అరూఢం అవుతుంది,

పాముకి పై చెవులు లేవు

అన్నిపాముల్లోనూ వినే ఉపకరణాల నిర్మాణం చాలా ప్రాథమికంగావుంది. త్రాచుపాములుకూడా ఈన్యాయానికి లోబడ్డవేకాని అతీతమైనవి కావు. జంతువులికి సాధారణంగా పైనవుండే వినే ఉపకరణా లేవీ పాములికిలేవు. గాలిద్వారావచ్చే శబ్దాల్ని అనగా మనుష్యులమాటలు, పాటలు మొదలైనవాటిని అవి వినలేవు. ఘనపదార్థాలద్వారా వచ్చే శబ్దాల్ని అనగా భూమిమీదపడే మనుష్యుల అడుగులచప్పుడు, చేతికర్రచప్పుడు మొదలైనవాటిని, అవి వినగలవు. ద్రవపదార్థాలకన్నా, గాలికన్నా శబ్దాన్ని ప్రసరింపజేయడంలో ఘనపదార్థాలు హెచ్చుమహిమగలవి అనే సంగతి శాస్త్రసిద్ధమైనవిషయం.

శ్రవణసంబంధమైన నరం

ఘనపదార్థాలద్వారా ప్రసరింపబడే శబ్దం పాములకు ఎట్లు చేరుతుందనే విషయం తెలుసుకోతగ్గది. అట్టి శబ్దం మొదట నేలద్వారా ప్రసరించి పాము శరీరానికి అందుతుంది. అక్కడనుంచి అది పాము శరీరంలోపలవుండే శ్రవణసంబంధమైన నరానికి చేరుతుంది. అందుతో ఆశబ్దాన్ని ఆపాము వింటుంది.

తుపాకిపేల్చిన పెద్దచప్పుడేనా అది వినలేదు

కాని గాలిద్వారా ప్రసరించే తుపాకి పేల్చిన చప్పుడు మొదలైన ధ్వనుల్నిమాత్రం పాములు వినలేవు.

ఈ విషయంలో-పాములు నాగస్వరాన్ని వినలేవు అనేవిషయంలో- కల్నల్ వాల్ ఐ.యమ్.యస్. దీక్షగా పరీక్షలుచేసి నిర్ణయించాడు. నాగస్వరం పాడేసమయంలో త్రాచుపాము బుర్ర ఆడించడం, పడగవిప్పడం, లేవడం మొదలైనవన్నీ ఆస్వరాన్ని విని కాదనీ; పాడేసమయంలో పాములవాడు నాగస్వరపు బుర్రని అటూఇటూ తిప్పడంవల్లనేనని ఆయన చేయెత్తి చెబుతున్నాడు.

పాములవాని హస్తవిన్యాసాన్ని, వేళ్ళ చల

వాన్ని, నాగస్వరపు బుర్ర కదలికనీ పాముకళ్లు అనుసరిస్తాయి. ఆవిన్యాసానికి, చలనానికీ, కదలికకూ అనుగుణ్యంగా పాము తన పడగని ఆడిస్తుంది, కాని స్వరానికి అనుగుణ్యంగామాత్రం కాదు.

పాముకళ్ళకు గంతలుకట్టితే

ఒకసారి కల్నల్ వాల్ జిగురు పాలాస్త్రిపట్టీ ముక్కలు రెండు తెచ్చి వానితో పాముకళ్లు రెండూ మూసేశాడు. పాముదృష్టి పూర్తిగా నిరోధింపబడ్డది. పాములవాడు నాగస్వరాన్ని పాడుతూ నేవున్నాడు. అయినా చూపు లేకపోవడంచేత అపాయశంక వశించగా ఆపాము పడగను ముణిచేసుకుంది. అప్పుడు కల్నల్ వాల్ ఒకఖాలీ కిరసనాయిలు డబ్బా తెచ్చి పాము తలదగ్గిరగా పట్టుకుని కర్రతో డబ్బాని బాది చూశాడు. ఈగొడవ ఏమీ పాము పాత్తిపట్టలేదు. ముచ్చుముణిగే వుండిపోయింది కాని అది తలఎత్తి పడగ విప్పలేదు.

బాకాఊదినా పాము వినలేదు

తరవాత ఒకబూరా తెచ్చి ఊది చూశారు. చెవిటివాడిదగ్గర సంకుఊదినట్లు అయింది. బాకాచప్పుడ్నీ ఆపాము గుర్తించలేక పోయింది.

కాని అచ్చటి బయటి వరండాలోని బల్ల సరంబీమీద సేవకుడు నడిచినా, లోపల కుర్చీని కదిపినా పాము లేచి తలఎత్తి పడగవిప్పింది. ఘనపదార్థాల ద్వారా ప్రసరించిన ధ్వని ఆపాముకి అందింది. అందడంతోటే ఆశబ్దం తనకు కలుగబోయే అపాయానికి సూచనఅనుకొని ఆపాము తలఎత్తి పడగవిప్పింది.

దీన్నిబట్టి తేల్చుకోవలసిన సారాంశం ఏమిటంటే పాములికి పైచెవులు లేకపోయినా అవి చెవిటిజంతువులు కావు. ఓమాదిరి మందంగా ధ్వనుల్ని వింటాయి.

నాగస్వరము : పాముపడగ

పాములవాడు పాడే నాగస్వరపు సంగీతానికి చొక్కి కాక పాములవాడు నాగస్వరపు బుర్రమీద చేతివేళ్లు కదుపుతూ ఉండడానికి, మునిపాదాల మీద కూచుని ఒక మోకాలిని తరుచుగా కదుపుతూ ఉండడానికీ భయపడి త్రాచుపాము ఉద్రేకాన్ని పొంది ఉవ్వెత్తుగ లేచి పడగఎత్తుతుందని కల్నల్ వాల్ పరిశోధనలు నిర్ణయించేస్తున్నాయి.

చురుకు కళ్ళవల్ల కాని చెవులవల్ల కాదు

చలనం ఎట్టిదికాని త్రాచుపాము దృష్టిని ఆకర్షిస్తుంది. మనచేతిని ఒకదానిని చలింపచేస్తూ పాము దృష్టిని అంతటినీ ఈ చలింపచేసే చేతివైపు ఆకర్షించి రెండోచేత్తో అది గుర్తించకుండా దాన్ని శరీరం మధ్యభాగాన్ని పట్టుకోవచ్చు. తనకళ్ళ ఎదుట చలిస్తూన్న చేతినే అది గమనిస్తుంది కాని రెండోచేతిని అది గమనించనే గమనించదు.


త్రాచుపాముల్ని, ఇతరపాముల్ని అంత చురుగ్గా వుండేటట్లు చేశేవి వాని కళ్లుకాని చెవులుకావు.


కాబట్టే పాములు నాగస్వరాన్ని వింటాయనడం పచ్చి అబద్ధం అని రొక్కాయించి చెప్పడానికి వీలైంది.

పాముకి కళ్ళే చెవులు

పాములకువున్న శ్రవణేంద్రియమాంద్యం, నయనేంద్రియ నైశిత్యం పూర్వకాలపు హిందువులకు బాగా తెలిసిన విషయమే. సంస్కృతభాషలో పాములకువున్న పర్యాయపదాల్లో 'చక్షుశ్రవ' అనేది ఒకటి. చక్షుశ్రవ అనగా కళ్ళతోటి వినేది అని అర్థం. పాముకి కళ్ళే చెవులన్నమాట.

కళ్ళతోటి వినేవిగా మనపూర్వులచేతకూడా చెప్పబడ్డ ఈపాములనుగూర్చి మన తల్లులు నాగస్వరపు సంగీతంవిని అవి ఆడతాయనీ, మన పెద్దలు వాని చెవుల వినేశక్తి అద్భుతమైందనీ, మనకవులు అవి సంగీతానికి చెవులు కోసుకుంటాయనీ అనడం ఆశ్చర్యంగానే వుంటుంది.





Consulting Physician :—

ఆయుర్వేదభూషణ వేటూరి శంకరశాస్త్రిగారు, ఎ. ఎం. ఎ, సి.

శాండర్సు నార్వెల్

కొనతలచనివారిచే కొనిపించవచ్చును—
ఏవస్తువనైనను ఎచ్చటనైనను విక్రయింపవచ్చును—
అమ్మకములో విసుగుదలలేకుండ చేయవచ్చును—
ఇవి ఎట్లు పొసగునో ఈ వ్యాసము తెలుపును.

అతనినామము శాండర్సు నార్వెల్; అతని వృత్తి వస్తువిక్రయము; అతని ఉనికి అమెరికా సంయుక్తరాష్ట్రములలో. ఆంగ్లసామ్రాజ్యపు రాజధానినగరమగు లండనునందును, పరాసుసామ్రాజ్యపు రాజధానినగరమగు ప్యారిస్ నందును వర్తకసంఘమున అతని నామము ఎల్లరకును ఎఱిగినది. 1930 ప్రాంతమున శాండర్సునార్వెల్ రెమింగ్టన్ ఆరమ్సు కంపెనీకి అధ్యక్షుడుగ నియమింపబడెను.

చిన్నటనాట నార్వెల్ తానొక చిత్రకారుడు కావలయునని కుతూహలపడినాడు. లలితకళలకు కాణాచియగు ప్యారిస్ మహాపట్టణమునకుపోయి చిత్రకళ అభ్యసింపవలయునని అతడు అగ్గలముగ అభిలషించినాడు. కాని వలయు ధనము లేకపోయినది. జీవిక సాగుటకు ఇనుపసామానులమ్ము కంపెనీలో రవాణాగుమాస్తాగా అతడు చేరవలసినవాడయ్యెను.

కాని ఒక సుగుణము. గుమస్తాగా అతడు చిరకాలము కుమిలిపోవలేదు. అచిరకాలముననే అతడు ఆకంపెనీలో వస్తువిక్రేత (Salesman) యయ్యెను. అతనికి ఇరువదితొమ్మిదవయేడు పైబడుసరికి అతడు ఆకంపెనీ సేల్సుమేనేజరు పదవి నధిష్ఠించెను.

సేల్సుమాన్ గా అతని అభివృద్ధి అద్భుతమైనది. ఏడాదికి రెండులక్షల పౌనులచొప్పన పదియేండ్ల పర్యంతము అతడు తనకంపెనీలోని వస్తువులఅమ్మకమును పెంపొందించెను.

ప్రతి వస్తువిక్రేతయు చేయవలసిన ప్రధానకృత్యములు మూడుకలవని అతడు అనును. అవి యేవియన: వినుట— చూచుట— జ్ఞప్తియందుంచుకొనుట.

వస్తువిక్రయమునకు సరియగు మార్గము కొనుగోలుదారు చెప్పినది వినుటగాని వస్తువిక్రేత ఉపన్యసించుట కాదని అతడు చెప్పును. 'ఇతరపద్ధతులవలనకంటె సలహాచేసియు, భోగట్టా అడిగియు నేను విస్తారముగ వస్తువులు విక్రయించియున్నాను' అని ఆతడు చెప్పును.

వస్తువిక్రయావసరమున అతడు తననాలుకకంటె కండ్లను, చెవులను ఎక్కువగ ఉపయోగించును. అన్నిటిని లెస్సగ గమనించును. ఖాతాదారుల పేరుల బాగుగ జ్ఞప్తియందుంచుకొనును. వస్తువులు విక్రయించుటయందు ఎంతకాలమును వెచ్చించునో అంతకాలమును సంగతులు తెలిసికొనుటయందును వెచ్చించును. కారణముగ అతని యాజమాన్యమున వస్తువిక్రయము విశేషముగ విస్తరిల్లినది.

అమ్మకములో విసుగుదల అనునది ఒకటి ఉన్నదని ఆ అనుభవజ్ఞుడు చెప్పును. అగుటనే ఏట్రావెలింగుఏజెంటు అయినను తాను తిరిగిన ప్రదేశములందు అన్నిటియందును ఒకేమాదిరిగ వస్తువిక్రయము కావింపజాలడు;

తనవద్ద అమ్మకమునకు ఉన్న అన్ని వస్తువులను ఒకేమాదిరిగ విక్రయింపజాలడు.

అతడు ట్రావెలింగుఏజెంటుగ నుండినపుడు ఎబ్బది యైదువేల రకముల ఇనుప సరకుల కేటలాగునుండి వస్తువిక్రయము చేయవలసియుండునది. ఆకేటలాగు తూకమే నలుబది పౌనులు ఉండునది. ఆకేటలాగులోని మూడుభాగములలోని మొదటిభాగమునందలి వస్తువులనే విస్తరించి అమ్మగలుగుచుండినట్లు ఆతడు గుర్తించినాడు. తాను, కాతాదారు కేటలాగు సగమువఱకు తిరుగవైచుచు పోవు సరికి విసుగువచ్చునది. కేటలాగులోని మిగిలిన పత్రములను విసుగుతో తిప్పివైచువారు. విసుగుతో తిప్పివేయబడుచుండు పత్రముల లోని వస్తువులకు ఆర్డరులు ఎట్లుండును?

చతురమతియగు శాండర్సు నార్వెల్ ఇది గమనించినాడు. కావున కేటలాగు తిరుగవేత ఒక్కొక్కప్పుడు వెనుకనుండి ముందుకు,- అటునుండి ఇటు- జరుగునది. ఒక్కొక్కప్పుడు తిరుగవేత కేటలాగు మధ్యలో ప్రారంభమగునది. ఈవిధానమువలన కేటలాగులోని అన్ని వస్తువులకు- మొదటివి,మధ్యవి, చివరవి అనుభేదములేకుండ అన్నివస్తువులకు- ఆర్డరులు ఉండునవి.

వస్తువిక్రయవిస్తృతికి అతడు అవలంబించిన మఱియొక విధానము ఏమన ఒక్కొక్క మాసమున ఒక్కొక్క ప్రత్యేక వస్తువు విక్రయమున శ్రద్ధచూపుట. ఏడాదికి పండ్రెండు వస్తువుల విక్రయమున ప్రత్యేక శ్రద్ధ. ఈవిధానమువలన కంపెనీకి ఏనెలలో కాని వ్యాపారమాంద్య మనునది ఉండునది కాదు.

వస్తువిక్రయవ్యాపారమున ఎప్పుడుకాని అభివృద్ధిని చూపజాలని మనుష్యులు మూడు రకములవారు ఉన్నారు. మొరాసిక్, ఎక్కువుంటెంటు, సాహసములేనివాడు- ఈముగ్గురును వస్తువిక్రయమున జయశీలురుకాలేరు. వారు ప్రియవాదితనమున సంభాషణ నెఱపుటకుగాని, ఇతరులను ఆకర్షించుటకు గాని సమర్థులు కారు.

వస్తువిక్రేత సర్వదా ప్రాప్తకాలజ్ఞుడు కావలయును. ఏసమయమునకు ఏది అవసరమో సూక్ష్మముగా గ్రహించి ఆసమయమున దానిని బజారున పెట్టవలయును. ఆపెట్టుటయు కాలవిలంబము కాకుండ నిముషముల మీద జరుగవలయును. సేల్సుమాన్ అగువాడు వినువాని ఇంగితమును కనిపెట్టి మాటలాడవలయును. 'ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటి కాపలుకు పలికి' వర్తించుట సేల్సుమాన్ అగువానికి ప్రధానధర్మము.

వచ్చిన లాభములో నూటికి ఇరువదియవ వంతైన వస్తువులను ఉత్పత్తి చేయువారలకు పంచిపెట్టవలయునని శాండర్సు నార్వెల్ నమ్మకము. ఈవిధముగ పంచిపెట్టుట యొక విధమగు పెట్టుబడి యగునేకాని వ్యయము మాత్రము కాదని అతడు చెప్పుచున్నాడు.

వస్తువిక్రేత సరియగుమార్గమును అవలంబించి పోవుచో ఏవస్తువునైనను ఎచ్చటనైనను విక్రయింపవచ్చునని శాండర్సు నార్వెల్ సిద్ధాంతము చేయుచున్నాడు. ఒక పితలాటకపు బ్యాంకరునకు అతడు ఒకసారి ఒక బంగారపు తాళముచెవిని విక్రయించినాడు. ఈవిక్రయము పందెముమీద జరిగినది. ఆ బ్యాంకరు బంగారపుతాళపు చెవిని కొనుపాటి ఉదారుడుకాడు. అయినను నార్వెల్ తన విక్రయసామర్థ్యముచేత ఆపితలాటకపు బ్యాంకరుచే బంగారపు తాళముచెవిని కొనిపించినాడు. అది ఎట్లు పొసగినది? తొలుత నార్వెల్ తనకొఱకు ఒక బంగారపుతాళము చెవిని చేయించుకొని దానిని తన జేబుగడి

యూరపు గొలుసున వ్రేలాడతీసినాడు. పిమ్మట బ్యాంకరు దర్శనమునకు పోయినాడు. సంభాషణావసరమున బ్యాంకరునకు దానినిచూపి దానిధారణము ప్రసాదభావప్రేరితమనియు, తన కళానిరతికి మచ్చుగానుండగలదనియు చెప్పినాడు. బ్యాంకరు హృదయముకూడ ప్రసాదభావప్రేరితమైనది. అతనికిని అతని కళానిరతికి మచ్చుగానుండుటకై బంగారపు తాళముచెవిని ధరించుట అవసరమని తోచినది. తోడనే బంగారపు తాళముచెవి కొఱకు ఆబ్యాంకరు ఆర్డరు ఇచ్చినాడు. ఆ ఆర్డరును నార్వెల్ కంపెనీవారే నిర్వహించినారు. అంతియకాదు. నార్వెల్ తన పందెమును కూడ నెగ్గినాడు. కొనతలచనివారిచే కొనిపించుట యేగదా వస్తువిక్రేతల అతిశయసామర్థ్యమునకు యోగ్యతాపత్రము!

పదిసంవత్సరములు సేల్సు మేనేజరుగా ఉండినాడు. చేరలకొలది ధనము ఆర్జించినాడు. ఆపైన ఆ ఉద్యోగమును విరమించినాడు. ఇంతకాలమును అతని మనము చిత్రకళాభ్యసనముపై లగ్నమయ్యేయున్నది. ఇపుడు అతడు ప్యారిస్ మహాపట్టణము వెళ్ళినాడు. చిత్రకళాభ్యసనమునకు దొరకొనినాడు.

అభ్యసనము కొద్దికాలమే సాగినది. దాని యందు అతని చిత్తము నిలకడవహింపలేదు. కాగా చిత్రకళపై మోజు అచిరకాలముననే తగ్గిపోయినది. మోజు తగ్గుటయేకాదు చిత్రకళయునిన విసుగుకూడ పుట్టినది.

తిరిగి అమెరికాకు పోయినాడు. వ్యాపారమున ప్రవేశించినాడు. చిత్రకళకంటె వస్తువిక్రయమే అతని చిత్తమునకు ఎక్కిన పనియైనది.

ప్రపంచమున అన్నిటికంటె వస్తువిక్రయవృత్తి చమత్కారమైనదని అతని తలంపు. వస్తువిక్రయవృత్తి అవలంబించుటవలన ఒకనికి లోకమువారితో పరిచితి ఏర్పడును. వస్తువిక్రేతి లోకజ్ఞానము విశేషమైనదిగాను, అనుభవము అపూర్వమైనదిగాను ఉండును. అతని తెలివితేటలు అనుదినము ప్రవర్ధమానములగును.

చిలుకా!

రచయిత:

విద్వాన్ కోగంటి దుర్గామల్లికార్జునరావు

౧

గూటిని నుంటిని
దీటుగ నేనని
సారెసారెకును
సంతసింపకుము—— చిలుకా!

౨

పొంగుట యెంత
క్రుంగుట యెంత
పక్షణమెట్టిదొ
ఎవ్వఁడెఱుంగునే—— చిలుకా!

౩

మురిసిపడుచు సం
మోహామనెడి యం
భోరాశినిఁ బడి
మునిఁగిపోవకుము—— చిలుకా!

౪

తనువుపై ని ధ్యా
తమినెల్లన్ విడి
తత్త్వంబెఱింగి
తగవ ర్తిల్లుము—— చిలుకా!

భర్తరాక ఆలస్యమైతే

(ఏకాంకవచననాటిక)

రచయిత:

విద్వాన్ పాలెపు వెంకటరత్నము

౧

[సూచిక :—అశోకమహారాజు చిన్నభార్య 'తిష్యరక్షాదేవి' తన సవతికొడుకైన కుణాలుణ్ణి కామించి వివిక్తప్రదేశంలో తన అభిప్రాయం అతనికి నివేదించింది. (ఈగాథ 'తిరస్కృతప్రణయిని తిష్యరక్ష' అనే శీర్షికతో ఏకాంకవచననాటికగ 1936 మార్చి మాసపు ఆంధ్రభూమిసంచికలో వివరింపబడ్డది.) కాని అజితేంద్రియుఁడు ఆమెవలలో పడక ధీరచిత్తంతో తప్పించుకొని వచ్చాడు. ఈలోగా అతనిభార్య 'కాంచనమాల' భర్తరాక ఆలస్యమైతే బుద్ధభగవానుని మఠాయతనంలో పునరాగమనానికి ప్రార్థనలుచేస్తోంది. ఈ రంగం ఈసందర్భం తరువాతిది.]

౨

[రంగం :—మఠాయతనం. పూజామందిరం ముందు రెండు దీపాలు రజతస్తంభాల్లో ఉజ్జ్వలంగా వెలుగుతూ ఉంటాయి. సింహాసనంపైన పువ్వులతో నిండిన బుద్ధదేవుడి విగ్రహం ఉంటుంది. ఆదేవుడి పాదాలదగ్గిర చాలా బౌద్ధధర్మగ్రంథాలు దొంతర్లుగా ఉంటాయి. ఎదురుగా 'కాంచనమాల' మోకరిలి తదేకధ్యానంతో ప్రార్థిస్తూ ఉంటుంది. పదిహేడేళ్ళ వయస్సు. మహాపతివ్రతాలక్షణాలు. భక్తే అక్కడ మూర్తీభవించిందా అన్నట్టుంటుంది.]

కాంచనమాల :

ధర్మంశరణం గచ్ఛామి
సంఘంశరణం గచ్ఛామి
బుద్ధం శరణం గచ్ఛామి.

దేవా! బోధిసత్త్వా! ఎందుకిలా ఆందోళన కలుగజేశావు నామనస్సులో? నాజీవస్వామీ, నేనూ ఆ కృతకాద్రిదగ్గర అలా సంతోషంగా పుష్పాపచయం చేస్తోంటే యెందుకు నాపుష్పాలంకారాలన్నీ కనబడకుండా చేయాలి. రంగంలో నాపాత్ర లోపంరాకడంచేత ప్రదర్శానికి భంగంకలిగిందో యేమిటో, అసలు నేను ప్రదర్శనం చూడ్డానికైనా వెళ్ళలేదు. భగవన్. బుద్ధదేవ! నాహృదయనాథుణ్ణి నిరపాయంగా త్వరగా నాకళ్ళబెట్టు. తండ్రీ నేనేమో నాకు చాలా దిగులుగాఉంది. ఎంతత్వరలో నాప్రాణప్రభువు నాక్కనబడతాడో అంతత్వరలో నాహృదయానికి శాంతి. ధర్మం. సంఘం. బుద్ధం.

(ధ్యానిస్తూఉంటుంది.)

[ప్రవేశం : కుణాలుఁడు.]

కుణాలుఁడు :

ఇదుగో నా కాంచన. ధ్యానంలోఉంది, అర్ధరాత్రివేళ ఒంటరిగా మఠాని కెందుకొచ్చిందిచెప్మా. ఎప్పుడూ అలవాటులేదే. నేడు జరిగిన సంగతివల్ల మనస్సు కుదురుగా ఉండక ప్రార్థన కొచ్చేసింది కాబోలు ఒక్కర్తితిని. ఆమెధ్యానం నేనెందుకు భంగంచెయ్యాలి. ఆమెప్రక్కనే నేనూ ధ్యానిస్తాను. ధర్మం. సంఘం. బుద్ధం. (ధ్యానం.)

కాంచనమాల :

(ధ్యానంలోనే)

ఏమిటిచెప్మా నామనస్సుకింత సంతోషంకలిగింది. వేసంకాలంలో కాగికాగిఉన్న భూమిమీద సువృష్టి కురిసినట్టయింది. వచ్చేశాడు కాబోలు నాప్రభువు. నామనోనాథుఁడొచ్చేశాడు కాబోలు.

(ప్రక్కనిచూస్తుంది. కుణాలుఁడు గాఢధ్యానంలో ఉన్నాడు.)

కుణాలుఁడు :

భగవన్, జినదేవా! ఈరోజు నిజంగా దుర్దినం నాకు. ఇప్పుడు జరిగిన సంఘటనవల్ల నా కమంగళం గోచరిస్తోంది. నాకు రాజ్యంవద్దు. ధనంవద్దు. భోగం వద్దు. నాధర్మానికిమాత్రం భంగం కలగజేయకు, నాస్వామి! నాకు వచ్చే కష్టాలు నివారించు దేవా! నామనస్సు ధర్మపథంలోనే నడవనియ్. ఇతరులకు కూడా ధర్మబుద్ధే ప్రసాదించు. ఇదే నాప్రార్థన.

(కళ్లు తెరుస్తాడు.)

కాంచనమాల :

ప్రాణపతీ! జీవనాథా! వచ్చారా స్వామీ! యేమీ అపదకలగలేదుకదా మీకు. క్షేమంగా వచ్చారా. ఏవీ మీరెండుపాదాలూను. ఒక్కసారి కళ్ళ కద్దుకోనియ్యండి. (అలాచేస్తుంది.)

కుణాలుఁడు :

కాంచనా! నాప్రియకాంచనా! మన ధర్మదేవత, మన సంఘదేవత, మన బుద్ధదేవత మనతో ఉండగా మన కేకష్టాలూ రావు. ఒచ్చినా తక్షణమే పోతాయి.

కాంచనమాల :

కాని నాథా! నామనస్సు కేమో దిగులుగాఉంది. మన కెందుకొచ్చిన వీ రాజ్యభోగాలూ అవీని. నేనే ధర్మదీక్ష పూనండి. సంచారంచేసి ప్రతిగ్రామమూ, ప్రతి తీర్థమూ, ప్రతిక్షేత్రమూ, మన బౌద్ధధర్మ ప్రచారంచేద్దాము. దీనులకీ, బీదలకీ సేవచేద్దాము చేతులారా.

కుణాలుఁడు :

వెర్రి కాంచనా! నే నీరాజ్యాదిభోగాలకి లోభపడ్డాననుకున్నావా? రాజపుత్రుఁడనైతే ధర్మం యొక్కువత్వరలో ప్రచారంచెయ్యొచ్చునని కాని. ఇప్పటికే చూచావా ఈరాజ్యంలో సగంమంది బౌద్ధ ధర్మావలంబులయ్యారు. మహారాజు కేవలం బౌద్ధుఁడు. అసలా ఉద్దేశంతోనే నన్నిక్కడ జన్మింపజేసాడాదేవుఁడు.

కాంచనమాల :

నాథా! నే నది యెరక్కపోలేదు. మీరుకేవలం భోగాభిలాషులై ఇక్కడున్నారనీ నే ననడంలేదు. కానీండి మీయిష్టానుసారం ఇక్కడుంటే ధర్మాభివృద్ధి చేద్దాం. ఇప్పుడుకలిగిన అదుర్దా పోవడానికి ఒక్కసారి బుద్ధమూర్తి యెదుటగా ధర్మస్వీకారం చేద్దాం, స్తవంచేద్దాం ఇద్దరంకలసి.

కుణాలుఁడు :

సరే అలాగేచేద్దాము. నీఇచ్ఛకు నే వ్యతిరేకం చెపుతానా.

ఇద్దరూకలిసి :

దేవా బోధిసత్వా! సంఘమా! ధర్మమా! మేమిరుపురము నేడు మనఃపూర్తిగా బౌద్ధధర్మస్వీకారం చేస్తున్నాము. దీనికి మామనసులే సాక్షి. బౌద్ధధర్మాలకి వ్యతిరేకాలైన యేపనులూ మేంచెయ్యం. సాధ్యమైనంతవరకు దీనులకు, పేదలకు, రోగులకూ, స్వహస్తాలతో సేవచేస్తాము. విశ్వప్రేమతో మాజీవితోద్దేశంగా నడుచుకుంటాం. ఇది మా త్రికరణశుద్ధిగా జేసిన ధర్మస్వీకారం.

[బుద్ధవిగ్రహం చిరునవ్వుతో చేతులెత్తి ఇద్దరినీ ఆశీర్వదిస్తుంది. మఠంలో ఉన్న జేగంట దానంతటదే వాగుతుంది. పుష్పపరిమళమిళితమైన చల్లనిగాలి వీస్తుంది. ప్రకృతి మంగళహారతి పాడుతుంది. పున్నమ చంద్రుడు సంతోషంతో నవ్వుతూఉంటాడు.]

కాంచనమాల :

ఇప్పటికి నామనస్సు కుదుటబడింది. ఇంక మన కేకష్టాలురావు. వొకవేళ వచ్చినా చాలాకాలం ఉండవు. ఈధర్మం తీసుకున్నవారికి ఆపదలేమిటి?

కుణాలుఁడు :

సరే మనం మళ్లా * రంగస్థలానికి వెళ్దాం, రాజునాశీర్వదించడానికి, దేవదంపతుల వేషాలతో. చప్పున పద. (వెడలుదురు)

[తెర.]

---

* అశోకమహారాజు బౌద్ధమాహాత్మ్యబోధకమైన నాటకప్రదర్శనం ఏర్పాటుచేశాడు. రాజకుటుంబంలోవారే దానిలో పాత్రధారులు.

తెనుగువారి జీవనదులు

రచయిత:

కొత్తపల్లి రామమూర్తి, యల్.యమ్.ఇ.

[తమ మధురజలములచే ఆంధ్రుని రక్తనాళములను పరిపుష్టి నొందించుచు, తమ పావనజలములచే ఆంధ్రుని శారీరక మానసిక మాలిన్యములను కడగివైచుచు, తమ సారజలములచే ఆంధ్రుని ఊషరక్షేత్రములను కేదారక్షేత్రములుగ చేయుచు పలురీతుల ఉపకరించుచున్న ఆంధ్రుని జీవనదులను గూర్చిన ఈ వ్యాసము ఆంధ్రులకు అవశ్యము పఠనీయమైనది. —సంపాదకుడు.]

తెనుగువారి జీవనదుల్లో గోదావరి, కృష్ణ, పినాకిని, తుంగభద్ర ముఖ్యంగా పేర్కొన తగ్గవి. ఈనదులు మనకు చిరపరిచితాలు అయినప్పటికీ కృతజ్ఞతాసూచికంగా మరి ఒకసారి స్మరించి తరిద్దాం.

౧
గోదావరినది

ఇది మహారాష్ట్రులకు, ఆంధ్రులకు ఉమ్మడి నది. అయినా ఉపయోగం అంతా ఆంధ్రులే పొందుతూ ఉండడానికి వీలయింది. పుట్టినచోటు మొదలు సముద్రంలో పడేవరకు వున్న దీని ఒడ్డుల ప్రతి అంగుళస్థలమూ పవిత్రమైందిగావుంది. గోదావరి, గంగ ఒకేస్థానంలో పుట్టినవనీ, గోదావరిని గౌతముడనే ఋషి గోహత్యావిముక్తికై తీసుకువచ్చేడనీ, దానినుండి సప్తఋషులు సప్తశాఖలు తీసుకుపోయారనీ పురాణాలు చెబుతున్నాయి. ఈనది బొంబాయి రాజధానిలోని నాసిక జిల్లాలో అరేబియాసముద్రానికి ఏభై మైళ్ల దూరాన్ని ఉన్న త్రయంబకమను గ్రామసమీపంలో జన్మించి ఆగ్నేయ దిశగా ప్రవహిస్తూ హైదరాబాదుగుండా, గోదావరి జిల్లాగుండా పారి ఏడుపాయలై సముద్రంలో పడుతూవుంది. ఒకొక్కచోట ఈనది సాంద్రారణ్యాలగుండా పారుతూవుంది. ప్రాణహిత, మంజీర, శబరి, ఇంద్రావతి, కిన్నరసాని మొదలైనవి దీని ముఖ్యమైన ఉపనదులు. ఈనది నిడివి తొమ్మిదివందల మైళ్లు. ఈనదీగర్భమున ఏర్పడ్డ లంకల్లో పండే పొగాకు ప్రఖ్యాతివహించింది. ధవళేశ్వరంవద్ద ఆనకట్ట కట్టి దీని నీటిని సాగుబడికి అనుకూలంగా చేశారు. మధ్య పరగణాల్లోని, హైదరాబాదు రాజ్యంలోని వరదనీటినంతటినీ ఈనది ఆంధ్రదేశానికి తెస్తూవుంది. జనాభానుబట్టి భారతదేశపు వివిధ జాతుల్లో తెనుగువారు మూడవవారు అయితే తెనుగువారి పెద్దనది అయిన గోదావరి నిడివిలో భారతదేశపు వివిధనదుల్లో మూడవది అయివుంది.

౨
కృష్ణానది

గోదావరినది మహారాష్ట్రులకు తెలుగువారికి ఉమ్మడినది అయితే కృష్ణానది కర్ణాటకులకు తెలుగువారికి ఉమ్మడినది అయివుంది. అయినా గోదావరివలని విశేషోపయోగాన్ని ఆంధ్రులు పొందుతూన్నట్లే కృష్ణవలని విశేషోపయోగాన్నికూడా ఆంధ్రులే పొందుతూ

వున్నారు. ప్రకృతిమాత అనుగ్రహవిశేషం అది. కృష్ణానది బొంబాయి రాజధానిలోని మహాబలేశ్వరపురానికి ఉత్తరభాగాన్ని ఉన్న సహ్యాద్రిలో పుట్టి వాయువ్యదిశగా పారి పూనాప్రాంతములనుండి వచ్చే భీమానదిని తనలో ఇముడ్చుకొని కొంతదూరము ప్రవహించి తుంగభద్రనుకూడ కడుపున పెట్టుకొని హైదరాబాదుకు తూర్పుఎల్లగా ప్రవహించి నల్లమలల లోయలగుండా పోయి ఇంద్రకీలాద్రి, ఉండవిల్లి కొండల మధ్యనుండి ఆగ్నేయదిశగా తిరిగి బెజవాడ దిగువన రెండు పాయలై హంసలదీవివద్ద సముద్రంలో పడుతోంది. బెజవాడవద్ద దీనికి ఆనకట్టకట్టి నీటిని సాగుకు వాడుతూవున్నారు. దీనినిడివి ఆరువందల యాభై మైళ్లు.

౩

పినాకినీనది

ఇది పూర్తిగా తెనుగునది. తెనుగు బాగా వాడుకలోవున్న మైసూరురాజ్యానికి చెందిన కోలారు జిల్లాలోని నందిదుర్గానికి సమీపంలోవున్న చెన్నకేశవకొండలో పుట్టి పూర్తిగా తెనుగుజిల్లాలయిన అనంతపురము, కడప, నెల్లూరు జిల్లాలగుండా ప్రవహించి సముద్రంలో పడుతోంది. బంగారపు గనుల్లో పుట్టినా బొమ్మరాళ్ళ సీమగుండా ప్రవహిస్తోంది అని చెప్పాలి. దీనినిడివి మూడువందల అరవై మైళ్లు. కడప జిల్లాలో చిత్రావతి నదితో కలిసి గండికోటవద్ద ఉన్న కొండ లోయగుండా పోయి పాపఘ్నినదితో కూడుకొని ప్రవహిస్తూవుంది. నెల్లూరువద్ద దీనికి ఆనకట్టకట్టబడివుంది. సంవత్సరంలో కొన్ని నెలలు దీనిలో నీరు ఉండకపోయినా జీవనదుల్లో లెక్కపెట్టవలసిన తాహతు దీనికి ఉంది. దీనికి పెన్నఅనేది వాడుకపేరు.

౪

తుంగభద్ర

ఇది కృష్ణానదికి ఉపనదే అయినా దీనిని ప్రత్యేకంగా జీవనదుల్లో పేర్కొనవలసిన అవసరంవుంది. గంగకు ఉపనది అయిన బ్రహ్మపుత్ర గంగానదికంటె పెద్దది. అట్లే కొన్ని విషయాల్లో కృష్ణకంటె దాని ఉపనదిఅయిన తుంగభద్రే హెచ్చుఅని చెప్పాలి. తుంగభద్ర తుంగ, భద్ర అను రెండునదుల కలయికవలన అయినది. దీనినిడివి నాలుగువందల మైళ్లు. మైసూరు రాజ్యంలో గంగమూల్లవద్ద జన్మిస్తూంది. కర్నూలువద్ద కృష్ణలో కలుస్తూవుంది. ఇది కొంతవరకు బొంబాయి మైసూరులకును, కొంతవరకు బొంబాయి మదరాసులకును, కొంతవరకు మదరాసు హైదరాబాదులకును సరిహద్దుగా పారుతూంది. తుంగభద్రలో ప్రవాహం వడిగావుంటుంది. దీని తీరాన్నే ఆంధ్రకర్ణాటకులకు అపారయశాన్ని తెచ్చిన విజయనగరసామ్రాజ్యం విస్తరిల్లింది. ఆరాజ్యం ఇప్పుడు లేకపోయినా ఆ నాటిరాళ్లు ఈనదితోబాటు ఇంకా మనకు మిగిలిఉన్నాయి. మైసూరులోని బాబరుడాన్ కొండల్లోపుట్టిన వేదవతీనది తుంగభద్రలో కలుస్తూవుంది. వేదవతినది చిత్రదుర్గజిల్లాలో ముప్ఫయినాలుగు చతురపుమైళ్ళ వైశాల్యం గల మరికనవి చెఱువును నింపి మిగిలిన నీటినే తుంగభద్రకు చేరుస్తూవుంది. తుంగభద్రానదిని దాటడానికి 'పుట్టి' అనే గుండ్రనినావల్ని వాడతారు. తెనుగువారికి అందరికీ తెలిసిన 'పుట్టిమునిగిందా' అనే సామెత ఈసాధనాన్ని పురస్కరించుకొని పుట్టిందే. విచారణలోవున్న తుంగభద్రా ప్రాజెక్టు అమల్లోకివస్తే రాయలసీమలో విశేషభాగం సస్యశ్యామలమై ఆంధ్రదేశానికి కొత్తగణ్యతను తెస్తుంది.

మణిమాల

ఆంధ్రోహమ్

ఆంధ్రులారా! మీరాష్ట్రము మీపరిపాలనలో, మీ ఉపయోగముకొరకు ప్రత్యేకింపబడవలెను.

ముందు ఆంధ్రరాష్ట్రము. తర్వాత స్వరాజ్యము-- అదే మన అవధి. ఇంటగెల్చి రచ్చగెల్వుము.

ఆంధ్రయువతీయువకులు ముక్తకంఠముగ 'ఆంధ్రదేశమునాది, నాభాష ఆంధ్రభాష, ఆంధ్రరాష్ట్రము నాజన్మహక్కు' అని పల్కవలసిన సమయమిది.

ఈమంత్రం ప్రతి ఆంధ్రయువకుడూ మననంచేసుకుంటూ వుంటే త్వరలోనే ఆంధ్రరాష్ట్రనిర్మాణం జరుగుతుంది.

—సరస్వతి.

* * *

ఆంధ్రరాష్ట్రనిర్మాణం ఎందుకు?

సంవత్సరానికి 9 కోట్ల రూపాయిలు మన ఆంధ్రదేశములోనుంచి మద్రాసురాష్ట్రమునకు వెళ్లుతున్నాయి- యితరరాష్ట్రములగు తమిళ, మళయాళ, కన్నడములనుంచి 6 కోట్ల రూపాయిలుమాత్రమే వస్తూయున్నాయి. అందుచేత మనరాష్ట్రములోనుంచి వస్తూయున్న డబ్బుపెట్టి మెట్టూరు ప్రాజక్టు, వేలూరు మెడికల్ కాలేజీ, యింకా వారి కుపయోగపడే వన్నీ చేసుకొని అప్పటివరకు మీరు వూరుకొని తరవాత వ్యక్తీయవుడని తమిళసోదరులు మనలను బుజ్జ కొడుతూయున్నారు. నిజముగా ఇప్పుడు జరుగుతూయున్న పని యిదే. ముఖ్యముగా మనసోదరులైన దత్తమండలమువారికి కావలసిన తుంగభద్రప్రాజెక్టు, తూర్పుగోదావరి జిల్లాలో తొర్రిగెడ్డప్రాజెక్టు, పశ్చిమగోదావరిజిల్లాలో యఱ్ఱకాలువప్రాజెక్టు, అనంతపురంజిల్లాలో పెన్నారు కుముద్వతీప్రాజెక్టు వదలివేసి- మన విశ్వవిద్యాలయమును, మన ఆంధ్రా మెడికల్ కాలేజిని వృద్ధిచేసుకోవడం మాని మనము కష్టపడియిచ్చేవి 9 కోట్ల రూప్యములు. ఇట్లు ఎన్నిసంవత్సరాలు వారికి యిస్తూయుంటాము?

—దినవహి హనుమంతరావు.

* * *

ఆంధ్రసంస్కృతి

ఆంధ్రులకును ప్రత్యేకసంస్కృతికలదు. ఆంధ్రులనుండి వారిభాష, భాషలోని నుడికారము, వారి భావములు, వారిశిల్పకళ, వారి జానపదుల పదములు (Folksongs), కథలు (Folklore), విశ్వాసనములు (Beliefs), వారిచరిత్ర, వారి సాంఘికాచారములు తీసివేసిన రేపేవారు అడవిజాతులలో కలసి పోగలరు. విజయనగర సామ్రాట్టులును, మధురా తంజాపురీ నాయకరాజులును హిందూ మహమ్మదీయ శిల్పసమ్మేళనము గావించి ప్రత్యేకశిల్పమును స్థాపించిరి.

ఆంధ్రులు తమభాషను క్రమక్రమముగా సంస్కరించి ద్రావ్యతను సమకూర్చి దక్షిణాపథమున కంతటికిని తర్వాత కాలములో "కర్ణాటకసంగీతము" అనుపేరుతో ప్రసిద్ధిగాంచిన సంగీతకళను ప్రసాదించిరి.

మళయాళములో కథాకళి యనుపేరను, గుజరాతులో గర్బనృత్యమనుపేరను, ఉత్తర హిందూస్థానములో రామలీల యనుపేరను ఈవిధముగా భారతభూమిలో నానాప్రాంతములందు నానావిధములగు దేశీయనృత్యములు కలవు. ఆంధ్రులలో కూచిపూడి భాగవతులు మున్నగువారు అనుశ్రుతముగా కాపాడుచు వచ్చిన నాట్యకళను ఈమధ్య పాశ్చాత్యులు మెచ్చుకొనినారు.

హిందువులందరికిని పండుగలు పబ్బములు ఒకటేయైనను భిన్నప్రాంతాలలో భిన్నపద్ధతులు కొన్ని కలవు. ఔత్తరాహులకు హోలీ, వసంతపంచమీలు

ప్రత్యేక ప్రాముఖ్యత కలిగినట్టివి. అదేవిధముగా తమిళులకు పొంగల్ పండుగ. అట్లే ఆంధ్రులకు ఉగాది, ఏరువాక పున్నమ వంటివి ప్రత్యేకోత్సవములు.

ప్రతిజాతికిని కొన్ని ప్రత్యేక క్రీడలు వినోదములు కలవు. ఆంధ్రులకును కొన్ని జాతీయ క్రీడలు, వినోదములు ప్రాచీనమునుండి వచ్చినవి.

చిర్రగోనె లేక బిళ్ళంగోడు అను పేరుగల ఆట కేవలమాంధ్రులదే. మరియు ఉప్పనపట్టె అనునదియు నట్టిదే!

"ఉప్పలు దెత్తురే సమరయోగ్య
తలంబున వైరికోటిలో
ఉప్పనఁ బట్టె లాడునెడ నుప్పలు
దెత్తురుగాక యాదవుల్."

అని నాచనసోముడు ఉదాహరించినాడు. మరియు "పాచికల" ఆటయు ఆంధ్రులదే. ఆయాటలోని సాంకేతికపదములు (Terminology) అన్నియు అచ్చతెనుగులే. నాచనసోముడు రుక్మిణీకృష్ణులతో ఈ తెనుగువారి యాటను ఆడించినాడు:

"అత్తివంచ త్తిగదుగ
సత్తాదచౌకవంచి చౌవంచీరై
దిత్తిగ యిద్దుగ బద్రలు
చిత్తంబున దలచినట్లు చేతికి తెచ్చున్"

అని తన ఉత్తరహరివంశమున రుక్మిణీ చాకచక్యమును వర్ణించియున్నాడు. పులిజూదముకూడ తెలుగువారిదే! కోళ్ళపందెములు మన ఆంధ్రవాఙ్మయములో పలుతావుల వర్ణింపబడినవి. మరియు దొమ్మరి ఆటలు మున్నగు జాతీయవినోదముల వివరాలు క్రీడాభిరామములో గాననగును.

ప్రతిజాతికిని ప్రత్యేకచరిత్ర యుండుటయే కాక ఆజాతిలోని వీరుల సుద్దులు గానయుక్తముగా సంకీర్తనము చేయబడుచుండును. మహారాష్ట్రులలో "పోవాడాలు" కలవు. మరియు రాజస్థానములోను నిట్టివే బహుళముగా నేటికిని కలవు. వారికథలనే యాధారముగా జేసికొని "టాడ్" గారు రాజస్థానకథావళిని రచించిరి. అదేవిధముగా తెనుగువారికిని ప్రత్యేక స్థానికచరిత్రలును, ఆ చరిత్రలను గానము చేయు జాతులును కలవు. ఈ స్థానిక చరిత్రలను సుద్దులనియు, తందానకథలనియు, జంగం కథలనియు, నందురు. వీటిని చెప్పువారు పిచ్చుకుంట్లవారు, జంగాలు మున్నగువారు. ఇట్లు చూపించ మొదలుపెట్టిన విషయము సాగిపోవుచుండును. ప్రకృతమింతమాత్రము చాలుననుకొందును.

—గోలకొండపత్రిక.

* * *

బొప్పాయిపండు నారింజతో సమమైంది

మనవైపున ఎక్కడో ఎవరోకాని బొప్పాయి పండు తినడం సామాన్యంగా అలవాటులేదు. చాలా పల్లెటూళ్ళల్లో ఈ చెట్టు ఏమీ పోషణలేకుండా ఎదుగుతున్నప్పటికీ దానికేసి చూచేవారుండరు. బొప్పాయిపండు పనికిరాదని చాలామంది అభిప్రాయం. పనికివచ్చినా, పథ్యాహారం అవసరమైన ఏరోగులకో గాని, అందరికీ హితవైనది కాదని తలుస్తారు. ఈ పండుయొక్క పోషకగుణాన్ని గురించి ఈమధ్య మిల్లర్, రాబిన్సు అను ఇద్దరు శాస్త్రజ్ఞులు పరిశోధనచేసి నారంజపండ్లకేవిధంగానూ తీసిపోవని బయోకెమికల్ జర్నల్‌లో వ్రాశారు. హవాయిదీవులలోని పండ్లను పరీక్షించి వాటిలోనిలోహం, కాల్సియం, ఫాస్ఫరం, విటమిన్‌సి మొదలైనవాటిని లెక్కకట్టారు. శరీరంలో ఆమ్లం తగ్గించడంలోనూ, కాల్సియం, విటమిన్ సి విషయంలోనూ నారింజవంటిదే ఈజాతి పండూను. కాయ పండినకొద్దీ విటమిను సి ఎక్కువవుతుంది. తినేపదార్థం ప్రతి నూరు గ్రాములో మా 2500 అంతర్జాతీయ ఏకాంకములు విటమిన్ ఎ- 8 ఏకాంకాలు విటమిన్ బి- 70 మిల్లిగ్రాములు ఎస్కార్బిక్ ఆమ్లము- 33 షార్కీన్ షెర్మన్ ఏకాంకములు విటమిన్ బి-2 ఉంటాయని లెక్కతేల్చారు పరిశోధకులు. బొప్పాయే మంచి ఆరోగ్యవంతమైన పండన్నప్పుడు, అదంటే హితవులేక, సందేహించేవారికి, పైఅంకెలవల్ల కొంత నమ్మకం కుదురుతుంది.

ఎక్కువపడితే అక్కడ తేలికగా ఎదిగే మంచికాపు కాసే ఈచెట్లను, పల్లెటూళ్ళలో విరివిగా పెంచి, ఆపండ్లు తినేఅలవాటు ఎక్కువచేయడం అవసరం. పండులో రుచించని గుణం ఏదైనా ఉంటే అది లేకుండా ఉండే జాతి సృష్టించడం కష్టంకాదు, శాస్త్రజ్ఞులు తలుచుకొంటే.

—విజ్ఞానం.

* * *

స్త్రీలు జనరల్‌గా పూఁబోడులే, అబలలే

స్త్రీలను పురుషులు అబలలని వాడడం దురుద్దేశం కాదనిన్నీ యుద్ధాదులకుగాని యేదేనా బరువు మోయడానికిఁగాని స్త్రీలు పురుషులవంటి బలం కలవారు కారనే తాత్పర్యం. వొకసత్యభామ యెప్పుడో నరకాసురుఁడిమీఁద నాలుగో మూఁడో బాణాలు వేసిందే అనుకుందాం, అంతమాత్రంచేసి స్త్రీలంతా పురుషులతోపాటు ఘూటాపాటీ యుద్ధాలలో పరాక్రమం చూపిస్తారనుకోవలసిందేనా? అదిన్నీ కాక ఆయుద్ధసందర్భం యేలాటిది! శ్రీకృష్ణుఁ డంటే? లోకాతీతుఁడాయె. ఆయన చాటునవుండి సత్యభామే అక్కఱలేదు- మఱి యెవర్తేనాసరే ఆ మాత్రం పని చేయఁగలదు. ప్రతీఆఁడదానికిన్నీ ఆలాటి లోకైకవీరుఁడు మగఁ డెక్కడ దొరుకుతాఁడు. ఆలాటివీరుణ్ణి పెళ్లాడిన ఆఁడది యెక్కడేనా వుంటే ఆవిడను వదిలిపెడదాము. ఆలాటివాఁ డెక్కడా లేఁడనే కారణంచేతే కాదూ ? సుభద్ర-- నీవంటిభర్త కావాలనికోరితే శ్రీకృష్ణుఁడు—నా వంటివాణ్ణి నేనే తప్ప యితరులు లేరు. కనక యీ అవతారంలో నీకోర్కె తీర్చేయెడల బొత్తిగా లోకదూష్యంగా వుంటుందనిచెప్పి అవతారాంతరమందు నీకోర్కె సఫల మవుతుందని చెప్పినట్టున్నూ— 'సుభద్రాప్రాణనాథాయ జగన్నాథాయ్య మంగళమ్' అనే జగన్నాథస్వామి ఆకృష్ణుఁడే అయి ఆమె కోర్కెను తీర్చినట్టున్నూ ఐతిహ్యంవల్ల తెలుస్తూవుంది, కనుక అందఱూ సత్యభామలు కారు. 'నఖలు సర్వోఽపి వత్సరాజః.' యిఁక తాటక వొకర్తె వుంది. దానిమొగం తగలఁబెట్టేరి. ఆపాపిష్ఠి ముండని ఆదర్శంగా పెట్టుకొని సంచరిద్దామనే స్త్రీ అంటూవుంటుందా? వుంటే అప్పుడు చూచుకుందాం. యిప్పుడు దాన్నిగూర్చి వ్రాయనక్కఱలేదు. 'పూబోడి' అన్నందుకే, 'అబల' అన్నందుకే పురుషులను కొంత నెపపెట్టే సోదరీమణులు ఆతాటకతో పోలికి చెప్పి 'రాతిబోడి' వగయిరాపదాలతో వ్యవహరించడానికి సహిస్తారని నేనే కాదు యిప్పటి నవనాగరికశిఖామణులున్నూ అంగీకరించరు. 'స్త్రీలు జనరల్ గా పూఁబోడులే, అబలలే'—యెక్కడేనా నూటనాట రాబోడులూ, సబలలూ వుంటే వుంటారు. అది గణనీయంకాదు. పురుషులలోకూడా అక్కడక్కడ పూబోడులు, అబలలు వుంటారు. వున్నావారు స్త్రీలు వహించవలసిన గర్భధారణాదులకు అర్హులుగా వుంటారనుకోవడం బాగుంటుందా? అదేలాటిదో యిదీ ఆలాటిదే. —గృహలక్ష్మి.

—చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి.

* * *

సోవియట్ రష్యాలో వ్యవసాయపరిశ్రమ

సోవియట్ రష్యాలో వ్యవసాయము ఆదేశమందుండు పరిశ్రమలన్నిటియందును అగ్రస్థానము వహించుచున్నది. 1917 సం॥రం నవంబరు 7 తేదీని రష్యాయందు గొప్ప విప్లవముజరిగెను. ఈవిప్లవ ప్రతిఫలములే రష్యాలో నేటి ప్రభుత్వసౌధములకు పునాదులైనవి. అప్పటినుండి రష్యా కార్మిక కర్షకుల జీవితములు క్రొత్త థృక్పథముల ద్రొక్కెను. కులీనవు వర్గమువారినుండి భూములను ప్రభుత్వము వశముజేసుకొనెను. వారికి శాసనసభలయందుండు అసాధారణ హక్కులకు స్వస్తిజెప్పిరి. పెత్తనదారుగా, భూస్వాములుగా నున్న 'కులాక్సు' (Kulaks) అనబడు కొమందులవద్దనుండి కూడా భూములను స్వాధీనముచేసుకొనిరి. పెద్దపెద్ద జమీందారీలన్నియు భాగములుగా భాగించి సేద్యగాండ్రకు పంచిపెట్టిరి.జమిం

దారీలను విభజించినతోడనే ఆసరికే 17 మిలియనుల సంఖ్యగల కర్షకులు 25 మిలియన్ల లెక్కకువచ్చిరి. చాలామంది స్త్రీలు వ్యవసాయవృత్తి నవలంబించిరి. 8 మిలియన్ల ఎకరముల బీడుగా పడియున్న భూమిని సాగుచేసిరి. వాటియందు క్రొత్త కట్టడములను లేవనెత్తిరి. తోటలు వేసిరి. కాని ఈ ప్రభుత్వం తిరిగి 1921 సం॥రం సరికి భగ్నమగు సూచనలు కనబడెను. పంటలు పూర్తిగాపోయి కరువు ప్రారంభమాయెను. పంటలు పోవుటచే సోవియటు గవర్నమెంటువారు రైతులచే పండింపబడిన ఆకొద్ది తినుపదార్థములను కూడా స్వాధీనముచేసుకొనిరి. ప్రజలకు మారకపు హక్కుల నివ్వ నిషేధించిరి. దేశమందు డబ్బు చెలామణి ఆగిపోయెను. వస్తువులకు గిరాకిలేకపోయెను. ప్రభుత్వవిధానము పునాదులతో కూలిపోవునని చాలామంది రాజకీయవేత్తలు అభిప్రాయపడిరి. కాని ప్రజలయందు నాటుకొనియున్న దృఢనమ్మకములచే తిరిగి సామ్యవాదప్రభుత్వమునకే తావేర్పడెను. గవర్నమెంటువారు క్రొత్త ఆర్థికవిధానమును ప్రవేశపెట్టిరి. అప్పటినుండి రష్యాయందు వ్యవసాయోద్యమమునకు నూతనశక మేర్పడెను. ఈవిధానము క్రింద సాగుబడి భూములు రెండింతలాయెను. సకాలమందు పంటలు సమృద్ధిగా పండజొచ్చెను. వ్యవసాయమందు సులభమగు పరికరములు ఉపయోగించుట, పశుసంతతి వృద్ధిచేయుట, బలమగు ఎరువు వేయుట మొదలగు విషయములందు ప్రభుత్వమువారు శ్రద్ధవహించిరి. దేశమందు విరివిగా వ్యవసాయకళాశాలలు, బడులు, కర్మాగారములు పెట్టించిరి. ప్రజలకుత్సాహముగలుగునట్లు వ్యవసాయపరిశోధన ప్రదర్శనములను ఏర్పాటుచేయుచుండిరి. క్రొత్తగా ప్రభుత్వ సమిష్టిభూములు ఏర్పరచిరి. వ్యవసాయదారులను సరియగు పౌరులుగా తయారుచేయుటకు వారిని బడులయందు, పుస్తకభాండాగారములయందు, క్లబ్బులయందు, రేడియో (Radio) మూలమున తరిఫీదుచేసిరి. ఇన్ని సౌకర్యములు గలుగజేసినప్పటికిని కొందరు భూస్వాములు, రైతులు తమ భూములను ప్రభుత్వపరము చేయ నిరాకరించిరి. అందుచే ప్రభుత్వమువారు అతికఠినముగా ప్రవర్తింపవలసి వచ్చెను. వాటిపై భారమగు పన్నులువేసిరి. పంటలు మార్కెట్టులయందు విక్రయించకూడదని నిషేధించిరి. సరియగు ఎరువులు యివ్వ నిరాకరించిరి. వాటియందు పనులు చేయుటకు కూలివాండ్రకు అనుమతియివ్వలేదు. ప్రభుత్వమువారి హస్తగతమైన శాఖలన్నిటిమూలమున ప్రబోధము, ప్రచారముచేసిరి. నాటకరంగములయందు, కళాశాలయందు, సినిమాహాలులందు 'ప్రభుత్వముతో ఏకీభవించిన ఎక్కువలాభము కర్షకులకు గలుగు' యని బోధించిరి. జనాకర్షణీయమగు అనేకప్రదర్శనములుచేసిరి. ఈప్రబోధము మూలమున ప్రభుత్వముతో నేకీభవించని రైతులుకూడా ఆఖరునకు లొంగిపోవలసివచ్చెను. మాస్కోనగరమందు కేంద్ర వ్యవసాయ ప్రదర్శనశాల నొకదానిని నియమించిరి. అచ్చోట నానావిధములగు పనిముట్లు, వడ్లు, ఎరువులు ఉంచబడి యుండును. గోడలయందు వ్యవసాయపు పటములు వ్రేలాడ తీయబడియుండును. కర్షకవిద్య బోధింపబడుచుండును. పంచవార్షికప్రణాళిక యని 1928-33 వరకు అమలుపెట్టిరి. ఈప్రణాళిక ననుసరించుటచే లాభములు ద్విగుణీకృతము లాయెను.

—లక్ష్మీనారాయణ పాణిగ్రాహి.

రంగాజీ—క్షేత్రయ—విజయరాఘవుడు

రచయిత:

మల్లాది రామకృష్ణశాస్త్రి, ఎం. ఏ.

రసికశిఖామణి, మహారాజు విజయరాఘవరాయలు, సాయంసమయాన 'వసంతవిలాసం'లో విహరించడానికి వెళుతున్నాడు:

చక్కని పారశీక హయాన్ని అధిరోహించి, ఈడు జోడుగడున్న చెలికాండ్రు వెంటనంటిరాగా, చతురంగబలాన్ని సమకూర్చుకుని జైత్రయాత్రకు బయలుదేరిన మన్మథునివలె, తంజనగర రాజవీధిని, పరివార సమేతుడై సాగిపోతున్నాడు.

సౌధోపరిభాగాలనుంచి పౌరకాంతలు ముత్యాలసేసలు చల్లుతున్నారు. 'శుద్ధాంత ముగ్ధాంగనలు' సోరణగండ్లగుండా ఆమహా రాజకుమారుని విలాసాన్ని, వైభవాన్ని కరువుదీరా కని, మనసు మరల్పలేక పరవశలవుతున్నారు. సామంతుల భవనాలన్నీ గడచి చాలాదూరముపోయి, శ్రీదేవి హర్మ్యాన్ని సమీపించేటప్పటికి, నెమ్మదిగా వాజిని పోనిస్తూన్నాడు విజయరాఘవుడు. శ్రీదేవి, రఘునాథరాయలకు ప్రాణసమాన అయిన ప్రియురాలు. మహారాజకుమారునియందామెకు పుత్రవాత్సల్యము.

అనుదినమూ మామూలుగా ఆతడు, ఆ త్రోవను వెళ్ళేవేళకు, శ్రీదేవి చిరునగవుతో, మమకారముట్టిపడేట్టుగా, పల్కరించి, ఆశీర్వదించేది. ఆమాతృమూర్తి దీవన లందుకుని అమితోత్సాహముతో విజయరాయలు తరలి పోయేవాడు.

అక్కడనే ఆగి, తలఎత్తి పైకిచూశాడు. ఎందుచేతనో ఆమె ఆనాడు కానరాలేదు. శ్రీదేవి దర్శనంకోసం నిరీక్షిస్తూ ఎత్తినతల వంచకుండా అలాగే చూస్తూన్నాడు. కొంత సేపటికి, ఒకచక్కని చుక్క, ఒక 'అతిలోక మోహిని' తళుక్కని మెరసి అంతలో మాయమైంది. ఒకనల్లకలువ, ఒక వికచారవిందమూ, ఆతనిపాదసమీపాన వ్రాలినాయి.

మహారాజు మైమరచి పోయినాడు. చాల తడవు చిత్తరువులాగా ఉండిపోయినాడు. తెలివితెచ్చుకుని నేలకుదిగి, ఆసుందరి యిచ్చిన కానుక నందుకొని, ముందుకు సాగి పోయినాడు. మనస్సంతా ఆమెమీదనే ఉంది. విరహవేదనతో నవసిపోతున్నాడు. శైత్యోపచారాలన్నీ వృథా అయిపోతున్నవి.

ఆనవలావణ్యవతి శ్రీదేవికి చెల్లెలి కుంతురు. సర్వకళానిపుణ రంగాజీ.

...ఆమె ఎవరో తెలుసుకున్నాడు. కాని తనకుతానై ఆమెను సమీపించడానికి మనసొప్పలేదు. తనజనకుడి ప్రియురాలు శ్రీదేవి యింటికి తాను మరొకరికోసమైనా విటుడిలాగా వెళ్ళడానికి సిగ్గుపడ్డాడు.

కాని హితులూ, పరిజనులు చేయలేనిపని మన్మథుడు చక్కగా ఒనగూర్చాడు. రంగాజీ కూడా, మహారాజుని చూసినప్పటినుంచి, అతని చెలిమికోసం అలాగే తపిస్తూన్నది. చివరకు ఆమహారాజు ఎంతకూ దయదలచి తన్ను అనుగ్రహించడానికి రాకుండటంచూసి ఒక వెన్నెలరేయిని, దూతిచేత కబురంపింది.

ఆవేళకు విజయరాఘవులు ఉద్యానవనంలో ఆరేయెండలో రంగాజీని తలచుకుని, చాలాతపిస్తూన్నాడు— కేతకీదళముమీద కనుకొలకుల కాటుకతో ... ముత్తెములతీరున

తీర్చిన వ్రాతలో, ఆమె సందేశాన్ని అందుకున్నాడు. తనకు తానై కాకుండా, మరియొకరి పేర, ఆమె పిలిచిన సరసతకు చాలా సంతసించాడు. 'మావెలది నేలుకొన రావలదె నీవు దయతో విజయరాఘవమహీవర' అని చదివి పరవశుడై ఇక అక్కడ నిలువక ఆదూతిని ఒక అనర్ఘమణిహారముతో సత్కరించి ఆమె వెంటనంటి తనప్రేయసి ఉన్న తావు జేరుకున్నాడు.

ఆవసంతసమయాన వెన్నెలరేయిని తన తోటి కులమువాడని అయినా కనికరించకుండా 'వలరాచరాచవాడు' విజయరాఘవరాయలను రంగాజీ ప్రణయదాసునిగా చేసివేశాడు.

ఆకాలంలో, చక్కదనానికీ; సరసత్వానికీ రతిని, భారతిని మించిన పిల్లలున్న ఆరోజుల్లోనే ఎందునా రంగాజీని పోలినవారు ఎవరూ లేరు. విజయరాఘవుడు ఆమె గొప్పతనాన్ని తన సరసతకూ ఆమె చక్కదనానికీ తగినట్లుగా మన్నించాడు. మహారాణులందరూ ఆమెకనుసన్నల మెలగుతుండేవారు. అంతఃపురానికంతా, రంగాజీయే నాయకురాలు. క్రమంగా మహారాజు ఆమె తోడిదే లోకంగా ఒకక్షణమైనా ఆమెను ఎడబాయకుండా రాచకార్యములన్నీ సమర్థులయిన అమాత్యులమీదవదలి, ఆమె విలాసభవనాన్ని వదలిపోకుండా అక్కడనే కాలము గడపేవాడు.

మహాకవులు ఆమెను తమ మధురకవితా ధోరణుల మెప్పించి, ధన్యులై, పిదప మహారాజు మన్ననలందేవారు. మహావిద్వాంసులు శాస్త్రప్రసంగాల్లో రంగాజీచే భళీ అనిపించుకుని, దిగ్విజయసిద్ధి అయినట్లు సంతసించేవారు. పౌరులు దేవేరులందరిలోకీ ఆమెను మిన్నగా భావించి గౌరవించేవారు: ఇక మహారాజుకో, ఆమె కేవలమూ ఆరవప్రాణము.

ఏమీ అనలేకపోయినా, సపత్నులందరికీ రంగాజీని చూడ చాలా అసూయగా ఉండేది. ఒకనాడు ఆమె చక్కగా అలంకరించుకుని ఉద్యానవనములోనికి వెళుతూండగా విజయరాఘవునిపట్టపుదేవి ఎదురైనది. రంగాజీ పలుకరించినా, బదులుపలుకక, పెడమోమై నడచిపోయింది. వెనుకనుంచి 'మాయలాడి' అని, ఇంకా ఏమో కొన్నిపలుకులు అస్పష్టముగా రంగాజీకి వినపడినవి. ఆమె చిరునగవుతో ఊరుకున్నది.

ఆవేళ కైనది. మరునాడు మరల తారసిల్లినారు వారిరువురూ. రంగాజీ ఆమెను చూడగానే ప్రక్కనున్న చెలికత్తెతో చెప్పినట్లుగా 'ఏవనితల్ మముందలప నేమిపనో' అన్న పద్యము చదివింది. ఇక అంతటితో ఊరకుండక మహారాణి అరసికతను ఈసడిస్తూ 'రాజనిభాననా సరసురాలవు..:' అనికూడా పఠించింది. ఇంకా గికురింపతలచి 'ఇంతీ...కంతుడనంగుడు నీ తెలివింతేనా విజయరాఘవేంద్రుడే...' అని నవ్వుకుంటూ వెళ్ళిపోయింది. మహారాణి మారుపలుకలేక ఖిన్నఅయి ఊరుకున్నది. మహారాజుకు ఈసంగతి తెలిసి, రంగాజీని మరీ ఆదరించినాడు.

రంగాజీ, విజయరాఘవుని వలచి, వలపించి అన్నివిధాల ఆతని మనసుకు వచ్చునటుల నడచి ధన్యురాలైంది. ఆమహారాజు ఆమెకు పండితసదస్సులో కనకాభిషేకము చేసి, అర్ధరాజ్యము ఒసగి సన్మానించినాడు.

రంగాజీ మన్నారుదాసవిలాసమని తన నాయకుడు విజయరాఘవుని పేరున అద్భుత కల్పనాయుతమునూ, మంజులరచనాశోభితమునూ అయిన యక్షగానాన్ని రచించింది. ఆతనిపేరునకూ, తనపాండిత్యానికీ చిరస్థా

తిష్ఠ వేసుకున్నది.

—ఒక సమయంలో వాగ్గేయకారవతంసుడు క్షేత్రయ్య దక్షిణదేశయాత్ర వెడలి, తీర్థాలు సేవించుకుంటూ తంజావూరు వచ్చాడు. మహారాజు అతన్ని చాలా గౌరవించి తనవద్ద కొంత కాలం ఉండమని బ్రతిమాలి నిలుపుకున్నాడు. అక్కడ ఉండగానే, విజయరాఘవరాయల మీద, ఒకటిరెండు చక్కని పదాలుకూడా చెప్పాడు. కాని రంగాజీమాత్రం అతడు ఎంత విరాగి అయినా భక్తుడయినా శృంగారరచనల్లో తనకుమీరిన చేయి అని కొంచెం అసూయతో సరీగా గౌరవించలేదు. క్షేత్రయ్య అదికనిపెట్టి ఆమెను కొంచెము కవ్వించదలచి,

ఇటువంటివాడు రావేలే, ఈలాగైతే ఏటి వేడుకలనే। విటరాయడచ్యుతవిజయరాఘవుడింతో వెరచునమ్మా దానికి॥

అని మొదలిడి ఓపదము రచించాడు. అంతటితో రంగాజీ మరీ అసూయావేశంతో నిర్లక్ష్యముగా చూడ మొదలుపెట్టింది, ఏమీ చేయలేక. అతడు ఏమీ అనక ఊరుకుని మహారాజానతి మేరకు అక్కడనే ఉన్నాడు. చివరకు, మిగిలిన తీర్థములు సేవించడానికి బయలుదేరబోతూ విజయరాఘవుని సందర్శించాలని ఉదయానే అంతఃపురములోకివచ్చినాడు. మహారాజు అప్పటి కింకా మేల్కొంచలేదు. కాని, రంగాజీమాత్రం, విలాసమందిరముమించి చెలికత్తెలు వెంటరాగా నిదురమబ్బుతో, బయలువెడలివస్తూ అతనికి కనపడినది. క్షేత్రయ్య వెంటనే

'వనిత తనకేళికామందిరము వెడలెన్...'

అని ఆలాపించాడు. రంగాజీ, సిగ్గుపడి వెళ్ళిపోయింది. తరువాత క్షేత్రయ్య అక్కడ నుంచి సాగిపోయినాడు.

ఒకనాడు ఏకాంతంగా ఉన్నప్పుడు రంగాజీ విజయరాఘవునితో కథఅంతా చెప్పింది. మహారాజు, ఆపల్లవి విని చాలాసంతోషించి మిగతా భాగమంతా సరసంగా పూర్తి చేయగలవారిని ఎక్కువగా బహూకరిస్తానని తన గోష్ఠిలో ప్రచురించాడు. ఎవరిచేతనూ కాలేదు. రంగాజీకికూడా తోచలేదు.

ఆరునెలల తరువాత, విజయరాఘవులు కంచి వరదరాజును సేవించ పోయిఉండగా తీర్థాటనము ముగించి మరలి వస్తూ క్షేత్రయ్య అక్కడ మహారాజును మరలా దర్శించాడు. అప్పుడు అచ్చట విజయరాయని కోరికమీద ఆపదము—ఆరునెలలక్రింద పల్లవివేసిన పదమందుకుని,

'వగకాడ మాకంచి వరదా తెలవారవచ్చు.'

అని అనుపల్లవితో రంగాజీ ఆనాటి విలాసవిభ్రమము అంతా సరసంగా మరి మూడు చరణాల్లో కూర్చి వినిపించాడు. రంగాజీ చాలా సంతోషించి అతనికి నమస్కరించి మన్నించమని బ్రతిమాలినది. మహారాజు అతనికి కోరినవన్నీ యిచ్చి సబహుమానముగా పంపివేశాడు.

రంగాజీకి నాటకాభినయమునందు చాలా అభిమానము. విజయరాఘవుని ఎదుట ఆమె అభినయించేది. విజయరాఘవుడు ఆమె సరసను నాయకవేషధారణ మెచ్చేవాడు. అవరోధజనమూ, మరీ ఆప్తులూ మాత్రమే ఆ అవకాశాలచూసి ఆనందించేవారు.

మహారాజు విజయరాఘవుడు ధన్యుడు.

[రంగాజీపద్యాలు. చాటుపద్యమణిమంజరిలో ఉన్నాయి. మన్నారుదాసవిలాసం: ఆంధ్రసాహిత్య పరిషత్తువారు దొరికినంతవరకూ ప్రకటించారు.

క్షేత్రయ్య: విజయరాఘవునిమీద చెప్పిన పదాలు వావిళ్ళవారిప్రతిలో అన్నీ లేవు. పాతపుస్తకాల్లో దొరుకుతాయి. చక్కని పాఠాలు కావాలంటే శరభోజీభాండారంలో ఉన్నవి.]

రథసప్తమి ఒకప్పుడు మన సంవత్సరాదిపండుగా?

రథసప్తమినాటి కార్యకలాపం

ప్రతి సంవత్సరం మాఘశుక్ల సప్తమి మనకు రథసప్తమీపర్వం. ఆనాడు మనం ఉదయాన్నే లేచి జిల్లేడుఆకుల్లో రేగిపళ్లుపెట్టి అవి నెత్తిమీద పెట్టుకుని స్నానంచేస్తాము. పొద్దుఎక్కినతరవాత పాలు పొంగిస్తాము. చిక్కుడుకాయల్ని రెంటిని వెదురుపుల్లతో చతురం అయేటట్లుగా గుచ్చి దానిమీద చిక్కుడుఆకు పరిచి ఆ చిక్కుడు ఆకుల్లో పొంగలి పెట్టి సూర్యుడికి నివేదనచేసి నమస్కరిస్తాము.

సూర్యారాధనకోసం పుట్టింది

ఈకార్యకలాపాన్ని బట్టి చూస్తే ఇది సూర్యారాధనకోసం పుట్టిన పండుగఅని నిశ్చయమౌతూవుంది. మత్స్యపురాణమున్నూ, భవిష్యపురాణమున్నూ రథసప్తమీదినం యొక్క పవిత్రతనుగురించీ, మాహాత్మ్యన్నిగురించీ విశేషంగా వర్ణిస్తున్నాయి.

జిల్లేడుఆకులు, రేగుపళ్లు, చిక్కుడుకాయలు

రథసప్తమి సూర్యునిగూర్చిన పండుగకాబట్టే ఆనాడు జిల్లేడు ఆకులికి ప్రాధాన్యంవచ్చిందని అనుకోవలసివుంది. జిల్లేడుకు సంస్కృతంలో సూర్యాహ్వాయ, అర్క, రవి అనే పేర్లున్నవి. ఇక రేగిపళ్లు నెత్తిమీద పెట్టుకోడంలోకూడా ఏదో అర్థంవుండివుండాలి. శిశిరఋతువైన మాఘఫాల్గుణాల రోజుల్లో రేగుపళ్లు విస్తారం దొరుకుతాయి. 'ఫలశ్శైశిరః' అని రేగుకు సంస్కృతనామాల్లో ఒకటి. రథసప్తమికి ఒకనెల పూర్వంవచ్చే సంక్రాంతిభోగిపండుగనాడు చిన్నపిల్లలకు రేగిపళ్లు తలమీదనుంచి దిగబారేటట్లు పోస్తారు. అట్లాపోయడంవల్ల ఆపిల్లలకు వుంటే పీడ వదలిపోతుందని మనవారినమ్మకం. ఆనాడు ఒక్క పిల్లలకే జరిగేవిషయం రేగిపళ్ళమూలకంగా రథసప్తమినాడు అందరికీ జరుగుతుందని అనుకోవలసివుంటుంది. ఇక రథసప్తమినాడు పూజలో వాటే వానిలో చిక్కుడుకాయలు, చిక్కుడు ఆకులు మిగిలాయి. చిక్కుడుపాదు కార్తికమాసంనాటికి కదురంత మొక్కవుంటే మాఘమాసంనాటికి నామహిమ చూపుతానని అంటుందని అనుభవజ్ఞులు అంటారు. ప్రకృతిని ఆరాధించే మనపెద్దలు మాఘమాసంలో బాగా పూచికాచే చిక్కుడునుకూడా మాఘమాసపు పర్వాలలో పేర్కొనదగిన రథసప్తమినాటి ఆరాధనద్రవ్యాలలో చేర్చివుంటారు. రథసప్తమి సూర్యుని రథానికి సంబంధించిన పర్వంకాబట్టి చిక్కుడుకాయలతో, వెదురుపుల్లలతో ఆనాడు రథాన్ని చేసి దానిమీద చిక్కుడుఆకు పరచి నైవేద్యానికి వుపయోగిస్తారని ఊహించవలసివుంది.

రథసప్తమి: రాజపుత్రుల సంవత్సరాది

రథసప్తమి సూర్యుని పండుగమాత్రమే కాదు. అది ఒకప్పుడు హిందూదేశంలో యుగాదిపండుగ అయివుంటేది. ఇప్పుడు అన్నిప్రాంతాలలోనూ ఈ ఆచారం మారిపోయింది. కాని రాజపుత్రుల సంవత్సరాది ఇప్పటికికూడా రథసప్తమికి రెండురోజుల ముందుగా ప్రారంభమౌతూవుంది.

రథసప్తమి ఒకప్పుడు తెలుగువారి ఉగాది

తెలుగుదేశంలో కూడా రథసప్తమి ఒకప్పుడు యుగాదిపండుగ అయివుంటేదనడానికి ఆనాడు ప్రారంభమయ్యే అనేకవ్రతాలు నిదర్శనమిస్తున్నాయి. నిత్యశృంగారము, నిత్య అన్నదానము, ఫలతాంబూలము, దంపతితాంబూలము, పుష్పతాంబూలము, పొడపువ్వులవ్రతము, చద్దికూటి మంగళవారాలు, ఆదివారాలు, శుక్రవారాలు, మాఘగౌరి, కాటుకగౌరి, గండాలగౌరి, వుదయకుంకుమ, చిట్టిబొట్టు, సౌభాగ్యతదియ, కందవ్రతం, చిత్రగుప్తునివ్రతము మొదలైన నోములన్నీ రథసప్తమినాడే పడతారు. వ్రతప్రారంభాలు సాధారణంగా యుగాదినాడే జర

గడం ఆచారంకదా! పైన పేర్కొన్నవన్నీ స్త్రీల వ్రతాలే. ఈవ్రతాలలో చాలావాటికి ఏవిధమైన మంత్రాలూ లేవు. మామూలుభాషలో కథ చెప్పుకోవడంతో కార్యకలాపం ముగుస్తుంది. ఆర్యులయు, వారి భాషఅయిన సంస్కృతంయొక్కయూ పలుకుబడి కలగని అనాదికాలంలో తెలుగువారిలో ఈ దినము వుగాదిఅయి, అనేక వ్రతాలకు ఆరంభదినమై వుండివుండాలి. అనంతరకాలంలో రథసప్తమి సంవత్సరాదిగా వుండడం మారిపోయిందికాని ఆనాడు ఆనాడుప్రారంభమయ్యే అనేకవ్రతాలు ఇంకా ఈనాటికికూడా ఆనాడే ప్రారంభమౌతూవుండి ఒకప్పుడు రథసప్తమి వుగాది అయివుండే విషయాన్ని బోధిస్తున్నాయి.

సూర్యుడికి దుప్పులరథం, గుర్రాలరథం

మాళవదేశంలోని ఈవ్రతవిధానవివరాలు తెలుసుకోతగినవిగా వుంటాయి. సూర్యుడికి రెండువిధాలైన రథాలు వున్నాయనీ,అందు ఒకదాన్ని,దుప్పులు లాగుతాయనీ, రెండోదాన్ని గుర్రాలు లాగుతాయనీ మాళవదేశస్థుల నమ్మకం. రథసప్తమిరోజున సూర్యుడు దుప్పులులాగే రథాన్నిదిగి గుర్రాలులాగే రథాన్ని ఎక్కుతాడని వారు నమ్ముతారు. ఇప్పటినుంచే అహస్సు ఎక్కువవుతూ రావడం గమనింపతగ్గది. వారినమ్మకం దీన్ని పురస్కరించుకునే పుట్టి వుంటుంది.

పాలుపొంగినదిక్కునుండి ఆపద

మాళవదేశస్త్రీలు రథసప్తమిపూజ అయిన తరువాత చేటలో ఏడురకాల ధాన్యాలు, కొంతపత్తి, బెల్లం వుంచి రాగిడబ్బులు దక్షిణపెట్టి బ్రాహ్మడికి దానంచేస్తారు. మనదేశంలోలాగే అక్కడా పాలు పొంగిస్తారు. కాని అక్కడ పాలుపొంగించడం ఇంటికిబయట. పాత్రలోనుంచి మొదట పాలు ఏదిక్కుగా పొంగిపడితే ఆదిక్కునుంచి ఆయింటివారికి ఆపదవస్తుందని అచ్చటివారి నమ్మకం. కాని మనవాళ్లు పాలు ఏదిక్కున పొంగితే ఆదిక్కునుంచి శుభమనీ, ఎంతబాగా పొంగితే ఆయింటికి ఆసంవత్సరంలో అంత సౌభాగ్యమనీ నమ్ముతారు.

దంపతీపూజ

మధ్యాహ్నం బ్రాహ్మణ్ణి, ఆతని భార్యను భోజనానికి పిలుస్తారు. బెల్లంకలిపిన గోధుమపిండితోచేసిన రొట్టెలు ఆనాటి ప్రధానభోజనపదార్థం. భోజనానంతరం బ్రాహ్మడికి దక్షిణతాంబూలాలున్నూ; అతని భార్యకు రవికలగుడ్డ, నల్లపూసలున్నూ ఇస్తారు. రథసప్తమి పర్వసంబంధమైన కార్యకలాపం అచట అంతటితో ముగుస్తుంది.

రథసప్తమికి సప్తసంఖ్యకు సంబంధం

రథసప్తమికి సప్తసంఖ్యకు ఏదో కొంతసంబంధం వుండివుండాలి. సూర్యునిరథాన్నిలాగే గుర్రాలు ఏడు. ఈపర్వంజరిగేదినం ఏడవతిథి. ధాన్యాలు సాధారణంగా నవసంఖ్యకలవిగా వుండగా రథసప్తమినాటి కార్యకలాపంలో మాళవస్త్రీలు ఏడు ధాన్యాలే వాడుతారు. మనదేశంలో ఆనాడు చేయబడే చిక్కుడుకాయల రథాలున్నూ ఏడే. ఎవరిని పూజించడానికి యీరథసప్తమి, ఉద్దేశింపబడిందో అట్టి సూర్యుడిని స్తుతించే సంస్కృతమంత్రాలలో 'సప్తలోకప్రదీపన' అనే బిరుదు వుండడం గమనింపతగ్గది.

విస్మరింపబడ్డ ఈవ్రతవిధానం

పురాణాలలో చెప్పబడ్డ యీవ్రతవిధానం పరికిస్తే రథసప్తమికి పూర్వదినమందు నువ్వులునూరిన ముద్దతో శరీరంరుద్దుకొని స్నానంచేసి, సూర్యుని గుడికిపోయి ఆరాధనచేసి, బ్రాహ్మణపూజ చేయవలెననీ—సప్తమీదినమున బంగారు లేక వెండితో రథంచేయించి పూజచేసి ఆరాత్రి జాగారం చేయవలెననీ—మఱునాడు ఆరథాన్ని బ్రాహ్మడికి ఇచ్చివేయవలెననీ తేలుతూంది. ఈవిధానం దేశంలో సూర్యాలయాలు విస్తరిల్లిన కాలానిది అయివుంటుంది. క్రమంగా సూర్యాలయాలు తగ్గిపోయినట్లే యీవిధానంకూడా సమసిపోయింది.

గారెల పిండివంట ఘనతను గురించి

(హాస్య వ్యాసము)

రచయిత :

ఏ. శేషాచలపతి, బి. ఏ.

గారెలు! గా - రె - లు : ఈమూడు అక్షరాల సమ్మేళనంవల్ల సూచితమయ్యే పిండి వంటలో ఎంతరుచివిశేషం నిక్షిప్తమైవుంది! మధ్య చిల్లుతోవుండే ఆమాషచక్రాల్లో— ఆ మినపపిండిచక్రాల్లో ఎంతమాధుర్యం, ఎంత కమ్మదనం ఇమిడివుంది! పక్షపాత మనుకోండి, సత్యప్రేరిత మనుకోండి—ఏమనుకోండి అన్ని పిండివంటల్లోకి గారెలు ఘనమైనవని నా తాత్పర్యం. గారెలు ఘనమైనవనడానికి నాకు తోచినవీ, మీరు నమ్మితీరవలసినవీ, సత్యప్రేరితమైనవీ అయిన కారణాలు చూపెడతాను. చిత్తగించండి.

ఏవస్తువుకైనా ఘనత పుట్టినవంశాన్ని బట్టి, విస్తరిల్లిన శాఖలనుబట్టి, మహనీయులిచ్చిన హస్తావలంబనాన్నిబట్టి, పలువురితో ఏర్పడే సంబంధాన్నిబట్టి, సురూపాన్నిబట్టి, ఉపయోగింపబడే వేళావిశేషాన్నిబట్టి, సర్వకాలీనమైన వినియోగాన్నిబట్టి, విశేషమైన ఉపయోగాన్నిబట్టి, ఇంకా ఇతర కారణాల్ని బట్టి ఏర్పడుతుంది. ఇందులో ఒక్కొక్క కారణమే ఏవస్తువుకైనా ఘనతను తేగలిగినవి. గారెలవిషయంలో ఈఅన్ని కారణాలూ కూడా కలిసివచ్చేయి. ఇక దానిఘనత వివరించాలంటే విపులవ్యాసం వ్రాసితీరాలి.

ఘనతను తెచ్చే మొదటి కారణం సద్వంశంలో పుట్టడం. గారెలు మినపవంశంలో పుట్టేయి. మినపవంశం సద్వంశం అనడానికి చరకుడు, వాగ్భటుడు మొదలైన ప్రాచీన వైద్యవేత్తల గ్రంథాలే సాక్షి. వాజీకరణ యోగాల్లో మినపకుడుములు అగ్రస్థానాన్ని వహిస్తాయి. మాంసానికి బదులుగా మాషాన్ని మనపెద్దలు వాడేవారు. అనగా మినుములు మాంసాహారమంత బలకరమైనవన్న మాట. ఆహారానికి బలసంపాదనమే కదా ప్రధానలక్ష్యం! అట్టి మినపకులంలో పుట్టిన గారెల ఘనత కొలదిఇడరానిదిగా వుండడంలో ఆశ్చర్యం ఏముంది ?

కులీనతనుబట్టే కాకుండా విస్తరిల్లిన శాఖలనుబట్టి కూడా గారెలకు ఘనత ఏర్పడుతోంది. గోదావరి సప్తశాఖలుగా విస్తరిల్లి సముద్రంలో కలిసింది కాబట్టే అది గంగకు అప్పగారు అయింది. గారెల్లోనూ, ఒకరకమా, ఒకలోకమా ? అవి పలురీతుల విస్తరిల్లాయి. సాదాగారెలు, తీపిగారెలు, ఆవపు గారెలు, మసాలాగారెలు, నేతిగారెలు, చిట్టిగారెలు, దేముడుగారెలు—ఇట్లా ఎన్నని చెప్పగలం! రెడ్లల్లోనూ, వడ్లల్లోనూ వుండే రకాన్ని ఎట్లా లెక్కించి చెప్పలేమో గారెల్లోవుండే రకాల్నికూడా అట్లానే లెక్కించి చెప్పలేము. పెక్కురకాలుగా వుండడంకూడా

ఘనతే. చూడండి, ఇంక మరియే పిండివంట కేనా ఇన్నిరకాలు వున్నాయా, చెప్పండి! మిగిలిన పిండివంటల కన్నిటికీ ఒకటేరకం, ఒకటేనామం. ఆత్మ ఒకటైనా అనంతకోటి జీవుల్లో ప్రవేశించి అనేకరూపాల్ని పొందినట్లే మినపపిండి ఒకటేముద్ద అయినా అనంతకోటి రూపాల్లో ప్రవేశించి అనేకరుచులు అందింది. మరి యేపిండివంటను గురించికాని ఈ వేదాంత భావాన్ని వెలిబుచ్చడానికి వీల్లేదు.

కులీనతనుబట్టి, విస్తరిల్లిన శాఖలను బట్టి మాత్రమే కాకుండా పెద్దలుఇచ్చే హస్తావలంబనాన్నిబట్టికూడా ఘనతఏర్పడుతుంది. ఎంత ఘనతవున్నా మహనీయుల హస్తావలంబనం లేకపోతే అది వ్యర్థం. బంగారపుపళ్లానికయినా గోడచేర్పు కావాలి. అందులో గారెలికి హస్తావలంబనమిచ్చిన మహనీయుడు సాధారణుడుకాడు. గారెల్ని సృష్టించే మానవుల్నికూడా సృష్టించిన పెద్దసృష్టికర్త దేముడే స్వయంగా గారెలికి హస్తావలంబనం ఇచ్చేడు. ఆసందర్భానివే దేముడుగారెలు ! దేముడు నిజంగా దేముడుగారెల్లో లీనమయ్యాడు. దేముడు ఇల్లా లీనమై అభేదాన్ని అద్వైతాన్ని పొందిన మరోపిండివంట ఏదేనా వుందేమో చూపించండి.నాచెవి కదపాయిస్తాను. కార్తికపౌర్ణమినాడు చలిమిడిచేస్తారు. కాని ఆచలిమిడికి కార్తికేయునిచలిమిడి అనిపేరు రాలేదు. నాగులచవితినాడు చిమ్మిలిచేస్తారు. కాని ఆచిమ్మిలికి నాగస్వామిచిమ్మిలి అని పేరురాలేదు. వినాయకచవితికి ఉండ్రాళ్లు వండుతారు. అందుచేత వినాయకుడికి ఉండ్రాళ్లవినాయకుడు అనిపేరు వచ్చిందేమోకాని ఉండ్రాళ్లకుమాత్రం వినాయకునిఉండ్రాళ్లు అని పేరు రాలేదు. భగవంతుడు ముందు వుంటూ అనగా పురోహితుడులా పురోగామి అవుతూ తనవెనకాలే తిప్పుకుంటూ వచ్చిన పిండివంట గారెలజాతికి చెందిన దేముడుగారె ఒకటే. దీనినిబట్టే గారెలమహత్తు సులభంగా ఊహించుకోవచ్చు.

కులీనతవున్నా, పలుశాఖలుగా విస్తరిల్లినా, మహనీయులిచ్చిన హస్తావలంబనంవున్నా పలువురితో మంచి సంబంధం ఏర్పడక కలుపుగోలువర్తనం లేకపోతే ఏవస్తువు ఘనత అయినా రాణించదు. అన్ని పిండివంటల్లోకి గారెలు ఘనమైనవి కావడానికి వాని కలుపుగోలుతనం ఒక కారణం. గారెలు అల్లప్పచ్చడితో కలుస్తాయి, నువ్వుపచ్చడితో మేళవింపు పొందుతాయి, చింతకాయపచ్చడితో స్నేహంచేస్తాయి, వెలక్కాయపచ్చడితో సమ్మేళనం పొందుతాయి, బెల్లంతో వియ్యం అందుతాయి, పరమాన్నంతో పవ్వళింపుసేవ చేస్తాయి, చారులో స్నానంచేస్తాయి, నెయ్యితో నెయ్యం నెఱుపుతాయి, మంచిపెరుగులో మునిగితేల్తాయి. దగ్గరకువస్తే గారెలు షేక్‌హ్యాండు ఇవ్వని పదార్థంలేదు. అంతా కాస్మాపాలిటన్‌పద్ధతి. బొబ్బట్లకి, బూరెలకి నెయ్యితప్పితే మరోదానితో నేస్తంకట్టదు. పూరీలకు పంచదారతప్పితే మరోదానితో పడదు. మైసూర్‌పాక్, అప్పాలు, లడ్డూలు మొదలైనవి ఒంటెత్తువై, ఒంటిపిల్లి రాకాసులై, ఒకరిపొడ పొందూ కిట్టక ముక్కు క్రింద గోతుల్లోపడి తమ మోతాన్ని తాము చూసుకుంటాయి. బొబ్బట్లకు, బూరెలకు ఒక్క నేతివారితోనూ, పూరీలకు ఒక్క పంచదారవారితోనూ మాత్రం సంబంధం వుంటే గారెలకు అల్లప్పచ్చడివారితో, నువ్వుపచ్చడివారితో, చింతకాయపచ్చడివారితో, వెలక్కాయపచ్చడివారితో, బెల్లంవారితో, పరమాన్నంవారితో, చారువారితో, నేతివా

రితో, మెంతిపెరుగువారితో సంబంధంవుంది. గారెలకు కో అంటే కోటిమంది చుట్టాలు. పలువురితో సంబంధంవుండడంచేత బలగం జాస్తిఅయి గారెల ప్రఖ్యాతి ప్రబలి వాటికి ఘనత ఏర్పడింది.

కులీనతవుండీ, పలుశాఖలుగా విస్తరిల్లీ, మహనీయుల హస్తావలంబనంవుండీ, బంధు బలగం విశేషంగా వున్నప్పటికీ అసలు వస్తు స్వరూపం అందమైంది కాకపోతే అన్నీవుండి ఏదోతనం లేనట్లు అవుతుంది. రూపాన్నిబట్టి కూడా ఘనతఏర్పడుతుంది. అన్ని పిండివంటల్లోకి గారెలరూపం సుందరమైందని ఒప్పుకు తీరాలి. యోగాభ్యాసకులకుమాత్రం విలువ తెలిసే బ్రహ్మరంధ్రంతో గారెలు చక్రస్వరూపాన్నిపొంది బొత్తిగా సన్నంకాకుండా, బొత్తిగా లావుకాకుండా, బొత్తిగా చిన్నవి కాకుండా, బొత్తిగా పెద్దవికాకుండా ఉండవలసిన తీరులోవుండి కంటికీ, కడుపుకీ కూడా ఇంపైవుంటాయి. మిగతా పిండివంటల విషయంలో ఈరూపయోగ్యత లేదు. పూరీలు సన్నం—బొత్తిగా సన్నం—ఇరవైయో నెంబరు పందలపాకమిల్లుబట్టకంటె కూడా సన్నం. గారెలు చిదుపుతూవుంటే ఏమీ చప్పుడుకాదు. అంతా నిశ్శబ్దం. అతిరహస్యం. గప్‌చిప్. పూరీలు చిదుపుతూవుంటే పెట, పెట—తింటూవుంటే ఫెళ, ఫెళ. రహస్యం అన్నది బొత్తిగాలేదు. అంతా ఆర్భాటం. ఇక బొబ్బట్లసంగతి. చూడ్డానికి ఇత్తడి సిబ్బెల్లా వుంటాయి. చిన్నవైతే గారవంలేదు. పెద్దవైతే ఇస్త్రీచేసిన బట్టల్లాగు మడత పెట్టాలి. ఇక బూరెలమాట. నాగస్వరం వూదేవాడి బుగ్గల్లాగ ఉబ్బరించుకుని ఉంటాయి. గుండ్రంగా వుండడంచేత ఒక్కొక్కప్పుడు చేతికి అందక దొర్లు పుచ్చకాయల్లా దొర్లిపోతాయి. నూనికి వేడిచేసినా (అనగా అది మిగల కాగినా), చోవిపిండికి జలుబు చేసినా (అనగా అందులో నీళ్లు ఎక్కువైనా) ఉష్ణం ఉష్ణేతి శీతలం అయి బూరెలు అసహ్యంగా చీదడానికి ప్రారంభిస్తాయి. ఇక వాటిని తినడంఎట్లా? ఇక అప్పాలు. అవి గింజలు పట్టని చిక్కుడుకాయల్లా తప్పలైవుండి పళ్లు లేని ముసలివాళ్ళ కొరకైన పిండివంట అని పించుకుంటాయి. ఇక అరిసెలు. ముందరక్రాపులేని పిలకజుట్టుగల మొగవాళ్లు, కాళ్ళకి కడియాలుపెట్టుకునే ఆడవాళ్లు తప్పితే అరిసెల్ని మోడరన్ పిండివంటగా లెక్కపెట్టే వాళ్లు ఎవళ్లూలేరు. మైసూర్‌పాక్ ఏదో పేపర్‌వెయిట్‌లా ఇంతముక్క ఉండడమే కాని ప్రయోజనంలేదు. చక్కిలాలు పెరుగు ముంతలూ, నేతిపిడతలూ మోసే ఉట్టిమట్టుల్లావుండి చిదుపుతూవుంటేనూ, నమలుతూ వుంటేనూ తాటాకుగొడుగుమీద వర్షం కురిస్తే అయ్యే చప్పుడువంటి చప్పుడు అవుతాయి. జంతికలు వట్టి గడ్డితోఅల్లిన సాలెగూడుల్లా వుంటాయి. పరమాన్నం పిండివంటలలో లెక్కపెట్టడానికి మీకు అభ్యంతరం లేకపోతే నేనూ దాన్ని పిండివంటలలో జమ చేస్తాను. కాని దాన్ని పొట్లంకట్టుకోడానికి వీల్లేదు. దానికి అసలు రూపమేలేదు. ఎందులోపోస్తే ఆరూపాన్ని పొందుతుంది. లడ్డు చూడ్డంతోటే లడ్డూఖాన్ జ్ఞాపకంవచ్చి తిండిమీది దృష్టి దిగనారిపోతుంది. ఇడ్డెన్లు ముణుచుకు కూచున్న తెల్లతాంబేళ్లల్లా వికృతంగా వుంటాయి. వానికి స్థూలదృష్టేకాని సూక్ష్మదృష్టిలేదు. జిలేబీ రుచికి ఎల్లావున్నా రూపానికి అల్లిబిల్లిగా అల్లుకొన్న ఉచ్చెంత డొంకలావుంటుంది, చెవుగోడీలు, పెసరపుణుకులు, పాలకాయలు, గోధుంగవ్వలు మొత

లైనవాటిని ఈగారెలముందు, ఈబూరెల ముందు, ఈబొబ్బట్లముందు తలపెట్టడం తిమి తిమింగలాలముందు నత్తల్ని, నాముల్ని తల పెట్టినట్లే వుంటుంది. ఇక ఎటొచ్చి ఏరుపిడ కల్లా వుండే పకోడీలు మిగిలాయి. కాని అవి పకోడీస్వాములవారి స్వంతజిరాయితీలో చేరి పోవడంచేత వాటిని స్మరించడానికికూడా మ నకు అవకాశంలేదు. ఎన్నివిధాల చూశినా పిండివంటలోకంలో గారెలది అతిలోకసౌం దర్యం అని ఒప్పుకుతీరాలి.

కులీనతవున్నా, విస్తృతివున్నా, మహానీ యుల మన్ననఉన్నా, కలుపుగోలుతనంవున్నా సురూపంఉన్నా ఉపయోగించేవేళలో విశేషం లేకపోతే ఏవస్తువుకైనా గణ్యతవుండదు. గారెలవిషయంలో ఉపయోగించేవేళలో కూ డా విశేషంవుంది. మనకి ఎన్నెన్ని పండుగలో వున్నాయి. కాని మహత్తుగలవి అనగా మహాశబ్దం ముందుగల పండుగలు రెండు మాత్రమే ఉన్నాయి. ఒకటి మహాశివరాత్రి, రెండోది మహాలయఅమావాస్య. అందులో మహాశివరాత్రి ఒట్టి కటికిఉపవాసాల పండుగ. ఇక మిగిలిన మహాలయఅమావాస్యనాటి ప్రధానమైన పిండివంట గారెలే. గారెలకి ఎంతఘనతా లేకపోతే అవి మహాశబ్దం ఆది నివున్న రెండుపర్వాల్లోనూ భోజనానికి అను మతివున్న మహాలయఅమావాస్యనాటి ము ఖ్యభక్ష్యాలు అవుతాయి ?

మహాపర్వం అయిన మహాలయఅమా వాస్యనాటి ప్రధానభక్ష్యం అవడంచేత గారె లఘనత అనంతమైనదని నేను అంటే గారె లంటే నాకు పక్షపాతమనీ, గార్లదిన్నె అనే ఇంటిపేరుగల ఘనులవల్ల నేను లంచంపుచ్చు కుని గారెలను పొగడుతున్నాననీ లేనిపోని అనుమానాలకు పోతూ పిడివాదంలో ప్రముఖు లైన కొందరు గారెల్లో నిజంగా ఘనతేవుంటే ఉండ్రాళ్ళకి ఉండ్రాళ్ళతద్దిఅనీ, అట్లకి అట్లతద్ది అనీ ప్రత్యేకం పర్వాలు ఉన్నట్లే గారెలకు గారెలపాడ్యమి అనిగాని గారెల విదియ అని గాని ప్రత్యేకపర్వం వుండవద్దా అనిఅంటారు. అట్టివారికి నేను మనవిచేశేది ఏమిటంటే గా రెలు ఎప్పుడూ ఒకకాలానికి కట్టుబడేవి కా వనీ, అవి సర్వకాలీనమైనవనీ—తద్దినంవస్తే గారెలు, పెద్దలికి పెట్టుకుంటే గారెలు, మహా లయఅమావాస్యనాడు గారెలు, ఆఖరికి సం క్రాంతిపురుషుణ్ణి సాగనంపే కనుముపండుగ నాడు కూడా గారెలే. ఇట్లా ఎప్పుడుపడితే అప్పుడు వచ్చే గారెలికివుండే ఘనత ఏదో ఒకటే ఒక్కపండక్కి లంకిపడిపోయిన వుం డ్రాళ్లు, అట్లు మొదలైనవాటికి వుంటుందా?

ఆఖరికి సంక్రమానిగాణ్ణి సాగనంపే కను ముపండుగనాడు కూడా గారెలే అంటే ఒక విషయం జ్ఞాపకంవస్తూవుంది. కనుమునాడు కాకి అయినా మునుగుతుంది కాబట్టి మనం స్నానంచేసితీరాలనీ, కనుమునాడు మినుము కొరకాలి కాబట్టి మనం గారెలుతిని తీరాలనీ మనపెద్దలు అంటారు. కనుమునాడు నిర్బం ధంగా గారెలు వండుకుతీరాలి. మరి యేపిండి వంట విషయంలోనేనా ఇట్టి నిర్బంధం వుం దేమో, చూడండి. ఉండ్రాళ్ళతద్దినాడు ఉం డ్రాళ్లు వండుకుంటే వండుకోవచ్చు, లేకపోతే లేదు. అట్లతద్దినాడు అట్లు వండుకుంటే వం డుకోవచ్చు, లేకపోతేలేదు. కాని కనుము నాడు గారెలు వండుకోకపోనీ పెద్దలనోట్లో ఆకుటుంబం ఎంతనీచపడి పోతుందో చూద్దురు గాని. ఇతర పిండివంటలవిషయం ఐచ్ఛికం, గారెలవిషయం శాసనం. మహత్తుగలవాని తీరు ఇల్లాంటిది; ఘనతగలవాన్ని రీతిఇల్లాంటిది. కనుకగారెల గణ్యత ఇల్లాంటిది.

కులీనతవల్ల, విస్తృతివల్ల, మహనీయుల మన్ననవల్ల, కలుపుగోలుతనంవల్ల, మంచి అందంవల్ల, ఉపయోగింపబడే వేళావిశేషంవల్ల, సర్వకాలీనమైన వినియోగంవల్ల ఎంత ఘనత కలిగినా, ఎంత గణ్యత సంభవించినా, ఎంతకీర్తి వచ్చినా వీటి అన్నిటికీ శిఖరప్రతిష్ఠగావుండే విశేషోపయోగంకూడా వుండకపోతే సార్థకతలేదు. గారెల విషయంలో విశేషమైన ఉపయోగంకూడావుంది. స్వర్గలోకాన్నుంచి దేవతల్నికూడా భూలోకానికి తెప్పించే ఘనమైనవస్తువులు గారెలే. ఇహలోక సంబంధాలు పూర్తిగా వదిలేసిపోయిన పితృదేవతలు ఈగారెలమూలాన్నే స్వర్గాన్నుంచి ఏడాదికి ఓసారన్నా భూలోకానికి వస్తూవుంటారు. పితృకార్యాల్లో మరోపిండివంటకు స్థానంలేదు. గారెలమహాత్తు అల్లాంటిది. బొబ్బట్లు, పూరీలు, బూరెలు మొదలైన పిండివంటలన్నీ స్వర్గంలో సమృద్ధిగా దొరుకుతాయి. దొరకనివి అల్లా ఒక్క గారెలే. అందుకనే స్వర్గలోకంలోవుండే మన పితృదేవతలు మనం బొబ్బట్లు, పూరీలు, బూరెలు మొదలైనవి చేసుకున్నప్పుడు మన పొలిమేరకేనా రాకుండావుండి గారెలు వండుకుంటున్నామనడంతోటే వచ్చి వాల్తారు. దొరకని వస్తువుకోసం ఎంత తాపత్రయమేనా పడ్డం అన్నిలోకాల్లోనూ వుండేవిషయమే. పూర్వం దేవతలు స్వర్గలోకాన్నుంచి దమయంతి మొదలైన కన్యల స్వయంవరానికిన్నీ, తపోధనులైన ఋషులకు వరాలు ఇవ్వడానికిన్నీ భూలోకానికి దిగివచ్చేవారు. ఇప్పుడు అల్లాంటి స్వయంవరాలుకాని, తపోధనులైన ఋషులుకాని లేరు. కాబట్టి ఇప్పుడు స్వర్గలోకాన్నుంచి దేవతల్ని ఇక్కడికి రప్పించాలంటే ఒక్క గారెలేతప్ప అన్యథా శరణం నాస్తి. మనం గారెలువండడం మానేశామా స్వర్గలోకాన్నుంచి పితృదేవతలు రావడం మానేస్తారు. స్వర్గలోకంలోని పితృదేవతలతో మనకు సంబంధం కలిపే ఏకైకసాధనం గారెల పిండివంటే అనడంచేత దాని ఘనత మీకు అవగతం అవుతుంది. అమృతంతాగ మరిగిన దేవతలుకు కూడా ఆమెతలుపుట్టించి వారిచేత లొట్టలువేయించే గారెలఘనత సామాన్యమైందికాదు.

గారెలవల్ల మనకు స్వర్గసంబంధం ఏర్పడుతోంది. బొబ్బట్లు మొదలైన పిండివంటలవల్ల మనకు కడుపుఉబ్బి డాక్టరుసంబంధం ఏర్పడుతోంది. కాబట్టి పక్షపాతంమాని, మొగమోటంవిడిచి అవి మేలో, ఇవి మేలో చెప్పండి; అవి ఘనమో, ఇవి ఘనమో తేల్చండి. అన్నట్టు మరిచేను. మీరు చెప్పనే అక్కరలేదనీ, తేల్చనే అక్కరలేదనీ అనుకుంటాను. ఏమంటారా? అనుభవజ్ఞులు, అతిలోకప్రతిభాశాలురు అయిన మన పెద్దలు చెప్పేవున్నారు, తేల్చేవున్నారు—తింటే గారెలు తినాలి, వింటే భారతంవినాలిఅని.

ఎంతఘనమైన వస్తువులకయినా విరోధులు ఉంటూనే వుంటారు. పిండివంటల్లో చక్రవర్తి స్థానానికి అర్హమైన గారెలవిషయంలో కూడా కొందరు విరోధులువున్నారు. ఈవిరోధులు రెండురకాలుగావున్నారు. ఒకరకం వారు తినగాతినగా గారెలు చేదుఎక్కుతాయంటారు. రెండోరకంవారు గారెలు తింటే బుద్ధిబలం తగ్గిపోతుందంటారు.

ఈ రెండురకాల విరోధుల్లో మొదటిరకం వారిని అనగా తినగా తినగా గారెలు కనరు ఎక్కుతాయని అనేవారిని 'తినగతినగ వేము తియ్యనుండు' అని చెప్పేవారితో కలిపి పిచ్చి ఆసుపత్రిలో యావజ్జీవం ఇన్‌పేషంటులుగా

వుంచి వేయవలసివుంటుంది.

ఇక రెండోరకంవారితో అనగా గారెలు తింటే బుద్ధిబలం తగ్గిపోతుందనే వారితో కొంచెం జాగ్రత్తగా వ్యవహరించవలసివుంటుంది. కొందరు అబలలు తమ స్త్రీలని తృప్తి పఱచలేక వారు అన్యపురుషులతో పోకుండా వుండేటందుకు వ్యభిచారం మహాదోషమని తాటాకుల్లో అస్తోకమనీషతో వ్రాసిపెట్టినారని తారాశశాంకకారు డంటున్నాడు. గారెలుతింటే బుద్ధిబలం పోతుందనేవారు కూడా ఇట్టి అస్తోకమనీషులే. జఠరం బాగాలేని జల్పాకులందరూ పోగుపడి గారెలుతిని గఱ్ఱున త్రేన్చే ఘనుల్నిచూచి ఓర్చలేక- ఆడలేక మద్దెల ఓటిపోయిందన్నట్లు గారెలు తినలేక అవి తింటే బుద్ధిమాంద్యం ఏర్పడుతుందని ఏవో అవాకులు చెవాకులు పేల్తారు. కుక్కలుకూస్తే చుక్కలు రాలనట్లే వీరిమాటలు ఎవరూ లక్ష్యపెట్టరు, ఎవరూ గారెల్ని తినడం మానరు. అనేకకారణాలవల్ల కలిగిన గారెల ఘనత ఈ పెయ్యమ్మల పెడసరపుమాటల చేత పోయేదికాదు.

వచన భగవద్గీత బహూకృతి

200 ఏండ్ల క్రితము తుపాకుల అనంతభూపాలునిచే- మూలమునకు సరిగా, తేనె తేట వంటి మధురశైలిలో- తెనిగింపబడిన ఈ మహద్గ్రంథమును 'గీతాప్రచారపరిషత్తు' వారు ఉచితముగ పంచిపెట్టుటకు కొన్ని ప్రతులు మా కార్యస్థానమునకు పంపియున్నారు. అభ్యర్థు లీయంశములు గమనింతురుగాక—

(1) ఒక చిరునామాకు ఒక్క ప్రతిమాత్రమే పంపబడును. (2) పంపుట కగు వ్యయము 2 అణాలును తపాలుస్టాంపులు జతపరుపవలెను. బిళ్ళలంపక వ్రాయు జాబులు వ్యర్థములని మనవి.

మేనేజరు—ఆంధ్రభూమి—వేపేరి, మదరాసు.

తిక్కన్న—కీచకునివలపు

[గతమాసపు సంచికలో శ్రీయుత దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారు సంగ్రహించి ప్రచురించిన తిక్కయజ్వ కీచకునివలపుఘట్టపుపద్యములను గూర్చియు, వారు తలపెట్టిన భారతకథాప్రబంధప్రచురణమును గూర్చియు ఆంధ్రవిద్వాంసులు కొందరు తమ అభిప్రాయములను పంపియున్నారు. అందు ఐదింటిని దిగువను ప్రచురించుచున్నాము. శ్రీయుతులు హాలుడు (బి.ఏ.,బి.ఇడి) గారును, సోమంచి అన్నపూర్ణేశ్వరశాస్త్రి (బి.ఏ.,బి.ఇడి) గారును పంపిన అభిప్రాయములు ఒక్కింత దీర్ఘములుగ నుండుటచే పైమాసమున ప్రచురింప నిలిపియుంచితిమి.

—సంపాదకుడు.]

౧

కవిబ్రహ్మ కమ్మని పోగరలో మెలిచిన విగ్రహమే అయినా మిత్రులు శ్రీ దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారు తమ సొంతపనిముట్లుపయోగించకుండానే, అందచందాలు చాటుకొనట్లూ, లోటుపాట్లు మరుగయ్యేటట్లూ క్రొత్తపోజున నిలవబెట్టి చూపించి నప్పుడిదివరలోలేని వొకతీరూ తీయం, ముదువూ పరువూ కనిపించాయి. ఒక చిన్న కదలింపుతో, అలతి మార్పుతో క్రొత్త అందాన్ని తేవాలంటే విగ్రహాన్ని మామూలుగా చూస్తూవెళ్లే ప్రేక్షకుడి చేతకాదు. విగ్రహంలోని ప్రతిరేఖా, ప్రతివంపూ సమీక్షాదృష్టితో అవగాహన చేసుకోగల రసజ్ఞుడైన పరిశీలకుడే ఆపనికి సమర్థుడు.

భారతంలోని కీచకుని ప్రణయగాథ అనేకసార్లు చదివేవారుంటారు. కాని కొలదిమార్పులతో అంతకంటే రసవంతంగా, నిర్దుష్టంగా చేయవచ్చుననే విషయం గమనించేవారు లేరు. శ్రీరెడ్డిగారే యీ ఫక్కికి తొలిబోణీ చేశారనుకోవచ్చు! వారు చేసిన కూర్పులు మార్పులు తీర్పులు అన్నీ తిక్కనపలుకులే. వారికి మిగిలింది పరిశ్రమ. ఆపరిశ్రమ చూపులక్కు తేలికగా కనపడ్డా చేయిపెట్టినప్పుడు 'అబ్బా' అనిపిస్తుంది. పూర్వంలేని కథావేగం, ఐక్యతా, పాత్రగౌరవం స్వభావనిరూపణా చక్కగా అమరించి పొదుపుగల తిక్కనకుకూడా పొదుపునేర్పిన శ్రీరెడ్డిగారి పరిశ్రమ వడ్డీతోకూడా ప్రతిఫలరూపంగా గిట్టుబాటవుతుంది.

చేసినమార్పుల్లోని విశేషాలొకటిరెండు—భారతంలో కీచకుడు ద్రౌపది చక్కదనానికి చిక్కి ఆవిడ కథా కమాయిషీ తెలుసుకోవాలని అక్కదగ్గరకు వెడతాడు. అక్క సుదేష్ణ మర్యాదచేసి కూర్చోపెడితే పాంచాలి గొడవ యెత్తుతాడు. ఇతనివాలకం వైఖరీ చూచి సంగతిగ్రహించి అప్పగారాసంగతి యీసంగతీ మాట్లాడుతుంది, ఇక అక్కడ పనిలేదనుకొని పాంచాలిదగ్గరకు వస్తాడు. అక్కడ నాలుగు మాటలనిపించుకొని తిరిగి అప్పగారిదగ్గరకు వస్తాడు. ఈ తిరుగులాటలో కొంత అనవసరం వుంది. శ్రీరెడ్డిగారి సంగ్రహంలో - కీచకుడు మొదట పాంచాలి చక్కదనానికి పూర్తిగా లొంగిపోతాడు. కొంత తచ్చాడి తారాడి ద్రౌపదినే కులగోత్రం అడుగుతాడు. ఆమె వినిపించుకోదు. ఇక తనవలపుకథ వినిపిస్తాడు. ఆమె మందలిస్తుంది. ఎన్నివిధాల ప్రయత్నించినా ఫలితంలేదనుకొనే సమయాని కప్పగారక్కడకు వస్తుంది. ఇక దానిదానితో లెక్కమిటని యజమానురాలిని కార్యసిద్ధికోసం ఆశ్రయిస్తాడు. పైదానికంటే యీపద్ధతి బాగోలేదూ?

వేరొకసంగతి—భారతంలో ద్రౌపది వలపుకై పెక్కిన కీచకుడితో జంకిస్తేగాని లాభంలేదనుకొని తనభర్తలైన గంధర్వుల పేరెత్తి చంపుతారంటుంది. కీచకుడు హూంకారాలంటాడు. అప్పుడు ద్రౌపది హితఉపదేశించుతుంది. చాపును తెగించిన

వాడికి నీతెందుకు ? నియమంయెందుకు ? ఇక సంగ్రహించినదానిలో నీతులూ అన్నీ చెప్పినతరువాత చివరిమోతాదుగా ప్రాణభయం పెడుతుంది. అతగాడు ఫరవాలేదులే అనే సమయానికి సుధేష్ణ వస్తుంది. ఈరాక మూలంలో లేనిదే. అయినా కథకు మంచిస్థితి కలిగించింది.

ఈ సంగ్రహంలో సుధేష్ణ భారతంలో కంటే మంచి గౌరవం సంపాదించుకొంది. శ్రీకృష్ణారెడ్డిగారి పరిశ్రమ సఫలమయిందని చెప్పుకోవచ్చును. కథావేగాన్ని మందంచేసే వర్ణనలూ అవీ లోపించినా రసం చెదిరిపోదని వీరి సంగ్రథనంచూస్తే తెలుస్తుంది. త్వరలో ఆంధ్రలోకానికి వీరికృషిఫలితమైన, చరిత్రాప్రధానమయిన భారతంచూచేభాగ్యం కలగాలని ఆశిస్తూవున్నాను.

—బొడ్డు బాపిరాజు.

౨

శ్రీ వెంకటకృష్ణారెడ్డిగారి వ్యాసము లీవరకే చదివియుంటిని. వారియెడ నాకు చాల గౌరవభావమీవరకే ఏర్పడినది. శ్రీవారు వ్రాసిన వ్యాసములు ప్రచురింపబోవు భారత కథాగ్రంథమునకు అనుబంధములుగా ప్రకటించుట అవసరము.

కీచకుని వలపుఘట్టమున సౌందర్యవర్ణనగల ఒకటి రెండు పద్యములు విడువకుండినచో బాగుండెడిది. మార్పు చాల ఇంపుగానున్నది.

ఆంధ్రమహాభారతము ఉత్తుంగతరంగఘూర్ణితమగు మహాసముద్రము. కృష్ణారెడ్డిగారి 'సంగ్రహణము' ఒడలు పులకింపజేయు పిల్లతెమ్మెరల నూగులాడు ఊర్మికల ఝర్ఝర ధ్వనులనింపునింపు సెలయేరు.

ఇట్టి సెలయేటిగములే నిజముగా నామహోదధికి జీవనదాతలు.

ముఖ్యకథతో సంబంధములేని యాఖ్యానములను, వర్ణనలను విడనాడిన 'ఊర్జితకథోపేతము' లగు ఆంగ్లకావ్యముల ప్రచురణములను దరుచు చూచుచు అవాంతరకథల అవాంతరములేని తత్పఠనమున ఆనందమందుచున్నాము.

రెడ్డిగారి కృషి

"ప్రోవులై యెందును బ్రోవేర్పడకయున్న
శ్రుతులన్నియు నోజ సూత్రపరిచె"

అన్న ఎఱ్ఱాప్రెగ్గడ వ్యాసస్తుతిని స్ఫురణకుఁ దెచ్చుచున్నది.

వీరి కృషివలన భారతపఠనము సుగమమగుచున్నది. ఇఁకనైన ఆంధ్రయువకులు తత్పఠనమునెడ సుముఖులగుదురుగాత !

—అరవిల్లి నరసింహాచార్యులు, బి.ఏ.

౩

ఆంధ్రమహాభారతము ధర్మ వేదాంత నీతి శాస్త్రములయు, కావ్యలక్ష్యేతిహాసపురాణములయు సముచ్చయము. కావున నది పెక్కురూపుల మన్నింపదగినది. అయ్యును నెల్లవారు నెల్లరూపమున దాని నారాధించుట వ్రేగు. తమ కభిమానవిషయమువెంట చిత్తము పరువెత్తుచుండును. అందు కవివృషభులు, రసికజనులు కావ్యరూపమున ననుభవింపదలచుట సహజము. అందులకుగల యడ్డంకులను తొలగించుట యాంధ్రమహాశయుల ధర్మము. అట్టి మహాకార్యమునకు కంకణము కట్టుకొన్న శ్రీయుతులు దేవరపల్లి వేంకటకృష్ణారెడ్డిగారు వేదవిభాగముచేసిన వ్యాసమూర్తివోలె ప్రస్తుతిపాత్రులు.

తిక్కనకూర్పులో 'కీచకుని మోహఘట్టు' మెంత హృదయంగమమైనను సుదేష్ణాకీచకుల సంభాషణమొకింత పలుచనైనమును జూపును. రసికవరులగు రెడ్డిగారు నిశితమగు తమధీశక్తిచే నందలి యలుపములను దొలగించి కావ్యశిల్పమునకు మెఱుగులుదిద్దినారు. ఇట్టి ప్రయత్నము ఆంధ్రవాఙ్మయమునకు క్రొంగ్రొత్త. దీనికి దారితీసిన రెడ్డిగారు ధన్యులు.

తిక్కనకూర్పులో సుదేష్ణ 'లలితంబులగు మట్టియలచప్పుడింపార' నిత్యాదిప్రశ్నమునకు కీచకుడు 'నాకొలువువారకారు...' అని ముందుడిగా బదులు చెప్పును. రెడ్డిగారి సంగ్రథనమునందా ప్రశ్నమును తొలగించి ప్రత్యుత్తరమునుంచినారు. ప్రత్యుత్తరముచే ప్రశ్న మాకర్షితము కావచ్చును. కాని

యల్లిక సడలుపడుచున్నదేమోయని నాసందియము. అయిన నాప్రాశ్నికమగు పద్యమంతయు గాక యందలి గీతమున నుత్తరార్ధముమాత్ర ముంచుటగానీ, యాభావమును సరసరీతిని వచనమున గూర్చుటగానీ సముచితమేమోయని నాసూచన. ఆలోచింపప్రార్థితులు.

రెడ్డిగారు పూనిన కార్యము కరము సున్నితము. దానిని వారు మెలకువగ తీర్పగలరని యిప్పుడు కూర్చిన భాగముంబట్టి దెలియుచున్నది. వారి యీతీర్పు సమగ్రముగ నెఱవేరునట్లు భగవాను డనుగ్రహించుగాక.

ఉభయభాషాప్రవీణ,

—వడ్లమూడి వేంకటరత్నము.

౪

శ్రీవెంకటకృష్ణారెడ్డిగారి పద్యసంగ్రహమును మూలముతో పోల్చిచూచితిని. క్రమము మార్చినారు. శ్రీవెంకటకృష్ణారెడ్డిగారు భారతమును బాగుగ పఠించినవారని ఆంధ్రభూమినుండియే గ్రహించితిని. అట్టిచో వారేయభిప్రాయముతో క్రమము మార్చినారో వారితో స్వయముగ చర్చించిగాని తెలిసికొనుటకు వలను పడకున్నది. అది తెలిసికొనిగాని అభిప్రాయమిచ్చుట సమంజసముగాదు. తిక్కన రచనలో కీచకుని మానసికపరిణామమును సోపానపఙ్క్తులతో నిరూపించినాడు. ఆపద్యములను తారుమారుచేయుట వలన అతని రచనలలో నపురూపముగ గానవచ్చు మానసికపరిణామనిరూపణము చెడును. ఇక్కడ చెడినట్లు తోచుచున్నది. ఇది స్థూలదృష్టిని పురస్కరించుకొని చెప్పినమాట. శ్రీవెంకటకృష్ణారెడ్డిగారేమయిన చక్కని కారణముల నీయగలిగియుందురేమో! 'ముఖేముఖే సరస్వతి' గదా!

—నండూరి బంగారయ్య, బి.ఏ.

౫

ఆంధ్రభాషోద్యానమున నభినవసుమలతల నంటుగట్టిన హరిహరనాథభక్తుఁడు తిక్కయజ్వ: 'సాత్యవతేయసంస్మృతి శ్రీవిభవాస్పదం బయిన చిత్తము'తో కవితామాధురీవిలసితంబైన భారతామ్నాయమునుండి శ్రీ డి. వి. కృష్ణారెడ్డిగారు సంగ్రహించిన ఈ 'కీచకునివలపు' అను ఘట్టము మనోజ్ఞతరముగా నున్నది. ఈఘట్టము నేను స్వయముగా చేసిన సాహిత్యకృషిలో మేటియానందము నాకొసంగినది. నేటి ప్రశ్నకూడ దానిపైననే కావున నతిశయించిన మోదముతో నీయభిప్రాయము వ్రాయుచున్నాను. కొత్తసంగ్రహణమున నీఘట్ట మీక్రింది విషయములచే మనోజ్ఞముగ నున్నదని నేను నిర్ధారించుచున్నాను.

(1) భాషాభివృద్ధికై చదువు ఆంధ్రవిద్యార్థులకీ సంగ్రహరచన యొక ప్రబంధమువోలె చక్కని క్రమముతోనుండి కవిబ్రహ్మ కవితను, కథాగమనికలో సౌలభ్యమును ఒక్కచో సమకూర్చుచున్నది.

(2) మూలగ్రంథములో తిక్కయజ్వ చూపినదానికన్న కథాశీఘ్రగమనిక (Quick Motion of the story) పాత్రల మనఃప్రవృత్తులు (Psychological affects of the characters) నీ సంగ్రహరచనలో రమణీయతరముగా నున్నవి. ఉదాహరణముగా మూలములో 'ద్రౌపదీరూపమను నురిదగిలి' అనుపద్యముకడనుండి 'వెరవక ననుఁజూచె' నను పద్యమునకు నడుమగల కాలమును, రెడ్డిగారి సంగ్రహణనైపుణ్యము నరయఁదగు.

(3) కీచకుఁడప్పగారివద్ద పల్కు "గండుమీలకుబుట్టి కాముబాణములకు" అనియును తిరిగి సుధేష్ణయొక్క "లలితంబులగు మట్టెయల చప్పుడింపార" ననియును బొత్తుగా ననౌచిత్యసంభాషణములను తగ్గించి సంగ్రహముగా పాత్రౌచిత్యమును పాటించి, చక్కని చిన్నచిన్న సంభాషణములతో నింపైన పాత్రపోషణరీతులతో నొప్పుచున్న శ్రీకృష్ణారెడ్డిగారి రచన తిక్కనకవి మూలమునకుగూడ సౌందర్యపుష్టి నొసంగుచు ఆధునిక(నవ్య)కావ్యములరీతి భావుక మనోహారంబై యొప్పుచున్నదనిన యెంతమాత్రమును సత్యదూరము కాజాలదు.

—విద్వాన్ పాలెపు వేంకటరత్నము.

"ఆంధ్రభూమి" పుస్తకపీఠము


౨౦౨. స్వప్నానసూయ

శ్రీయుత అకుండి రామమూర్తిగారిచే రచియింపబడిన విదాశ్వాసముల పద్యకావ్యము. ప్రతిపుటకును ఎఱ్ఱసిరాలో బోర్డరుముద్రించి ఆబోర్డరులో నల్లసిరాతో పద్యములు ముద్రించుటచే గ్రంథమునకు క్రొత్తయందము వచ్చినది. శ్రీవారు వైద్యులు కవులు కూడనై యున్నారు. పాలకొల్లు వైశ్యప్రముఖులు చుండూరి నారాయణరావుగారు దివంగతయైన తమ భార్య అనసూయపేరు శాశ్వతముగ భూమియందు నిలచుటకు కావ్యము రచింపగోర మూర్తిగారు దీనిని రచించిరి. కవిగారిస్వప్నమున కనిపించిన పురాణములలోని అత్రిమహాముని అనసూయయు, పుణ్యలోకమునయున్న నారాయణరావుగారి అనసూయయు పాతివ్రత్యాదివిషయములనుగూర్చి సంభాషించుట ఇందలి ఇతివృత్తము. సుప్రసిద్ధులు పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి కావ్యమునకు పీఠిక వ్రాసియున్నారు. వలయువారు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారు, పల్లెపాలెము, కాకినాడతాలూకా తూర్పుగోదావరిజిల్లా అనివ్రాసినచో ఉచితముగ బడయగలరు.

౨౦౩. త్రిలోచనకవిరాజు

యువకార్యాలయం—తెనాలి వారు అనుబంధంగా ప్రకటించిన కథాకావ్యం. మూలలేఖకుడు: స్వర్గీయ రవీంద్రనాథమైత్రే. అనువాదకుడు : చక్రపాణి. వెల : ఆరు అణాలు—ఈ గ్రంథంలో ౧ త్రిలోచనకవిరాజు ౨ ఆల్ స్టార్ ట్రాజెడీ 3 నారీద్వేషి ౪ వెల్లువ ౫ సంస్కారి ౬ ఆఖరుపేజీ అనే కథలున్నాయి. 'రవీంద్రునిరచనలో ఏదోఒకతేజస్సు మనకుకనిపిస్తుంది. సాహిత్యం వ్రాయటానికి (అంటేకే?) అవసరమైనవన్నీ వీరికి లభించినవి.' అనీ, ఇంకా 'రవీంద్రుడు తనపాత్రలతో లీనమైపోతాడు. పాత్రలను సృష్టించే టప్పుడు తనవ్యక్తిత్వాన్ని వాటిలో ఐక్యంచేస్తాడు. తనకథలు మిత్రులకుచదివి వినిపించేటప్పుడు పాత్రల కష్టాలకు కళ్ళవెంటనీళ్లు కార్చేవాడట' అనీ అనువాదకులు కవితో పరిచయం చేశారు. కాని యీకథలలో. మనస్సు లోబరుచుకొనే సన్నివేశ మొకటీలేదు. మొత్తంమీద కథలన్నీ ఖులాసాగా చదువుకుంటానికి పనికివస్తాయి. అంతే. పెద్ద ఓజస్సు అదీ యేమీ యీకథలలో ప్రత్యక్షం కాదు. 'ఏసాహిత్యంలోనైనాకాని, హాస్యరచనలలోని పాత్రలు చాలా కాల్పనికంగా వుంటవి- స్వాభావికత్వంవుండదు.' కనుక వాస్తవికజగత్తుకు దూరంగావుంటే ఆపాత్రల కష్టసుఖాలకు పాఠకుల సానుభూతి యేమాత్రమున్నా వుండదు. ఈవిషయం తొలికథ 'త్రిలోచనకవిరాజు'లోనే స్ఫుటం అవుతుంది. ఈ తెనుగింపులోకల్లా 'వెల్లువ' అనేది కొంచెం వుత్తమమయింది. గృహిణీత్వానికి, స్త్రీస్వాతంత్ర్యేచ్ఛకూ కలిగిన సంగరమే యీకథా స్వరూపం. చివరకు గృహిణీత్వమే గెలుస్తుంది. మొదటి కథా యిదీ, మునిమాణిక్యంవారి 'ప్రేమాసుపత్రి' (పేరిదే అని గుర్తు) 'ఎండావానా'ల్తో చాలామట్టుకు పోలి వుంటాయి. 'నారీద్వేషి', 'సంస్కారి' విఫలప్రయత్నాలతో చెడిన అంటే లోకప్పోకడలో బాగుపడిన యువకుల యౌవనోద్వేగాన్ని చిత్రిస్తున్నాయి. మిగిలిన రెండూ మామూలు రకం. చక్రపాణిగారి అనువాదంలో పూర్తి అయిన తెనుగువచనం చూడలేము. 'లవంగమంజరి అంటుంది —"ఊఁ", అనేదానికన్నా 'ఊఁ' అంటుంది లవంగమంజరి' అంటే బాగుండదా? ఈ కొలది మార్పులతో తెనుగుతనం చూపిస్తూ ఇంతకన్నా మంచి కథలను ముందుముందు అనువదించాలని కోరుతూ వున్నాము. యువకార్యాలయంవారు పూనిన యీ తెనుగు తల్లి యీడిగము అడ్డులేకుండా సాగాలని మా ఆశీర్వాదం—

—రాజు.



1937, డిశంబరు.

15 :—సికిందరాబాదు: పగోపకారిణీపాఠశాలా స్థాపకురాలు శ్రీమతి సీతమ్మగారి మరణము.

18 :—ఏలూరు: సప్తమ ఆంధ్రనాటక కళాపరిషత్ సభ. తూములూరి శివరామయ్య (బి.ఏ., బి.ఎల్.) గారి అధ్యక్షత.

19 :—ఏలూరు: సురభినాట్యమండలి స్థాపకులు వనారస గోవిందరావుగారి సప్తతివత్సర పరిపూర్త్యుత్సవము.

20 :—ఋణనివారణచట్టమును చర్చించుటకు మదరాసు అసెంబ్లీ సమావేశము.

23 :—గుంటూరు: ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీ విద్యార్థుల సమ్మె ముగిసినది.

29 :—చెన్నపురి: రాష్ట్రరైతుల మహాసభ. శ్రీవేమవరపు రామదాసు పంతులుగారి అధ్యక్షత.

30 :—విశాఖపట్టణము: ఏడవ స్వదేశీ వస్తుప్రదర్శనము.

31 :—మద్రాసు: వ్యవసాయదారుల ఋణసహాయక బిల్లు సెలక్టుకమిటీవారి సిఫారసులతో ప్రచురింపబడినది.

:—మద్రాసు; ఆంధ్రా హరిజన తిరువాన్కూరు యాత్రాదళ ప్రయాణ ప్రారంభము. శ్రీ మాగంటి బాపినీడుగారు నాయకులు.

1938, జనవరి.

6 :—నెల్లూరు: శ్రీయుత దేవరపల్లి వెంకటకృష్ణారెడ్డిగారు జిల్లా ఎడ్యుకేషనల్ కౌన్సిలు ప్రెసిడెంటుగ ఎన్నుకొనబడిరి.

7 :—విశాఖపట్టణము: రవిన్యూమంత్రి అధ్యక్షతను జమీందారీభూముల విచారణసంఘ సమావేశ ప్రారంభము.

8 :—మదరాసు: రాష్ట్ర గ్రామ పంచాయతీల మహాసభ. టి. ఏ. రామలింగశెట్టియారు, (బి.ఏ., బి.ఎల్) గారి అధ్యక్షత.

10 :—చెన్నపురి: వైస్రాయి రాక.

:—అలహాబాదు: మోతీలాలు నెహ్రూసతి, జవహరులాలు తల్లి శ్రీమతి స్వరూపరాణి మరణము.

11 :—బందరు: 'కాంతంకథల' రచయిత మునిమాణిక్యం నరసింహారావుగారి భార్య శేషగిరమ్మగారి మరణము.

12 :—నెల్లూరు: శ్రీరామాఫిలిమ్సువారి 'చిత్రనళీయము' వివిధప్రాంతములందు విడుదల అయినది.

15 :—కల్లూరు: (హిందూపురము తాలూకా) శాసనసభ్యులగు కల్లూరి సుబ్బారావుగారి భార్య మరణము.

16 :—సాంబల్‌పూరుజిల్లా బాలంగీర్: ఆంధ్రప్రముఖుడు శ్రీ కోడి రామమూర్తిగారి మరణము.

:—బెజవాడ: ఆంధ్రరాష్ట్రకాంగ్రెస్ సంఘ సమావేశము. తిరిగి డాక్టరు పట్టాభి, గొట్టిపాటి బ్రహ్మయ్యగార్లు అధ్యక్ష కార్యదర్శులుగ ఎన్నుకొనబడిరి.

17 :—ఆంధ్రరాష్ట్ర సౌహార్ద్రసంఘమువారు శ్రీ కె. కోటిరెడ్డిగారి యాజమాన్యమున ఉత్తర సర్కారుల సంచారము ప్రారంభించి బెజవాడ వచ్చిరి.

19 :—కంబము (కర్నూలుజిల్లా): ఆంధ్రదేశ అటవీ రైతాంగ మహాసభ. ప్రొఫెసర్ యన్. జి. రంగాగారి అధ్యక్షత.

Printed at The Andhrabhumi Printing Works, Vepery, Madras.
Editor & Publisher: Andra Seshagiri Rao. B.A.